సెప్టెంబర్
2025

233

సంపుటి : 21 సంచిక : 4

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

భారత దేశ అభివృద్ధిపై ప్రచారము, వాస్తవాలు
కళలు ప్రజల స్వంతం
కొనసాగుతున్న బుల్డోజర్ రాజ్
ఢిల్లీ సుల్తానుల కాలం: ఖిల్జీలు, తుగ్లఖ్‌లు
ప్రభుత్వ భూములు ప్రైవేటు కంపెనీలకు దారాదత్తం
సమాఖ్య విధానానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వ వాదనలు
ప్రాచీన భారత దేశంలో సైన్సు సంప్రదాయం
నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం

స్ఫూర్తి

# నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం

పిబి చారి

సమాజంలో మకిలి పట్టిన మాయదారి దురాచారాల దుమ్ము దులిపిన సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం. బూజు పట్టిన సిద్ధాంతాలతో తిరోగమనంలో సాగుతున్న సమాజానికి ప్రత్యామ్నాయ సాధికారిక మార్గాన్ని చూపిన నవయుగ వైతాళికుడు. అతని కలం, కాలంచెల్లిన కట్టుకథలను కండఖండాలుగా నరికే కరవాలం. ఎన్ని అవమానాలు ఎదురైనా, అసహనాలు దరిచేరినా, సమాజం నుండి వెలివేసినా, సమాజం కోసం సంకల్ప బలంతో తన కలలను పండిస్తూ, తెలుగుజాతిని జాగృతం చేసిన గొప్ప సంస్కర్త. జీవించినంత కాలం సంఘం కోసం శ్రమించిన, సంఘర్షించిన, జ్వలించిన విప్లవ జ్యోతి.

తెలుగు నేల మీద సంఘసంస్కర్తల జాబితాలో కందుకూరి వీరేశలింగం పంతులుకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. వీరేశలింగం జీవిత చరిత్ర తెలుసుకుంటే తెలుగు నేలమీద 150 సంవత్సరాల క్రితం సామాజిక చరిత్రను తెలుసుకున్నట్లే. తెలుగింట వితంతు వివాహాలు జరిపిన మొదటి వ్యక్తి ఆయన. సహవిద్యా పాఠశాల అంటే ఆడపిల్లలు మగ పిల్లలతో కలిసి చదువుకోటానికి మొట్టమొదటి పాఠశాలను స్థాపించిన వాడు అతడే. మొట్టమొదట బాలికల కోసం పాఠశాలను ప్రారంభించిన వాడు, తెలుగులో మొదటిసారి వచనంలో స్వీయ చరిత్ర రాసినవాడు, తెలుగులో మొట్ట మొదటి నవల రాజశేఖర్ చరిత్ర రాసిన వ్యక్తి, తెలుగులో తొలి ప్రహసనం అంటే హ్యూమర్ స్కిట్ రాసిన వ్యక్తి, అనేక రూపకాలు, నాటకాలు మొట్టమొదటిసారిగా రాసిన వ్యక్తి కందుకూరి వీరేశలింగం.

వీరేశలింగం తాత గారి పేరు కూడా వీరేశలింగం పంతులే. నేటి ప్రకాశం జిల్లాలోని "కందుకూరు" వారి స్వస్థలం. ఉద్యోగరీత్యా కందుకూరు నుండి రాజమహేంద్రవరం కుటుంబంతో సహా వెళ్లారు. అప్పటినుండి వారి ఇంటి పేరు కందుకూరిగా స్థిరపడింది. తాతగారైన వీరేశ లింగం పంతులు గారి ఇద్దరు పిల్లల్లో చిన్నవాడైన సుబ్బారాయుడు పున్నమ్మ దంపతులకు పుట్టిన వాడే మన వీరేశలింగం జూనియర్. ఆయన 1848 ఏప్రిల్ 16న రాజమహేంద్రవరంలో పుట్టారు. నాలుగేళ్ల



వయసులో ఉన్నప్పుడే తండ్రి చనిపోయాడు. పెదనాన్న వెంకటరత్నం గారి పెంపకంలో పెరిగాడు. ఐదో ఏట బడిలో చేరాడు. 1860లో అంటే ఆయనకు 12 సంవత్సరాల వయసున్నప్పుడు గవర్నమెంట్ స్కూల్‌కి వెళ్లి ఇంగ్లీష్ కూడా నేర్చుకోవడం ప్రారంభించాడు. ఏదైనా ఒకటి రెండు సార్లు చదివితే చాలు గుర్తుండిపోయేవి. చిన్నప్పటినుండి చాలా చురుకుగా ఉండే వీరేశలింగం అన్ని తరగతులను ప్రథమ శ్రేణి లో పాసయ్యారు. నాటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా ఆయన 13వ ఏట అద్దంకి పట్టాభిరామయ్య గారి అమ్మాయి బాపమ్మతో వివాహం చేశారు. ఆ తర్వాత ఆమె పేరు రాజ్యలక్ష్మిగా మార్చారు. ఆ రోజుల్లో బాల్యవివాహాలు ఎక్కువ. 1867లో తన పెదనాన్న వెంకటరత్నం గారి మరణంతో కుటుంబ బాధ్యత పెరిగింది. తన 23 ఏట అధ్యాపకునిగా రాజమండ్రిలో ఒక మండల పాఠశాలలో వృత్తి జీవితం ప్రారంభించారు. అప్పుడు ఆయన నెల జీతం 20 రూపాయలు. అప్పటికే ఆయన పత్రికల్లో వ్యాసాలు రాస్తూ ఉండేవారు. రాజమండ్రిలో "గోదావరి విద్యా ప్రబోధి" అనే పత్రికలో పద్య కావ్యాలు వ్యాసాలు రాశారు.అక్కడ రెండు సంవత్సరాలు పనిచేశాక 1872లో దగ్గరలోని కోరంగిలో ఇంగ్లీష్ మాస్టారుగా పనిచేశారు. ఆయన ఉద్యోగంలో ప్రవేశించిన మొదట్లో బందరు (మచిలీపట్నం) నుండి "పురుషార్థ ప్రధాని" అనే పత్రిక వచ్చేది. ఆ పత్రికలో కూడా వ్యాసాలు పద్యాలు లాంటివి వ్రాసి పంపించే వారు. అక్కడ రెండు సంవత్సరాలు పనిచేసిన తర్వాత 1874లో కోరంగి నుండి ధవళేశ్వరం వచ్చి అక్కడ స్కూల్లో మరో రెండు సంవత్సరాలు పనిచేశారు. మొత్తం 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలోనే తెలుగు పండితుడిగా పనిచేసి, తరువాత మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్లు పనిచేశారు.

ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న విరేశలింగానికి నాటి సమాజంలో ప్రబలంగా ఉన్న బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహానిషేధం, స్త్రీ విద్య నిషేధం, కన్యాశుల్కం, మూఢనమ్మకాల ఆధిపత్యం వంటివి నచ్చలేదు. అందువల్ల ఆ దురాచారాల మధ్య నలుగుతున్న బతుకులకు బాసటగా నిలవాలని నిర్ణయానికి వచ్చారు. దాంతో ఒక సాధారణ స్కూలు టీచర్‌గా మొదలైన ఆయన సంఘసంస్కర్తగా మారారు. సంఘసంస్కరణలకు ప్రాచుర్యం తీసుకురావడం కోసం అనేక పత్రికలను స్థాపించారు. రచయితగా మారి అనేక అద్భుత గ్రంథాలను రాశారు.

రాజా రామ్మోహన్ రాయ్, దేవేంద్ర నాథ్ ఠాగూర్, కేశవ చంద్రసేన్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ల బోధనలు రచనలు వీరేశలింగం ఆలోచనల్లో విప్లవాత్మకమైన మార్పుని తెచ్చాయి. ప్రజల మెదడులలో ఇంకిపోయిన సనాతన బూజును దులపాలంటే ముందుగా వాళ్లలో అక్షర బీజాలు నాటాలని భావించాడు. దానికి అనుగుణంగానే వీరేశలింగం ఆడువారు వంటింటికే పరిమితం అనే అనాగరిక కట్టుబాటును ఎదిరించి స్త్రీ విద్యకై ఉద్యమించి ప్రచారం చేయడమే కాక బాలబాలికల కొరకు పాఠశాలను ప్రారంభించాడు. మగ పిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకోవటానికి సహవిద్య విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఆడవాళ్లు స్కూళ్లకు రాకూడదు చదువుకోకూడదు అని కొక్కొండ వెంకటరత్నం లాంటివాళ్ళు పత్రికల్లో వ్యాసాలు రాస్తుంటే దానికి వ్యతిరేకంగా వీరేశలింగం తన పత్రికలో ఆడవాళ్లు చదువుకోకూడదని ఎక్కడ చెప్పారు? ఏ పురాణాల్లో ఉంది? ఏ కావ్యంలో ఉంది? ఏ పెద్దలు చెప్పారు? ఏ మతంలో ఉన్నది? అని ఈయన ఎదురు తిరిగి ప్రశ్నించి స్త్రీకి విద్య అత్యంత ముఖ్యమని చాటి చెప్పాడు. అంటరాని కులాలకు చెందిన పిల్లలను కూడా చేర్చుకొని మిగతా పిల్లలతో కలిసి కూర్చోబెట్టేవారు. వారికి ఉచితంగా చదువు చెప్పటమే కాకుండా పుస్తకాలు బలపాలు పలకలుకూడా కొని ఇచ్చేవారు. అప్పట్లో ఇది

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...

1. నవయుగ వైతాళికుడు
కందుకూరి వీరేశలింగం
పిబి చారి.........2

2. భారత దేశ అభివృద్ధిపై ప్రచారము, వాస్తవాలు
అకోశ మోడి .....4

3. కళలు ప్రజల స్వంతం
మలయశ్రీ హష్మి ఇంటర్వ్యూ.......10

4. కొనసాగుతున్న బుల్డోజర్ రాజ్
అనుజ్ బెహల్ .........14

5. డిల్లీ సుల్తానుల కాలం: ఖిల్జీలు, తుగ్లఖ్‌లు
ఎంవిఎస్ శర్మ......19

6. ప్రభుత్వ భూములు ప్రైవేటు కంపెనీలకు దారాదత్తం
ఇ ఆ స శర్మ.........22

7. సమాఖ్య విధానానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వ వాదనలు
ఎ కోటిరెడ్డి.........29

8. ప్రాచీన భారత దేశంలో సైన్సు సంప్రదాయం
ఎస్ వెంకట్రావు........32



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visitcpi(m)site at:cpim.org


# పచ్చి నిరంకుశత్వం

'నీవు దోషివని నిరూపణ అయ్యేవరకు నిర్దోషివే' అనేది న్యాయ శాస్త్రంలో ప్రాథమిక సూత్రం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, ఈ న్యాయ సూత్రాన్నీ, మన రాజ్యాంగం నెలకొల్పిన ప్రజాస్వామిక సూత్రాలనూ గంగలో కలిపేస్తుంది. వ్యక్తి స్వేచ్ఛను హరిస్తుంది. రాజ్యాంగం ప్రతిపాదించిన ఫెడరల్ సూత్రాన్ని నిర్వీర్యం చేస్తుంది. అన్నిటికీ మించి ప్రతిపక్షాలను వేటాడి వెంటాడి నింకుశంగా అణచివేస్తుంది. ఆర్ఎస్ఎస్-బిజెపి నయాఫాసిస్టు ఎజెండాలో భాగమైన ఈ బిల్లును ప్రస్తుతానికి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి నివేదించినప్పటికీ ఇది భారత ప్రజాస్వామ్యం మెడమీద కత్తిలా వేలాడుతూ ఉన్నది.

భారత ప్రధాన మంత్రి, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు అయిదేళ్ల శిక్షార్హమైన ఏ కేసులోనైనా 30 రోజుల పాటు జైలులో ఉంటే చాలు 31వ రోజున పదవీచ్యుతుడవుతాడని బిల్లు నిర్దేశిస్తోంది. అవినీతి నిర్మూలనకు బిల్లు తెస్తే మంచిదే కదా అని కొందరికి అనిపించొచ్చు. ప్రజాప్రయోజనాలు, సంక్షేమం, సత్పరిపాలన పేరుతో ప్రవేశపెట్టినప్పటికీ వాస్తవంగా ఈ బిల్లును ప్రతి పక్షాలపై బ్రహ్మాస్త్రంలా ఉపయోగించుకోడానికే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నది నిజం. 'ప్రతిపక్షాలు జైళ్ల నుండి పరిపాలించడానికి అవకాశం ఇవ్వాలా' అని ప్రధాని మోడీ ఇటీవల బీహార్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ బిల్లును సమర్థించుకున్నారు. కానీ ఇటీవల ఢిల్లీ ముఖ్యమంత్రితో సహా అనేక మంది మంత్రులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్షసాధింపు కోసం ఎలా జైళ్లపాలు చేసిందో చూశాం. అందువల్ల మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లు నిజంగా అవినీతిని నిర్మూలించేది కాదనీ, ప్రతిపక్షాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ ఖూనీ చేసేదని అర్థమవుతుంది.

ఈ బిల్లు చట్టమైతే మంత్రులు దోషులుగా నిరూపించబడక్కరలేదు కేవలం అరెస్టయి 30 రోజులు జైల్లో ఉంటే చాలు పదవీచ్యుతులవుతారు. అంటే కేంద్ర ప్రభుత్వం తనకు ఇష్టం లేని రాష్ట్రాల ముఖ్యమంత్రులపైనా, మంత్రులపైనా ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) వంటి కేంద్ర సంస్థలను ఉసిగొల్పి కేసులు పెట్టి నెలరోజుల పాటు బెయిలు రాకుండా చూస్తే చాలు వారి పదవులు ఊడిపోతాయి. ఇప్పటికే కేంద్ర దార్యాప్తు సంస్థలను ఉపయోగించుకుని ప్రతిపక్షాలను అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నిస్తున్న బిజెపి, కేంద్ర ప్రభుత్వం చేతిలో ఇది మరో నిరంకుశ అస్త్రంగా మారుతుంది. కేవలం ప్రతిపక్ష నేతలనే కాదు, రాష్ట్ర ప్రభుత్వాలనే తన గుపెట్లో పెట్టుకోడానికి కేంద్రానికి ఇది పెద్ద సాధనమవుతుంది.

ఇతర పార్టీల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అనేక మంది నాయకులు, మంత్రులు బిజెపిలో చేరగానే లేక ఎన్డీఏ కూటమిలో భాగస్వాములు కాగానే పవిత్రులైపోతున్న వైచిత్రాన్ని మనం నిత్యం చూస్తున్నాం. ఇడి వంటి సంస్థలు ప్రధానంగా ప్రతిపక్ష నేతలనే లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఒకవేళ ఇడి కేసు ఎదుర్కొంటున్న నేత బిజెపిలోనో, పాలక కూటమిలోనో చేరితే అతనిపై కేసు మూలపడిపోతుంది. గత కొన్ని సంవత్సరాల్లో అది పెట్టిన 5,000కు పైగా కేసుల్లో కేవలం 38 కేసుల్లో మాత్రమే శిక్ష పడిందంటే వాటిలో అనేకం అనవసరమైన కేసులని తేలిపోతుంది. అంతేకాదు 2014, 2022 మధ్య ఇడి కేసుల్లో 95 శాతం ప్రతిపక్షాలమీద పెట్టినవే.

ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లు వెనుకనున్న దురుద్దేశాన్ని అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. రాజ్యాంగ సవరణ బిల్లు అమోదం పొందాలంటే పార్లమెంటు సభ్యుల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ రావాలి. లోక్ సభలో సగం మంది సభ్యులు కూడా బిజెపికి లేరు. ఎన్డీఏ కూటమి మొత్తం కలుపుకున్నా మూడింట రెండ రెండువంతుల బలం రాదు. అయినా ఇటువంటి నిరంకుశ బిల్లు ప్రవేశపెట్టడం కాషాయ పార్టీ బరితెగింపును తెలియజేస్తోంది. ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు ఎజెండాలో భాగంగా తెస్తున్న ఇటువంటి నిరంకుశ చట్టం కేవలం ప్రతిపక్షాలమీదనే కాదు, కాషాయ మార్గంలో పయనించడానికి ఇష్టపడని అన్ని పార్టీలకూ యమపాశమే అవుతుంది. అందువల్ల ఎన్డీఏ భాగస్వాములైన తెలుగుదేశంతో సహా వైసిపి, బిఆర్ఎస్ వంటి పార్టీలు కూడా వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది.

ఈ మాసం ముఖ్యాంశం

# భారత దేశ అభివృద్ధిపై ప్రచారము, వాస్తవాలు

అశోక మోడీ



రచయిత గతంలో ప్రపంచ వ్యాంకు, ఐఎంఎఫ్‌లో పనిచేశారు. ఇటీవలనే ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యారు. ఆయన 'ముక్కలైన భారత్', ప్రజలకు ద్రోహం; నేటి స్వాతంత్ర్యం (2023) అనే పుస్తకాలు రాశారు

కొన్ని సందర్భాలలో ఒక చిన్న అంకె కూడా పెద్దకథ చెబుతుంది. 2024–25లో భారత దేశంలోకి 35.3 కోట్ల డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) వచ్చాయనేది కూడా అటువంటి కథే. విదేశీయులు వెనక్కు తీసుకున్న నిధులు, భారతీయులు విదేశాలలో పెట్టుబడులు పోనూ గత 25 సంవత్సరాలలో నికర విదేశీ పెట్టుబడులు అత్యంత తక్కువగా (2003–04లో 240 కోట్ల డాలర్లు) వచ్చిన సందర్భం ఇది. 2003–04లో వచ్చిన 240 కోట్ల డాలర్ల కన్నా ఏడు రెట్లు తక్కువగా 2024–25లో వచ్చింది. మరో విధంగా చూస్తే 2020–21లో అత్యున్నత స్థాయిలో వచ్చిన 4,400 కోట్ల డాలర్లలో 100వ వంతు కన్నా ఇది తక్కువ. మొత్తం పెట్టుబడుల రాక కొద్దిమేరకు హెచ్చుతగ్గులకు గురవుతుంటుంది. కానీ మనదేశంలోకి వస్తున్న విదేశీ పెట్టుబడులలో అత్యధికం 13 లక్షల మంది జనాభా ఉన్న ఒక చిన్న ద్వీపదేశమైన మారిషస్ నుంచి వస్తున్నాయి. మొత్తం విదేశీ పెట్టుబడులలో 25 శాతం ఆ దేశం నుండే రావటం చిదంబర రహస్యంగా ఉన్నది. మనదేశం నుండి ఏ దేశాలకు నిధులు తరలిపోతున్నాయన్న దానిలో ఎటువంటి రహస్యం లేదు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టే విదేశీ పెట్టుబడిదారులు, భారతీయ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను విదేశాలకు తరలిస్తున్నారు. దానితో దేశంలోకి వచ్చే నికర నిధులు తగ్గిపోతున్నాయి. 2024–25లో విదేశీయులు 5,200 కోట్ల డాలర్లను, భారతీయులు 2,900 కోట్ల డాలర్ల ను దేశం నుండి తరలించారు. రెండు సంవత్సరాల క్రితం దేశం నుండి తరలించిన మొత్తం కన్నా ఇది రెండు రెట్లు ఎక్కువగా ఉన్నది.

ఈ విధంగా ప్రవాహం లాగా నిధులు బయటికి పోవటంపై ఆత్మ పరిశీలన చేసుకోవటం అవసరం. ప్రపంచ సరుకుల ఉత్పత్తి కేంద్రంగా ఉన్న చైనాను అధిగమించే స్థాయికి భారతదేశం చేరిందనే ప్రచారాన్ని మనం ఎక్కువగా వింటున్నాం. వికసిత్ భారత్, 2047 నాటికి ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అటువంటప్పుడు భారతదేశం నుండి పెట్టుబడులు ఎందుకు బయటికి వెళుతున్నాయి? భారతీయ రిజర్వు బ్యాంకు చేస్తున్న ప్రచారం నిజాయితీ లేనిది అయినా అయి ఉండాలి, లేదా అజ్ఞానంతో అయినా చేస్తుం డాలి. నిధులు వరదలా బయటికి వెళ్ళటంపై "పరిణతి చెందిన మార్కెట్లోకి విదేశీయులు సులభంగా ప్రవేశిస్తారు, అంతే సులభంగా బయటికి వెళతారు" అంటూ ఆర్‌బిఐ వ్యాఖ్యానిస్తున్నది. కాబట్టి " భారతీయ మార్కెట్ సానుకూలంగా ఉన్నదని ఇది వెల్లడిస్తున్నదని" చెబుతున్నది. ఇటువంటి వివరణలను చెత్తకింద పరిగణిస్తారు.

కాని షికాగో యూనివర్సిటీకి చెందిన రాబర్ట్ లూకాక్స్ పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చిన లూకాక్స్ పారడాక్స్‌ను బట్టి పెట్టుబడి ధనిక దేశాల నుండి పేద దేశాలకు ప్రవహిస్తుంది. దీన్ని ఆర్‌బిఐ ఏ మాత్రం అవగాహన చేసుకోలేదని స్పష్టమౌతున్నది. అతని వాదనలు ముక్కు సూటిగా ఉన్నాయి. భారతదేశం పేద దేశం. అక్కడ విస్తారంగా మిగులు కార్మికులు ఉన్నారు. వారు తమ సేవలను దయనీయమైన తక్కువ కూలికే అందజేస్తారు. కాబట్టి అభివృద్ధి చెందిన, ధనిక దేశాలలో కన్నా భారతదేశంలో పెట్టుబడిపై చాలా ఎక్కువ లాభాలు వస్తాయి పెట్టుబడిపై వచ్చే లాభాల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉండటంతో "అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడులు పెట్టరు" అని లూకాక్స్ రాశాడు. ప్రపంచంలోని పెట్టుబడులన్నీ భారతదేశం లాంటి పేద దేశాలలోకి వస్తాయి అని చెప్పాడు.

కానీ ఈ తర్కం ఆచరణలో పని చేయలేదు. ప్రపంచ పెట్టుబడులలో అత్యధిక భాగం ధనిక దేశాలలోకే వెళుతున్నాయి. తర్కానికి, ఆచరణకు మధ్య ఉన్న ఈ వ్యత్యాసం తమ దేశాలలో ఉన్న తక్కువ వేతనాలను అవకాశంగా ఉపయోగించుకోలేని పేద దేశాల బలహీనతను పరిశీలించటానికి మనలను పురిగొల్పుతున్నది.

మనమే గొప్పవారం అని చెప్పుకోవటం కోసం ప్రయత్నిస్తుండటంతో లూకాక్స్ తర్కం మనపై మరింతగా ప్రభావం కలిగిస్తున్నది. భారతదేశంలోని గొప్ప వ్యక్తులతో పాటు జెఫ్ బెజోస్ లాంటి అంతర్జాతీయ ప్రముఖులు కూడా ఇది భారతదేశ దశాబ్దం అని, దానితో పాటు భారతదేశపు శతాబ్దం కూడాననీ, ఈ శతాబ్దంలో భారతదేశం కొత్త సూపర్ పవర్‌గా ఎదుగుతుందని ప్రచారం చేస్తున్నారు. ఇదే నిజమైతే పెట్టుబడులు దేశంలోకి ప్రవహించాలి. కానీ మునిగిపోతున్న పడవ నుండి బయటపడటానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా దేశం నుండి పెట్టుబడులు వేగంగా తరలిపోతున్నాయి.

"అభివృద్ధి చెందిన ఆర్థికవ్యవస్థలు ఉన్న దేశాలలో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని ప్రచారం చేశారు. చైనాలో సరుకులు ఉత్పత్తి చేస్తున్న కంపెనీలు భారతదేశానికి వస్తాయనే ప్రచారానికి ఇది ఊతం ఇచ్చింది. పెట్టుబడులు దేశం నుండి వేగంగా నిష్క్రమిస్తున్న సితిలో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న "ఆర్థిక అగ్ర రాజ్యం" అంటూ చెబుతున్న కథలు ఏ విధంగా పొసగుతాయి?"

రెండు అంశాల ప్రాతిపదికన భారతదేశం గురించి ఆశావహమైన అంచనాలు వేస్తున్నారు. కంపెనీలు పూర్తిగా చైనాపైనే ఆధారపడటం తగ్గించి, భారతదేశం లాంటి తక్కువ వేతనాలు ఉన్న దేశాలలో ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తాయనేది వీటిలో ఒకటి. డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షుడుగా ఉన్న 2018, రెండవ అర్ధభాగంలో అమెరికాకు ఎగుమతి అవుతున్న చైనా ఉత్పత్తులపై సుంకాలు వేశారు. సరుకుల ఉత్పత్తిదారులు భారతదేశంలో ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి, దేశాన్ని ప్రపంచ సరుకుల ఉత్పత్తి కేంద్రంగా చేస్తారని అపుడు ఉవ్వెత్తున ప్రచారం జరిగింది. దీనిని బలపర్చే విధంగా ప్రభుత్వం 2020లో ఉత్పత్తితో ముడిపడిన ప్రోత్సాహకాలను ప్రకటించింది. భారతదేశ జిడిపిలో సరుకుల తయారీ రంగం వాటాను 14 నుండి 25 శాతానికి పెంచటం లక్ష్యంగా ఈ పథకాలను ప్రకటించారు.

అభివృద్ధి చెందిన ఆర్థికవ్యవస్థలు ఉన్న దేశాలలో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని ప్రచారం చేశారు. చైనాలో సరుకులు ఉత్పత్తి చేస్తున్న కంపెనీలు భారతదేశానికి వస్తాయనే ప్రచారానికి ఇది ఊతం ఇచ్చింది. పెట్టుబడులు దేశం నుండి వేగంగా నిష్క్రమిస్తున్న సితిలో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న "ఆర్థిక అగ్ర రాజ్యం" అంటూ చెబుతున్న కథలు ఏ విధంగా పొసగుతాయి? ఈ వైరుధ్యాన్ని పరిష్కరించటానికి పూనుకుంటే తరచుగా కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను మనం ఎదుర్కొంటాం. మౌలికంగా ఎగుమతుల కోసం సరుకులను ఉత్పత్తి చేసే దేశం అయినందువలననే ప్రపంచంలో సరుకుల ఉత్పత్తికి వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవటంలో భారతదేశం విఫలం అవుతున్నదా? ఆర్థికవ్యవస్థలో ఉన్న చిక్కు సమస్యలను పట్టించుకోకుండా, " భారతదేశ జిడిపి వేగంగా పెరగటం" అన్న కట్టుకథ అల్లటానికి సమాచారాన్ని తప్పుగా విశ్లేషించలేదా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు గురించి మన ఆలోచనలను సరిచేసుకోవటానికి, ప్రపంచంలో మనదేశం స్థానం ఏమిటి, మనం ఉన్న అవకాశాలపై ఆలోచనలు చేయటం సాధ్యమౌతుంది.

### చైనా నుండి కంపెనీలు తరలివస్తాయనే భ్రమలు

ప్రపంచ సరుకుల ఎగుమతి రంగంలో స్థానం సంపాదించుకోవటం కోసం భారతదేశం ఏడు దశాబ్దాల నుండి ప్రయత్నం చేస్తున్నది. ప్రజల ఉత్పాదక శక్తి తక్కువగా ఉండటంతో ఈ పోరాటం తీరు మారలేదు. తక్కువ వేతనాలతో వస్తున్న సానుకూలతను తక్కువ ఉత్పాదకత హరించివేస్తున్నది. భారతదేశంలో ఉత్పాదకతను అవసరమైనంత మేరకు పెంచటం సాధ్యం కాదనే భావంపైనే చైనా నుండి కంపెనీలు వస్తాయనే ప్రచారం ఆధారపడి ఉంది. కాబట్టి చైనా ఎగుమతులపై అధికంగా సుంకాలు వేస్తేనే భారతదేశ ఎగుమతులు పెరగటానికి అవకాశం ఏర్పడుతుంది. అపుడు మాత్రమే భారతదేశం ఎక్కువ విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం, ప్రపంచ దేశాలకు ఎగుమతులను పెంచుకోవటం, నైపుణ్యం తక్కువగా ఉన్న కార్మికులకు ఉద్యోగాలు కల్పించటం సాధ్యమౌతుంది.

కానీ హ్రస్వదృష్టితో కూడిన ఇటువంటి ఆలోచనలు చరిత్ర చెప్పిన పాఠాలను నేర్చుకోవటానికి దోహదం చేయవు. ఉత్పాదకతను పెంచటానికి రూపొందించే దీర్ఘకాలిక వ్యూహం అటువంటి అవకాశాలను అందిపుచ్చుకోవటానికి దేశాన్ని సన్నద్ధం చేయటానికి, ఆ ప్రయత్నంలో విజయం సాధించటానికి దోహదం చేస్తుంది. ఈ ప్రశ్నను అడగండి: ఎక్కువ మంది శ్రామికులను ఉపయోగించి తయారు చేసే సరుకుల ఎగుమతిలో జపాన్ మార్కెట్ కోసం 1950 లలో జరిగిన పోటీలో భారతదేశం ఎందుకు వెనుకబడింది? 1960, 70లలో కొరియా, తైవాన్ మార్కెట్లలో ఎందుకు వెనుకబడింది? 1980, 90 దశాబ్దాలలో చైనాకు ఎగుమతులు చేయటంలో ఎందువలన సఫలం కాలేదు? నూతన సహస్రాబ్దిలో వియత్నాం కన్నా ఎందుకు వెనుక ఉన్నది? చైనా నుండి బయటికి వచ్చే కంపెనీలను ఆకర్షించటంలో వియత్నాం మొదటి స్థానంలో ఉండటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. భారతదేశం కన్నా ముందు పీఠిన ఉన్న ఇతర తూర్పు ఆసియా దేశాల వలెనే వియత్నాం కూడా రెండు ప్రధానమైన అంశాలు, ప్రజలందరినీ విద్యావంతులను చేయటం, మహిళలను అత్యధికంగా శ్రామికశక్తిలో భాగస్వాములను చేయటం ద్వారా పురోగమిస్తున్నది. ఈ రెండింటినీ అమలు చేయటానికి భారతదేశం ప్రయత్నం చేస్తున్నప్పటికీ విఫలమౌతూనే ఉన్నది.

బ్రౌన్ యూనివర్సిటి ఆర్థికవేత్త ఒడెడ్ గేలర్ నొక్కి చెప్పినట్లు విస్తృతంగా విద్య నేర్పటం ద్వారా కనీస అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను అందుకోవటం, మహిళలు ఎక్కువగా ఉత్పాదక కార్యకలాపాలలో పాల్గొనటం మానవ పెట్టుబడుల అభివృద్ధికి దోహదం చేస్తుంది. మహిళలు పనిలో పాల్గొంటున్నపుడు తమ పిల్లల విద్య, ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ పెడతారు. పిల్లలు మరింత ఉత్పాదకత శక్తి ఉన్నవారుగా అభివృద్ధి అవుతారు. ఎక్కువ ఉత్పాదకత ఉన్న ఆర్థికవ్యవస్థ మహిళలకు మరిన్ని అవకాశాలను, పిల్లలను విద్యావంతులను చేయటానికి మరిన్ని ప్రోత్సాహకాలను కల్పిస్తుంది.

తూర్పు ఆసియా దేశాలలో ఎలక్ట్రానిక్ వస్తువుల నాణ్యతను పరీక్షించే పరిశ్రమలు లేవు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు తమ మధ్య ఉన్న వ్యత్యాసాలను పక్కన పెట్టి ఉత్పత్తి, ఎగుమతులకు సంబంధించిన విషయాలలో ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయి. 250 సంవత్సరాల క్రితం పారిశ్రామిక విప్లవం ప్రారంభమైనప్పటి నుండి ప్రజలను విద్యావంతులను చేయటం, ఉత్పత్తి కార్యకలాపాలలో మహిళలను భాగస్వాములను చేయటం ద్వారా ఉత్పాదకతను పెంచుతున్నాయి. ఈ మూడు అంశాలు ఒకదాని అభివృద్ధిని మరొకటి బలపరచుకొంటాయి. ఇటువంటి అభివృద్ధి క్రమం లేకుండా ఏ దేశం కూడా స్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధించలేదు.

స్వేచ్ఛా మార్కెట్‌ను బలపరిచే లూకాస్ లాంటి ఆర్థికవేత్త కూడా చారిత్రకానుభవాలను పరిశీలించి, ధనిక దేశాల నుండి పేద దేశాలకు పెట్టుబడులు రాకపోవటానికి మానవ వనరులు అభివృద్ధి కాకపోవటమే కారణమని చెప్పాడు.

**“ బంగ్లాదేశ్‌లో ఈ అంశం మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. దిగువస్థాయి వరకు విద్యను అందించటంతో పాటు మహిళలను ఎక్కువగా ఉత్పత్తిలో భాగస్వాములను చేయటంతో వస్త్రాలను ఎగుమతి చేయటంలో విజయం సాధించింది. అయినప్పటికీ మానవ వనరులను అభివృద్ధి చేయటం కోసం తగినంత పెట్టుబడి పెట్టకపోవటంతో ఇతర రంగాలలో పోటీ పడే పరిస్థితి లేకుండా పోయింది. ”**

అనిశ్చితి తక్కువగా ఉండటం, సులభంగా వ్యాపారం చేసుకొనే పరిస్థితులు పెట్టుబడులను ఆకర్షించటానికి తోడ్పడుతున్నప్పటికీ, ‘పెట్టుబడులను ఆకర్షించటంలో మానవ వనరుల అభివృద్ధి మరింత ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చునని’ ఆయన వివరించాడు. తగిన మేరకు మానవ వనరులు అభివృద్ధి చెందకపోతే తక్కువ వేతనాలు పొందే కార్మికులు చేసే పని అనుత్పాదకంగా ఉండటమే కాక, పెట్టుబడిపై అధిక ఆదాయాన్ని తీసుకురాలేదు.

బంగ్లాదేశ్‌లో ఈ అంశం మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. దిగువస్థాయి వరకు విద్యను అందించటంతో పాటు మహిళలను ఎక్కువగా ఉత్పత్తిలో భాగస్వాములను చేయటంతో వస్త్రాలను ఎగుమతి చేయటంలో విజయం సాధించింది. అయినప్పటికీ మానవ వనరులను అభివృద్ధి చేయటం కోసం తగినంత పెట్టుబడి పెట్టకపోవటంతో ఇతర రంగాలలో పోటీ పడే పరిస్థితి లేకుండా పోయింది.

2018 సెప్టెంబరులో చైనా ఉత్పత్తులపై ట్రంప్ విధించిన సుంకాలు భారతదేశానికి సువర్ణావకాశం కల్పించాయి. ట్రంప్, బైడెన్ హయాంలో చైనా ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న సుంకాలు పెరగటంతో భారతదేశం బాగా లాభపడుతుందని ప్రచారం జరిగింది. 2019, ఫిబ్రవరిలో ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదికలో అమెరికా–చైనాల మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధంలో ప్రధానంగా లాభపడేది భారతదేశమేనని పేర్కొన్నది. ఈ అవకాశాన్ని వినియోగించుకోమని భారతదేశ వాణిజ్య మంత్రిత్వశాఖ ఎగుమతిదారులకు విజ్ఞప్తి చేసింది. కానీ అంకెలు ఈ ప్రచారాన్ని ఎప్పుడూ బలపరచలేదు.

ట్రంప్ సుంకాలు విధించటానికి ముందే పెట్టుబడిదారులు చైనా నుండి బయటికి వచ్చే అవకాశం ఏర్పడినప్పటికీ అది భారతదేశం చేతుల నుండి జారిపోయింది. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన గార్డన్ హన్‌సన్ చెప్పినట్లుగా 2010 దశాబ్దం నుండి ఎక్కువ శ్రమతో ఉత్పత్తి చేసే సరుకుల ఎగుమతుల నుండి చైనా క్రమంగా ఉపసంహరించుకొంటున్నది. చైనా ఉత్పత్తిదారులు అధిక ఖర్చు జరిగే తీరప్రాంతం నుండి తక్కువ ఖర్చుతో ఉత్పత్తి జరిగే లోతట్టు ప్రాంతాలకు మారటంతో ఈ మార్పు నెమ్మదిగా జరిగింది. అవసరమైన విడి భాగాలు, ఖనిజాలను సరఫరా చేయటం కోసం చైనాలో రూపొందించిన యంత్రాంగాన్ని వేరే చోట ఏర్పాటు చేయటం కూడా సాధ్యం కాదు. చైనా వదులుకున్న చోటును భర్తీ చేయటంలో వియత్నాం గొప్పగా విజయం సాధించింది. యూరప్‌లో పోలండ్ ప్రయోజనం పొందింది. చైనా పెట్టుబడులు పెరగటంతో మెక్సికో, ఇతర లాటిన్ అమెరికా దేశాలు లాభపడ్డాయి. అధిక శ్రమతో ఉత్పత్తి చేసిన భారతదేశ సరుకుల ఎగుమతులు 2012 నాటికి స్థంభించి పోయాయి. 2016 తర్వాత తగ్గటం ప్రారంభమైంది.

భారతదేశం అధికశ్రమ అవసరం లేని పెట్రో కెమికల్స్, కెమికల్ ఉత్పత్తుల ఎగుమతులకు మారింది. 2022లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులలో పెద్ద పెరుగుదల వచ్చింది. తనపై విధించిన ఆంక్షల వలన రష్యా శుద్ధిచేసి అమ్మలేక పోతున్న ముడి చమురును భారతదేశం తక్కువ ధరకు దిగుమతి చేసుకొని, శుద్ధి చేసి, ఎగుమతి చేస్తున్నది. కాబట్టి చైనాపై విధించిన సుంకాలు శ్రామికశక్తిని ఎక్కువగా ఉపయోగించే సరుకుల ఎగుమతులకు మరింతగా ద్వారాలు తెరిచాయి. భారతదేశం శ్రామికశక్తిని ఎక్కువగా ఉపయోగించే పరిశ్రమల నుండి పెట్టుబడిని ఎక్కువ ఉపయోగించే పరిశ్రమలకు మారింది. ప్రభుత్వం ప్రకటించిన పిఎల్ఐ పథకం ఉపాధి, ఎగుమతులపై అతి కొద్ది ప్రభావం మాత్రమే చూపింది. 2025 ప్రారంభంలో ప్రభుత్వం ఈ పథకాన్ని పక్కన పెట్టింది.

**ఆపిల్ ఐ ఫోన్ సబ్ కాంట్రాక్టర్లు**

2017 మే నెల నుండి ఆపిల్ ఐ ఫోన్ సబ్ కాంట్రాక్టర్లు దక్షిణాది రాష్ట్రాలలో ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. తూర్పు ఆసియా దేశాలలో వలెనే వారు మహిళలను పనిలో పెట్టుకొని, వారిని ఫ్యాక్టరి సమీపంలోని డార్మెటరీలలో ఉంచుతున్నారు. ఉత్పాదకత తగినంతగా లేకపోవటం, పని పరిస్థితుల మెరుగుదల కోసం సమ్మెలు చేయటం, కార్మికులు సరిగా పని చేయకపోవటం కొనసాగుతున్నప్పటికీ ఐ ఫోన్ సబ్ కాంట్రాక్టర్లు కార్మికుల సంఖ్యను పెంచుతున్నారు. 2025 ప్రారంభంలో చైనాపై అధిక సుంకాలు విధిస్తానని ట్రంప్ ప్రకటించినప్పుడు, భారతదేశంలో ఐ ఫోన్‌ల ఉత్పత్తి విస్తరణను వేగవంతం చేస్తానని ఆపిల్ ప్రకటించింది. ఎటువంటి ఆధారాలు లేకుండా, ఈ మధ్యకాలంలో జరిగిన వాటి నుండి ఏమీ నేర్చుకోకుండా, “అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం భారతదేశ ఎగుమతిదారులకు ప్రయోజనం కలిగిస్తుంది” అని దేశంలోని పత్రికలు వార్తలు ఇస్తున్నాయి.

ఆశావహమైన ఈ ప్రచారంలో కొద్దిపాటి వాస్తవం ఉన్నది. గతంలో వచ్చిన విదేశీ పెట్టుబడులు భవిష్యత్‌లో రానున్న పెట్టుబడులకు సూచికగా ఉంటాయని ఆర్థికవేత్త డేవిడ్ వీలర్, నేను రూపొందించిన పత్రంలో పేర్కొన్నాం. విదేశీ పెట్టుబడిదారులు ఒకదేశంలో గణనీయమైన మొత్తంలో పెట్టుబడులు పెట్టటానికి పూనుకున్నపుడు అది ఇతరులను ఆకర్షించే కేంద్రంగా ఉంటుందని సూచనలు వదులుతారు. పెరుగుతున్న తమ అవసరాలకు అనుగుణంగా ముడి సరుకులు, ఇతర అవసరమైన వాటిని సరఫరా చేయటం కోసం దేశీయ, అంతర్జాతీయ సరఫరాదారులను ఆకర్షిస్తారు. ఈ విధమైన పెట్టుబడులను “ఒకచోట కూడటానికి దారితీయటం” గా పేర్కొంటాం. ఈ విధంగా పెట్టుబడుల కూడిక లేదా క్లస్టర్లకు చైనా తూర్పు తీరప్రాంతం తాజా ఉదాహరణగా ఉన్నది. ఆపిల్ భారతదేశంలో మరిన్ని ఎక్కువ ఐ ఫోన్‌లను ఉత్పత్తి చేస్తుందా లేదా అన్నది ప్రధానమైన ప్రశ్న కాదు. ఎలక్ట్రానిక్స్, ఇతర ఉత్పత్తులకు సంబంధించిన ఇతర ఉత్పత్తిదారులను ఐ ఫోన్ సంబంధిత ఉత్పత్తులు ఆకర్షిస్తాయా లేదా అన్నదే కీలకమైనది.

చరిత్ర అంత సానుకూలంగా ఏమీలేదు. భారతదేశంలో వివిధ రకాల పెట్టుబడులు

ఒకచోట చేరటం జరగలేదు. ఆర్థికవ్యవస్థలో వివిధ పెట్టుబడులు ఒకచోట కూడటం జరిగితే భారత, విదేశీ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను బయటికి తీసుకువెళ్ళరు. గతంలో నాటిన విత్తనాలు మొలకెత్తలేదు. తమిళనాడు లోని మొత్తం శ్రామికులలో 16 శాతం మాత్రమే సరుకుల ఉత్పత్తిరంగంలో పని చేస్తున్నారు. దేశ సగటు 11.5 శాతం కన్నా ఇది కొద్ది మేర మాత్రమే ఎక్కువగా ఉన్నది. సెల్‌ఫోన్‌ల ఉత్పత్తి సంస్థ నోకియాకు తమిళ నాడులో ప్రధాన ఉత్పత్తి కేంద్రం ఉన్నది. కాని ఇతర ఉద్యోగాలు తగినంతగా పెరగటానికి అది కూడా దోహదం చేయలేదు. భారతదేశపు ప్రమాణాలతో చూస్తే అధిక సుంకాలతో అంతర్జాతీయ పోటి నుండి రక్షణ కల్పించటం వలననే తమిళనాడులో అద్భుతంగా ఉన్న ఆటోమొబైల్ పరిశ్రమ కూడా నిలబడగలిగింది. తమిళనాడు (భారతదేశం) లోని ఆటోమొబైల్ ఉత్పత్తిదారులు ప్రపంచ ప్రమాణాలతో చూస్తే మరుగుజ్జులు. వారు యాంత్రిక, ఎలక్ట్రికల్ రంగాలలో చెప్పుకోదగిన మార్పులను ప్రవేశ పెట్టలేదు. ఆపిల్ సబ్ కాంట్రాక్టర్లలో ఫాక్స్‌కాన్ సెమి కండక్టర్ల రంగంలో పెడతానన్న పెట్టుబడులు వెనక్కుపోయాయి.

భారతదేశం కోసం రూపొందించిన పథకాలతో పోల్చుకున్నపుడు చైనా కోసం ఆపిల్ రూపొందించిన పథకాలు భారీస్థాయిలో ఉన్నాయని ఈ మధ్య రాసిన 'చైనాలో ఆపిల్–ప్రపంచంలోని పెద్ద కంపెనీని దేశంలోకి తెచ్చుకోవటం' పుస్తకంలో పాట్రిక్ మెక్‌గీ పేర్కొన్నాడు. చైనాలోని పరిస్థితులకు అనుగుణంగా ఆపిల్ కంపెనీ కాలిఫోర్నియాలోని ఇంజనీర్లకు శిక్షణ ఇవ్వటంతో పాటు భారీస్థాయిలో పెట్టుబడులు పెట్టింది. ఫలితంగా ఆపిల్ తన పెట్టుబడులపై ఆకర్షణీయమైన లాభాలను సంపాదించింది. చైనాలో అనుభవం కలిగిన మానవ వనరులతో పోల్చుకుంటే భారతదేశం దరిదాపులలో కూడా లేదు.

ఐ ఫోన్‌లను చైనాలో అసెంబ్లింగ్ చేసి, తిరిగి వాటిని విడగొట్టి, భారతదేశానికి తీసుకొచ్చి అసెంబ్లింగ్ చేస్తున్నారని ఒక నిపుణుడు మెక్‌గీకి చెప్పాడు. ఇందులో కొంత అతి ఉండవచ్చు. ఏమైనప్పటికీ మౌలికంగా అసెంబ్లింగ్ కార్యకలాపాలు ప్రారంభించటానికి సిగ్గు పడవలసిన అవసరం లేదు. కానీ కోటి రూపాయల విలువైన ప్రశ్న ఏమిటంటే ఈ విధమైన కంపెనీని భారతదేశం ప్రారంభించ గలదా? పరిమితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చైనా యంత్రాలు, నిపుణులపై అత్యధికంగా

> **❝ జిడిపి పెరుగుదల గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత దేశం అత్యధికంగా అభివృద్ధి చెందుతు న్నదని ఊదర కొట్టటం అందుకు భిన్నంగా ఉన్న సమాచారమంతటినీ తోసిపుచ్చటానికి దారితీస్తున్నది. ఆర్థికవ్యవస్థలో వ్యవస్థాగతంగా గిడసబారి ఉన్న అంశాలు ముఖ్యమైనవి. ఎంతగా ప్రయత్నించినప్పటికీ జిడిపిలో ఉత్పత్తిరంగ వాటా పెరగటం లేదు. ద్రవ్యరంగం, నిర్మాణం, ప్రభుత్వ రంగాల ఖర్చు ఆర్థిక పెరుగుదలలో ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నాయి. ❞**

ఆధారపడటం భారతదేశ అభివృద్ధికి ఆటంకంగా పరిణమిస్తున్నది (స్మార్ట్‌ఫోన్‌ల ఉత్పత్తిలో మాత్రమే కాక పాదరక్షలు లాంటి శ్రామికులను అధికంగా వినియోగించే పరిశ్రమలలో కూడా ఇదే పరిస్థితి ఉన్నది).

ఆపిల్‌కు సంబంధించినవి పాత వార్తలు మాత్రమేనని మెక్‌గీ హెచ్చరించాడు. ఆపిల్ నియమించుకున్న చైనాలోని ఉత్పత్తిదారులు కూడా ప్రపంచస్థాయి స్మార్ట్‌ఫోన్ సరఫరాదారులుగా అభివృద్ధి అయ్యారు. వారి మార్కెట్ వాటా ఆపిల్‌ను మించిపోయింది. అంతర్జాతీయంగా చైనా ఆపరేటింగ్ సిస్టమ్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటే ప్రపంచంలో వారే ఆధిక్యంలో ఉంటారు. ప్రపంచ సాంకేతిక రంగంలో నోకియా తరహాలో ఆపిల్ దిగజారిపోనప్పటికీ, అది క్రమంగా ద్వితీయశ్రేణి సంస్థగా మారుతున్నది. భారతదేశంలో ఆపిల్ అభివృద్ధి పథకాలు ఆలస్యంగా ప్రారంభం అయ్యాయి.

చైనాపై ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లతో భారతదేశం పైచేయి సాధిస్తుందని పసలేని ప్రచారం జరుగుతున్నది. మనం దీనిని ముద్రిస్తున్న సమయానికి వస్తున్న వార్తలు భారతదేశానికి సానుకూలంగా లేవు. చైనా పరిస్థితుల నుండి ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తున్న భారతదేశంపై ఇతర దేశాలపై వాటికి మించి సుంకాలు వేశారు. అధిక సుంకాలు వేయటాన్ని ట్రంప్ ఎప్పటికి ముగిస్తాడో తెలియదు. ఇపుడు భారతదేశం కూడా సభ్యురాలుగా ఉన్న బ్రిక్స్ దేశాలపై అదనపు సుంకాలు విధిస్తానని, రష్యా నుండి భారతదేశం ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నది కాబట్టి అదనపు సుంకాలు విధిస్తామని ట్రంప్ బెదిరిస్తున్నాడు.

భారతదేశానికి ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్‌కు ఇవ్వకూడదని అమెరికా కంపెనీలను హెచ్చరించటం, నిపుణులుకాని వారికి కూడా వీసాలు ఇవ్వటాన్ని (భారతీయులుకాని వారికి కూడా) కఠినతరం చేశారు. ట్రంప్ వ్యూహాలు భారతదేశాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయన్న అంశం సమాధానాల కన్నా ఎక్కువ ప్రశ్నలను రేకెత్తిస్తున్నది. ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత పరిస్థితులలో ఉత్పతిని ఇతర ప్రాంతాలకు ఏ విధంగా తరలిస్తారన్న దానిని ఎవ్వరూ అంచనా వేయలేరు. కానీ ఒక అంశం మాత్రం స్పష్టంగా ఉన్నది. పెద్దస్థాయిలో తీసుకుంటున్న తిరోగమన చర్యలు, చేస్తున్న ప్రకటనలు ఇప్పటికే ప్రపంచ వాణిజ్యాన్ని భారీగా దెబ్బతీశాయి. ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం చిన్న భాగస్వామి అయినప్పటికీ, దేశ వృద్ధి ప్రపంచ అభివృద్ధితో ఎక్కువగా ముడిపడి ఉన్నది. ప్రపంచ అభివృద్ధి తిరోగమిస్తే భారతదేశం కూడా తిరోగమనంలో ఉంటుంది.

ట్రంప్ ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలతో భారతదేశానికి ప్రయోజనం కలుగుతుందని చేస్తున్న ప్రచారం హ్రస్వదృష్టితో కూడినదే కాక, ప్రమాదకరమని కూడా రుజువవుతున్నది. ప్రజలందరికీ నాణ్యమైన విద్య అందించటం, మహిళలను ఉత్పత్తిలో భాగస్వాములను చేయటం ద్వారా మానవ వనరుల నాణ్యతను పెంచకపోతే ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం వెనుకబడే ఉంటుంది.

**జిడిపి పెరుగుదలపై అభూతకల్పనలు**

దురదృష్టవశాత్తూ దేశీయంగా కేంద్రీకరణ లేని స్థితి కొనసాగుతున్నది. జిడిపి పెరుగుదల గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత దేశం అత్యధికంగా అభివృద్ధి చెందుతు న్నదని ఊదర కొట్టటం అందుకు భిన్నంగా ఉన్న సమాచారమంతటినీ తోసిపుచ్చటానికి దారితీస్తున్నది. ఆర్థికవ్యవస్థలో వ్యవస్థాగతంగా గిడసబారి ఉన్న అంశాలు ముఖ్యమైనవి. ఎంతగా ప్రయత్నించినప్పటికీ జిడిపిలో ఉత్పత్తిరంగ వాటా పెరగటం లేదు. ద్రవ్యరంగం, నిర్మాణం, ప్రభుత్వ రంగాల ఖర్చు ఆర్థిక పెరుగుదలలో ప్రధాన పాత్ర

**❝ వాస్తవం ఏమిటంటే భారతదేశ ఆర్థిక వ్యవస్థ పోటీని ఎదుర్కోగల స్థితిలో లేదు. అందువలన ప్రభుత్వం చేసే ఖర్చు లేదా నిర్మాణరంగంలో చేసే ఖర్చు ద్వారా మాత్రమే పెరుగుదలకు అవసరమైన ప్రోత్సాహం వస్తుంది. ఇవి కాకపోతే ఏ మాత్రం క్రమ బద్ధంగా లేని ద్రవ్యరంగం నుంచి రావాలి. ❞**

నిర్వహిస్తున్నాయి. ఉద్యోగాలు కల్పించటంలో వెనుకబడటం తీవ్ర ఆందోళన కల్పిస్తున్నది. ఉత్పత్తిరంగంలో ఉద్యోగాలు కల్పించటంలో విఫలం కావటమే కాకుండా, కోవిడ్ సమయంలో పెరిగినప్పటికీ, కోవిడ్ తర్వాత అంతకు ముందునాటికి మించి వ్యవసాయరంగంలో ఉపాధి పెరగలేదు. చైనా నుండి వచ్చే కంపెనీలను ఆకర్షించటంలో వెనుకబడటంతో ప్రపంచ సరుకుల ఉత్పత్తిలో భారతదేశం వాటా అత్యల్పంగా ఉన్నది.

జిడిపి అత్యధికంగా పెరుగుతున్నదని ప్రచారం చేయటంపై సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిడిపి వేగంగా పెరుగుతున్నట్లైతే దేశంలోకి వస్తున్న నికర ఎఫ్‌డిఐలు ఎందుకు తగ్గుతున్నాయని వారు ప్రశ్నిస్తున్నారు. దీనిలో చిక్కులేమీ లేవు. భారతదేశం వేగంగా అభివృద్ధి కావటం లేదు. ఎప్పటిలాగే వాస్తవాలు స్పష్టంగా ఉన్నాయి. కోవిడ్ మహమ్మారి వచ్చిన సంవత్సరాలలో ఏ ప్రధాన ఆర్థికవ్యవస్థ కన్నా భారతదేశ జిడిపి ఎక్కువగా పతనమైంది. ఆర్థికవ్యవస్థలు తీవ్రంగా క్షీణించిన తర్వాత సాధారణ రేటు కన్నా ఎక్కువగా పెరుగుతాయనేది ఆర్థికవేత్తలందరికీ తెలిసిన విషయమే. భారతదేశ ఆర్థికవ్యవస్థ కూడా అలానే పెరిగింది. ఈ విధంగా పెరిగిన దానిని చూయించి, తమ కృషి ఫలితంగా ఈ పెరుగుదల జరిగిందని, ఈ విధంగా పెరిగే శక్తి దేశ ఆర్థికవ్యవస్థలో ఉందని ప్రచారం చేయటం వాస్తవాలను వక్రీకరించటమే. తరిగినపుడు, తిరిగి పుంజుకున్న తర్వాతా సగటు పెరుగుదల రేటు సంవత్సరానికి 4.5 శాతంగా ఉంటుంది. దేశ జిడిపి పెరుగుదల 6 శాతంకు మించి పెరిగిందని చెప్పేదాని కన్నా, రానున్న సంవత్సరాలలో ఈ మేరకే పరిమితమౌతుందని భావించటం వాస్తవికంగా ఉంటుంది.

భారతదేశ జిడిపి లెక్కలలో ఉన్న సమస్యను పరిగణనలోకి తీసుకుంటే ఇదే నిర్ధారణకు వస్తాం. కోవిడ్ అనంతరం నిర్ఘాంతపరిచేలా వచ్చిన అధిక పెరుగుదల అంకెలను వక్రీకరించటం ద్వారా వచ్చినదేనని నేను రెండు సంవత్సరాల క్రితమే వివరించాను. దేశవాసులు సంపాదించిన ఆదాయం, వారు ఉత్పత్తి చేసిన సరుకులు, సేవలపై చేసిన ఖర్చును అంకెలను విశ్లేషించే ఏజెన్సీలు జిడిపిగా పరిగణిస్తాయి. వచ్చిన ఆదాయం తయారు చేసిన సరుకుల కొనుగోలుతో సమంగా ఉండాలి. కాబట్టి సిద్ధాంతరీత్యా ఈ రెండు అంకెలు తప్పనిసరిగా సమంగా ఉండాలి. కానీ ఈ రెండింటి మధ్య ఉన్న తీవ్రమైన వ్యత్యాసం మొదటగా 2023, సెప్టెంబరులో ఢిల్లీలో జరిగిన జి20 సదస్సుకన్నా ముందు ప్రచారంలోకి వచ్చింది. ఈ అంకెలు భారతదేశ జిడిపి పెరుగుదలపై సందేహాలను రేకెత్తించాయి. జిడిపిని లెక్కించటం కోసం భారతదేశ స్టాటిస్టికల్ మంత్రిత్వశాఖ అనుసరిస్తున్న విధానం ఆదాయాలను ఎక్కువగా చూపుతున్నది. ప్రజలు సరుకులు, సేవలపై వెచ్చిస్తున్న మొత్తం కన్నా ఇది చాలా అధికంగా ఉన్నది. అపుడు నేను రాసినట్లు విధానంలో చిన్నపాటి లోపాలు ఉన్నప్పటికీ, జిడిపి పెరుగుదలపై రెండు సంస్థల అంచనాల మధ్య వ్యత్యాసం ఉంటే, ప్రపంచంలోని అధ్యయన సంస్థలు రెండింటిని కలిపి సగటు అంచనాలకు వస్తాయి.

అతిగా చెబుతున్న అంచనాలను పక్కన పెట్టి, సక్రమంగా పరిశీలిస్తే భారతదేశ జిడిపి 4.5 శాతం చొప్పున పెరుగుతున్నదని నిర్ణయానికి రావచ్చు. కోవిడ్‌కు ముందు సంవత్సరం కూడా 4.5 శాతమే పెరుగుదల ఉన్నది.

అంత ప్రధానమైనది కానప్పటికీ, భారతదేశ జిడిపి పెరుగుదలలో వివిధ రంగాల వాటా ఒక ముఖ్యమైన అంశంగా ఉన్నది. దేశీయంగా సరుకులు, సేవలకు డిమాండ్ ఎందుకు తక్కువగా ఉంటున్నది, ప్రైవేటు పెట్టుబడులు ఎందుకు పెరగటం లేదన్న అంశాలను అర్థం చేసుకోవటానికి ఈ సమాచారం అవసరం. అనేక దశాబ్దాల నుండి, ప్రస్తుతం కూడా ప్రభుత్వ వ్యయం, నిర్మాణ, ద్రవ్యసేవల రంగాలు జిడిపి పెరుగుదలలో ప్రధానపాత్ర నిర్వహిస్తున్నాయి. ఆర్థిక సరళీకరణ ప్రారంభించిన తర్వాత కూడా ఆదాయాన్ని పెంచటంలో ఉత్పత్తిరంగం 14 శాతానికే పరిమితమైంది. ఈ మధ్యకాలంలో ఉత్పత్తికి ఊతం ఇవ్వటం కోసం అంటూ ప్రారంభించిన పిఎల్ఐ పథకం కూడా ఏమీ మార్పు తీసుకురాలేదు.

వాస్తవం ఏమిటంటే భారతదేశ ఆర్థిక వ్యవస్థ పోటీని ఎదుర్కోగల స్థితిలో లేదు. అందువలన ప్రభుత్వం చేసే ఖర్చు లేదా నిర్మాణరంగంలో చేసే ఖర్చు ద్వారా మాత్రమే పెరుగుదలకు అవసరమైన ప్రోత్సాహం వస్తుంది. ఇవి కాకపోతే ఏ మాత్రం క్రమ బద్ధంగా లేని ద్రవ్యరంగం నుంచి రావాలి.

1990లలో "సరళీకరణ" విధానాలు ప్రారంభమైన తర్వాత కుంభకోణాలకు పాల్పడటం ఒక సంస్కృతిగా మారింది. ఈ మధ్యకాలంలో గృహస్తు రుణాలు, వ్యక్తిగత రుణాలు ఇవ్వటంపై ద్రవ్యరంగం కేంద్రీకరించింది. దానితో వ్యక్తిగత రుణాలు ఎక్కువగా తీసుకుంటున్న వారు అత్యధిక వడ్డీలు వసూలు చేసే వడ్డీ వ్యాపారుల దయపై ఆధారపడాల్సి వస్తున్నది. ఇది ద్రవ్య రంగంలో సంక్షోభం ఏర్పడే పరిస్థితులకు దారి తీస్తుంది.

ఈ ఉన్మాదం నూతన రూపాలలో కొనసాగుతున్నది. డెరివేటివ్–స్టాక్స్, బాండ్లు తదితరాలలో భవిష్యత్‌లో లాభాలు వస్తాయనే అంచనాతో ముందుగానే ఒప్పందాలు చేసుకోవటం వల్ల వాణిజ్యం బాగా పెరిగింది. ఈ వాణిజ్యంలో భాగస్వాములైన వారు చేసే మోసాలను నిరోధించటానికి అవసరమైన నిబంధనలు లేవు. చైనా నుండి వస్తున్న సంస్థలను ఆకర్షించి, సరుకులను ఉత్పత్తి చేసి, వాణిజ్యం చేయటానికి ఉపయోగించు కోలేక పోయిన సమయంలోనే ఏ మాత్రం నమ్మలేని డెరివేటివ్‌ల వ్యాపారంలో భారతదేశం అగ్రస్థానానికి చేరింది. ఈ రోజు ప్రపంచంలోని డెరివేటివ్‌ల వాణిజ్యంలో 75 శాతం భారతదేశంలోనే జరుగుతున్నది. భారతదేశం లోని డెరివేటివ్‌ల మార్కెట్లో బాగా సంపాదించుకోవటం కోసం ప్రపంచంలోని పెద్ద పెట్టుబడిదారులు రావటంతో కొద్దిపాటి పెట్టుబడులు పెడుతున్న భారతీయులు నష్టపోతున్నారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) లెక్కల ప్రకారం ఈ చిన్న

**❝ కోవిడ్ కాలంలో కొద్దిమేరకు పెరిగిన ఐటిరంగ ఉద్యోగాలు 50 లక్షలు దాటాయి. ఈ ఐటి బూమ్ కూడా అంతరించి పోయింది. దేశంలోని పెద్ద ఐటి కంపెనీలు 2024లో గణనీయ మైన సంఖ్యలో తమ సిబ్బందిని తొలగించాయి. 2025లో కొత్తవారిని ఉద్యోగాలలోకి తీసుకోలేదు. వాస్తవానికి దేశం లోని అతిపెద్ద ఐటి కంపెనీ టిసిఎస్ 2025లో తన సిబ్బందిలో 2 శాతం, 12,000 మందిని తొలగిస్తానని ప్రకటించింది. ❞**

పెట్టుబడులు పెట్టేవారిలో 93 శాతం మంది నష్టపోతున్నారు. ఈ పరిస్థితులలో అటువంటి ఫలితాలు రావటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. భారతదేశ ద్రవ్య మార్కెట్‌లోని అరాచక పరిస్థితులు, ప్రత్యేకించి చిన్న పెట్టుబడిదారులకు ప్రతికూలంగా ఉంటున్నాంయి. తన ఆర్థికశక్తిని ఉపయోగించి అసాధారణ లాభాలు సంపాదించటం కోసం అక్రమాలకు పాల్పడిన అమెరికా సంస్థ జేన్ స్ట్రీట్‌ను మాత్రమే సెబి పట్టుకోగలిగింది.

సంపద దిగువస్థాయి నుండి పై స్థాయిలోని ధనికులైన వ్యక్తుల వద్దకు పెద్ద మొత్తంలో ప్రవహించటాన్ని అడ్డుకోవటం కష్టంగా మారింది. కానీ ఇదొక పెద్ద రోగానికి సూచన మాత్రమే. జేన్ స్ట్రీట్, ఇతర ప్రపంచ స్థాయిలోని హెడ్జ్‌ఫండ్‌లపై సెబి విచారణ జరపటం లేదని వార్తలు తెలుపుతున్నాయి.

ఇదే సమయంలో నకిలీ కంపెనీ (షెల్ కంపెనీ) లకు సంబంధించిన కుంభకోణం వెల్లడైంది. ఈ నకిలీ కంపెనీలకు ఆస్తులు, అమ్మకాలు, ఉద్యోగులు ఉండరు. ఈ కంపెనీలకు సరైన పోస్టల్ అడ్రస్‌లు కూడా ఉండవు. అక్రమ మార్గాలలో డబ్బు సంపాదించటానికి ఇవి ప్రయత్నం చేస్తాయి. లక్ష నుండి రెండు లక్షల కోట్ల రూపాయల విలువ కలిగిన నకిలీ కంపెనీలు భారతదేశ స్టాక్ మార్కెట్‌లో రిజిస్టరై ఉండటం అంతు పట్టని రహస్యంగా ఉన్నది. రూపాయలలో ఉన్నా, లేక డాలర్లలో (1,200–2,400 కోట్ల డాలర్లు) ఉన్నా ఇంత పెద్ద మొత్తంపై సెబి ఆలస్యంగా దృష్టి సారించింది. సహజంగా ఇటువంటి కేసులలో "దొంగలు పడిన ఆర్నెల్లకు కుక్కలు మొరిగిన" చందంగా సెబి వ్యవహరిస్తుంటుంది. ఇటువంటి అక్రమాలు ఎన్ని జరుగుతున్నాయో ఎవరికి తెలుస్తుంది? స్టాక్ మార్కెట్‌లో వాటాల అమ్మకం–కొనుగోలులో వస్తున్న నష్టాలు ద్రవ్య సంక్షోభాన్ని పెంచటానికి సాధనాలుగా ఉంటున్నాయి.

పాత పద్ధతిలో బ్యాంక్‌ల కుంభకోణాలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ రకాల అక్రమాలకు పాల్పడటంతో పాటు "ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని" అనిల్ అంబాని కంపెనీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపణలు చేస్తున్నది.

ఈ పరిస్థితులలో ఆర్థిక కార్యకలాపాల ద్వారా భారతదేశంలో అతి తక్కువ ఉద్యోగాలు కల్పించటం ఆశ్చర్యం కలిగిస్తుందా? ప్రభుత్వ కార్యకలాపాలు, ద్రవ్య సేవలకు అతి తక్కువ మంది ఉద్యోగులు మాత్రమే అవసరం అవుతారు. నిర్మాణరంగం తక్కువ స్థాయి, ఆర్థికంగా, భౌతికంగా ప్రమాదకరంగా ఉండే ఉద్యోగాలను మాత్రమే కల్పిస్తుంది. ఈ పరిస్థితులలో కోవిడ్ ముందు నాటి కన్నా ఎక్కువగా, వ్యవసాయ రంగం 46 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నది. దేశంలో ప్రజల సంఖ్య, ఉద్యోగాలు ఆశించేవారు పెరగటంతో వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరుగుతున్నది. 2018 నాటి కన్నా ఇపుడు అదనంగా 7.5 కోట్లమంది వ్యవసాయ కార్మికులు పనులు చేస్తున్నారు. ఇదే కాలంలో సరుకుల ఉత్పత్తిరంగంలో ఉపాధి కల్పన 11.5 శాతం వద్ద స్తంభించిపోయింది. వ్యవసాయేతర రంగాల లోకి కొత్తగా వస్తున్న కార్మికులు ఎక్కువగా నిర్మాణ రంగంపై ఆధారపడుతున్నారు.

కోవిడ్ కాలంలో కొద్దిమేరకు పెరిగిన ఐటిరంగ ఉద్యోగాలు 50 లక్షలు దాటాయి. ఈ ఐటి బూమ్ కూడా అంతరించిపోయింది. దేశంలోని పెద్ద ఐటి కంపెనీలు 2024లో గణనీయమైన సంఖ్యలో తమ సిబ్బందిని తొలగించాయి. 2025లో కొత్తవారిని ఉద్యోగాలలోకి తీసుకోలేదు. వాస్తవానికి దేశంలోని అతిపెద్ద ఐటి కంపెనీ టిసిఎస్ 2025లో తన సిబ్బందిలో 2 శాతం, 12,000 మందిని తొలగిస్తానని ప్రకటించింది. భారతదేశ ఐటి కంపెనీలకు ఎఐ నుంచి ప్రమాదం ఉన్నది. రానున్న 24 నుండి 36 నెలలలో ఈ రంగంలోకి ప్రవేశిస్తున్న కొత్తవారికి ఎఐ ఉద్యోగాలు లేకుండా చేస్తుందని ఒక నిపుణుడు పేర్కొన్నాడు. ట్రంప్ చెబుతున్నట్లుగా విదేశీయులకు ఉద్యోగాలు కల్పించే విధానాలను అమెరికన్ కంపెనీలు మానుకున్నట్లైతే పరిస్థితి మరింతగా దిగజారుతుంది. ఈ విధమైన సమస్యలతో పాటు విస్తారమైన ప్రజానీకానికి కాలేజి, స్కూల్ స్థాయిలో నాశిరకమైన విద్యను అందించటం అధిక నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను ఎక్కువగా సృష్టించాలనే ఆకాంక్షను ప్రశ్నార్థకం చేస్తున్నది.

జిడిపి పెరుగుదలను గురించి చెప్పటం పాత విషయంగా మారింది. అది ప్రజల సంక్షేమాన్ని సక్రమంగా వ్యక్తం చేయదు. దాదాపు 60 సంవత్సరాల క్రితం, 1968లో సెనేటర్ రాబర్ట్ కెన్నెడి ఈ విధంగా చెప్పాడు. "మన జాతీయ రహదారులపై ఎందరు మరణించారు, గాలి కాలుష్యం, సిగరెట్ల ప్రచారం గురించి చెబుతుంది. కానీ మన పిల్లల ఆరోగ్యం, వారికి నాణ్యమైన విద్య అందటం, వారు ఆటలలో పొందే ఆనందాన్ని మొత్తం జాతీయ ఉత్పత్తి పెరుగుదల వ్యక్తం చేయదు. మన తెలివితేటలను, ధైర్యాన్ని, మన విజ్ఞానాన్ని, నేర్చుకొనే సామర్థ్యాన్ని అది కొలవలేదు. జీవితాన్ని అర్థవంతం చేసేవాటిని మినహా మిగతా వాటినన్నింటినీ అది అంచనా వేస్తుంది".

కెన్నెడి మాటలు ఇప్పటికి కూడా వాస్తవాలు గానే ఉన్నాయి. ఉద్యోగాలు, ఆరోగ్యం, విద్య, పర్యావరణ కాలుష్యం, వేగంగా న్యాయం పొందే విధానం తదితరాలపై ప్రజల జీవితాలు ఆధారపడి ఉంటాయి. ఇవి వారికి నాణ్యమైన, గౌరవప్రదమైన జీవితాన్ని ఇస్తాయి. పెరుగుతున్న జిడిపి కనీసం ప్రజల కొనుగోలు శక్తిని కూడా కొలవలేదు. అత్యవసరమైన వాటిని కొనుగోలు చేయటానికి మాత్రమే పరిమితమైన, నిరంతరం పెంపొందుతూ జీవన పోరాటం చేస్తున్న కోట్లాది మంది కార్మికుల కొనుగోలు శక్తిని అది కొలవలేదు. పెట్టుబడులు పెట్టటానికి భయపడుతున్న భారతీయ, విదేశీ పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన మార్కెట్‌ను కూడా అది చూపించలేదు.

ఇటువంటి పరిస్థితులలో ఏ మార్గంలో పయనించాలో ఎంచుకోవటానికి మనకు అవకాశం ఉన్నది. మన జిడిపి గొప్పగా పెరుగుతున్నదని, చైనా నుండి వెళుతున్న కంపెనీలు మనదేశంలోకి వచ్చే విధంగా చేస్తామనే ప్రచారంతో మనం సంతృప్తి

*(మిగతా 28వ పేజీలో)*

ఇంటర్వ్యూ

# కళలు ప్రజల స్వంతం



**మలయశ్రీ హష్మి**

**(సఫ్దర్ హష్మి వారసత్వం, వీధి నాటిక వెనుక ఉన్న రాజకీయాలు క్లిష్ట సమయాల్లో కళాకారుల నిబద్ధశక్తి– ఈ అంశాలపై జననాట్యమంచ్ (జనమ్) అధ్యక్షురాలు, సఫ్దర్ హష్మి సహచరిణి మలయశ్రీ హష్మీతో అంబరీష్ రాయ్ చౌదరి, ఉదయన్ ఘోష్‌లు జరిపిన ఇంటర్వ్యూను మార్క్సిస్టు పాఠకులకు అందజేస్తున్నాం. అంబరీష్ రాయ్ చౌదరి జాతీయ అవార్డు పొందిన రచయిత, సినిమా చరిత్రకారుడు. ఉదయన్ ఘోష్ రచయిత, కవి, ఫిల్మ్‌మేకర్...సంపాదకుడు)**

**ప్రశ్న :** మీరు సఫ్దర్ హష్మి ఇప్పటి యువతరం అయి ఉ ంటే మీ ప్రయాణం ఇలానే సాగి ఉండేదా?

**జవాబు :** దీనికి నేను సూటిగా జవాబు చెప్పలేను. మీ ప్రశ్న ఊహాజనితమైనది. మేం ఇప్పటి యువతరంలా పెరిగి ఉంటే ఏమయి ఉండే వాళ్లమో ఎలా చెప్పగలను?

**ప్రశ్న :** అంటే మీరు ఎదిగిన కాలం వేరు, ఇప్పటి కాలం వేరు కదా. ఆ కాలపు మీ నమ్మకాలు మీ ప్రాపంచిక దృక్పథాన్ని తీర్చి దిద్ది ఉంటాయి కదా?

**జవాబు :** ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. మనమంతా మనుషులం కాబట్టి, అనివార్యంగా అందరం ఒకేలా ఉంటాం. ఇక నా ఆలోచనా విధానం అంటారా – సైన్సు, సమానత్వ భావన, సైన్సులో లోతుగా వేళ్ళూనుకున్న సమాదరత్వ భావనలు, ఇవీ నన్ను ప్రభావితం చేశాయి. మానవ నాగరికతను నేను తరచి చూసినపుడు పరస్పర సహకారం, సమిష్టి కృషికి సంబంధించి లెక్కకు మించిన దృష్టాంతాలను గమనించాను. ఈ సమాజం మనగలగడానికి కారణం ఆధిపత్యం కాదు సహకారం అని నేను బలంగా నమ్ముతాను.

అయితే తర్వాత తర్వాత మనుషులను విభజించడానికి వివిధ అంశాలు తోసుకు వచ్చాయి. వర్గ విభజన, లింగ వివక్ష, కుటుంబం, పెట్టుబడిదారీ విధానం.. ఇలా అనేకం. పెట్టుబడిదారీ విధానం ఒక వంకన ప్రపంచం అంతా ఒక కుగ్రామం కావాలి అంటుంటుంది. మరో పక్కన సమానత్వ భావనను పక్కన పెడుతుంటుంది. పెట్టుబడిదారుడిని అన్న అతిశయం ఉన్న పెద్దమనిషి ఎవడూ కూడ మనుషులందరూ సమానమే అని చచ్చినా అనడు.

నా వరకు నేను సమానత్వం కోసం పరితపిస్తాను. రాజకీయ పరంగా కానీ, సాహిత్యపరంగా కానీ. నేను ఏమీ చదువుకోకముందే నాలో ఈ అభిప్రాయం దృఢంగా ఉండింది. మా ఇంట్లో వాతావరణం ప్రజాస్వామికంగా ఉండేది. అది అదాటున ఊడిపడిందో, చైతన్య పూర్వకంగా ఏర్పడిందో కాదు. అలా ఉండేది అంతే.

**ప్రశ్న :** మీ అమ్మగారు 'ఇప్టా' (ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్)లో పనిచేశారా?

**జవాబు :** మా అమ్మ (అపర్ణారాయ్) 1958 నుండి 1964 వరకు ఢిల్లీలో 'ఇప్టా' కార్యకలాపాల్లో భాగస్వామిగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని గోండా నుండి 1957లో ఢిల్లీ వచ్చి చేరారు. నాన్నగారు (జె.సి.రాయ్) పుట్టింది, పెరిగింది లాహోర్‌లో.

**ప్రశ్న :** అంటే చిన్ననాటి నుండే మీకు నాటకరంగంతో పరిచయం ఉండేదా?

**జవాబు :** లేదు. నా చిన్నతనంలో ఆట్టే నాటకాలు చూడలేదు. 'ఇప్టా' ఢిల్లీ శాఖ మూతపడే నాటికి నేను చిన్నపిల్లని. పుస్తకాలు చదవడం, సినిమాలు చూడడం ఎంత ఇష్టమో నాటకాలు చూడడం అన్నా అంతే ఇష్టం. నేను రచయితనూ కాను, సినిమా పండితురాలినీ కాను. అలానే గొప్ప రంగస్థల నటినీ కాదు. కానీ నేను ఈ రంగంలో గత 55 ఏళ్లుగా పనిచేస్తున్నా. అలా అని ఇది నా వృత్తి కాదు.

**ప్రశ్న :** దాని అర్థం ఏమిటో?

**జవాబు :** నేను ఇష్టపడని పదం – 'విధి' అంటారు కదా, అలా అనుకోండి. రంగస్థలాన్ని నేను ఎంతగానో ఆస్వాదిస్తాను. కానీ పిల్లలతో కలిసి పని చెయ్యడాన్ని అంతకు మించి ఆస్వాదిస్తాను. దాదాపు 40 ఏళ్లపాటు – 1975 నుండి 2018 వరకు నేను ఉపాధ్యాయురాలిగా పనిచేసా.

**ప్రశ్న :** చిన్నతనంలో నాటకంతో మీ అనుబంధం ఏమిటి?

**జవాబు :** చిన్నతనంలో కాదు కానీ, కాస్త పెద్దయ్యాక ఉత్పల్ దత్ ఆడిన 'అంగార్' నాటకాన్ని నా చిన్నతనంలో చూసిన విషయం గుర్తుకు వచ్చింది. ఆ లైటింగ్, మ్యూజిక్ చాలాకాలం నా ఊహల్లో ఉండి పోయింది. తర్వాత ఎప్పుడో అది 'అంగార్' నాటకం అని తెలిసి వచ్చింది.

**ప్రశ్న :** 1940వ దశకం నుండి 80వ దశకం వరకు యువతరం ప్రపంచం ఎదుర్కొంటున్న పెద్ద పెద్ద సమస్యలకు వామపక్ష రాజకీయాల్లో పరిష్కారాలు అన్వేషించేవారు. ఆ రోజుల్లో యువతరం వామపక్ష రాజకీయాల వైపు అంతగా ఆకర్షితులు అవడానికి కారణం ఏమిటి?

**జవాబు :** చాలా కారణాలు ఉన్నాయి. అన్నిటికన్నా ప్రధానంగా నాటి యువతరంలో ఆశావహదృక్పథం మెండుగా ఉండేది. మెరుగైన ప్రపంచం సాధ్యమే అన్న విశ్వాసం ఉండేది. మా అమ్మకి సినిమాలు అంటే చాలా ఇష్టం. నేను కాలేజీలో చదివే రోజుల్లో అమ్మ నన్ను తనతో పాటు ఫిల్మ్‌క్లబ్‌లకు తీసుకువెళ్లేది. అలా ప్రపంచంలోని అత్యుత్తమ సినిమాలు ఎన్నో చూశాను. అప్పట్లో అది పెద్ద విశేషం కాదు. కానీ, ఇవాళ్టి రోజుల్లో రెండో తరగతి చదివే పిల్లలనే ఐ.ఎ.ఎస్ పరీక్షల్లో పాసవడానికి అంటూ రుద్దేస్తున్నారు. ఎంతటి దుర్మార్గం? ఇవాళ్టితరం పిల్లలు అంతా హడావుడి మేళం పిల్లలు (ఈ మాట నాడి కాదు, పాతికేళ్ళ క్రితం ఒక విద్యావేత్త రాసిన మాట).

ఆనాటి తరం 'నేను, నా' అన్న భావనకు అంతగా ప్రాధాన్యత ఇచ్చేవారు కాదు. బహుశా ఆనాడు ఉన్న సామాజిక ఉద్యమాల

ప్రభావం కావచ్చు. కేవలం వామపక్ష భావజాలమే కాదు, నాటి వలసపాలనా వ్యతిరేక ఉద్యమాలు ఇతరేతర ప్రజా ఉద్యమాలు నాటి యువతరం మీద ప్రగాఢమైన ముద్ర వేశాయి.

**ప్రశ్న :** ఆనాటి ఉద్యమాలు మిమ్మల్ని లక్ష్యానికి చేరువ చెయ్యలేకపోయాయయని మీరు ఆశాభంగానికి లోనయ్యారా?

**జవాబు :** జనం అలా ఆలోచిస్తారని నేను భావించడం లేదు. రాబోయే 20 ఏళ్ళలో ప్రపంచం మారిపోతుంది అన్న అజెండాతో ఎవరూ పనిచెయ్యరు. మన కలలు ఒక రూపం దాల్చడానికి, సాకారం కావడానికి సుదీర్ఘకాలం పడుతుంది. అలాగే మన కలలు కూడా అనూహ్యంగా, సూక్ష్మమైన పద్ధతులలో మార్పు చెందే అవకాశం కూడా ఉన్నది.

ఇవాళ చూడండి అనేక మంది మహిళలు రాత్రి పొద్దు పోయిన తరువాత కూడా పనుల రీత్యా వీధుల్లోకి వస్తున్నారు. అదే ఒక ముప్ఫై ఏళ్ళ క్రితం ఇది ఊహకైనా అందని విషయం. కానీ ఇప్పటికీ పితృస్వామ్య భావజాలం గతం కన్నా బలంగా ఉన్నది. ఒక వ్యక్తినో, ఒక సామాజిక వర్గాన్నో, ఒక కుల సమూహాన్నో అవమానం పాల్జెయ్యడానికి బలాత్కారాన్ని పదునైన ఆయుధంగా వాడుతున్నారు. పితృస్వామ్య భావజాల లక్షణం ఇది.

అప్పట్లో సమిష్టిగా కృషి చేసేటప్పుడు కార్యకర్తలు అందరిలో ఒక స్థాయి నైతిక స్పష్టత ఉండేది. ఇప్పుడు ఆ స్పష్టత లోపించింది అని అనుకుంటున్నాను. కాంక్ష అయితే ఉన్నది. కొంతమందిలో మిగిలిన వారికన్నా ఎక్కువ స్పష్టత ఉన్నది. ఆ రకమైన రాజకీయ స్పష్టత కేవలం మంచి సాహిత్యం చదవడం మూలంగానో, మంచి సినిమాలు చూడడం ద్వారానో అబ్బదు. ప్రజా సంఘాల్లో పనిచెయ్యడం ద్వారా వస్తుంది.

**ప్రశ్న :** అయితే ఒక నిర్దిష్ట రాజకీయ లక్ష్యం ఉన్నట్లా?

**జవాబు :** అలాంటిదేం లేదు. మేం నిజానికి ఏ ఉద్యమం చెయ్యడం లేదు. మేం రంగస్థం మీద పనిచేస్తున్నాం. కళను ప్రదర్శిస్తున్నాం. అయితే మేం కష్టజీవుల కోసం ఆడతాం. ఇప్పటికీ అదే పనిలో ఉన్నాం. ఖచ్చితంగా అదే మార్గాన పయనిస్తున్నాం.

మేం అంకితభావం గల కమ్యూనిస్టు పార్టీ సభ్యులం కాదు. మేం కళాకారులం. కళలను ప్రజలకు చేరువ చేస్తున్నాం. మాది రాజకీయ అజెండా కాదు, సామాజిక అజెండా. కళ ప్రజల కోసం కాదు అని నమ్మినవాళ్ళం. కాబట్టి, కళలను అదే ప్రజలకు చేరువ చేస్తున్నాం. మేం ఈ ప్రపంచాన్ని మార్చడం కోసం ఉన్నాం అని నే భావించడం లేదు. ఈ ప్రపంచాన్ని మార్చడానికి నా శక్తి ఎంత? ఆ పని కార్మిక వర్గ ఉద్యమం చేపడుతుంది. ఈ ప్రపంచాన్ని మార్చే శక్తి కార్మిక వర్గానికే ఉన్నది.

మేం సాదాసీదా యువతరం ప్రతినిధులుగా ఉండేవాళ్ళం. బ్రెష్ట్ రాసిన ఆ నాటకం బాగుందే, ఉత్పల్‌దత్ రాసిన ఈ నాటకం బాగుందే, ఈ నాటకాలను ఎక్కువ మంది జనానికి ఎందుకు చేరవేయకూడదు అని ఆలోచించి, దాన్ని కార్యరూపంలో పెట్టేవాళ్లం.. అంతే. మాకేం రాజకీయ అజెండా లేదు. కానీ, మా అందరికీ స్పష్టమైన రాజకీయ అవగాహన అయితే ఉన్నది.

**ప్రశ్న :** మిమ్మల్ని ప్రభుత్వ వ్యతిరేకులుగా భావించి, హష్మిని హత్య చేసిన తరువాత కూడా మీరు అదే మార్గాన ముందుకు వెళ్ళాలని నిర్ణయించుకోవడానికి ప్రేరణ ఏమిటి?

**జవాబు :** మాకు అంత మేధస్సు ఉందని భావించడం లేదు. మమ్మల్ని ప్రభుత్వ వ్యతిరేకులుగా భావిస్తున్నారు అనే విషయం మా గమనంలో ఉన్నది. సఫ్దర్, రాయ్ బహదూర్‌లు హత్యకు గురికావడం మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కొంతమంది మా బృందాన్ని విడిచిపెట్టి వెళ్ళారు. కానీ, అదేదో మేం తప్పు చేస్తున్నాం అన్న కారణాన అయితే కాదు. మా మీద కూడా ఇలాంటి దాడి జరిగితే పరిస్థితి ఏంటనే ఆందోళనకు లోనయ్యారు. వాళ్ళు భయపడ్డారు. ఆ విషయం నిజాయితీగానే వెల్లడించారు.

1989 జనవరి 1 కన్నా ముందు కూడా 'జనమ్' ఉంది. సఫ్దర్ ఉన్నాడు కాబట్టే 'జనమ్' ఉంది అనుకోవడానికి లేదు. 'జనమ్' అంటే సఫ్దర్, సఫ్దర్ అంటేనే 'జనమ్' అన్న ఆలోచనే సరికాదు. ఈ మాటలు తనకి ఏమాత్రం గిట్టవు. సఫ్దర్ మూలానే జనం 'జనమ్'తో వచ్చి చేరారు అనేది పొరపాటు అవగాహన. అయితే సఫ్దర్ గొప్ప నిర్మాణదక్షుడు (ఆర్గనైజర్), అద్భుతమైన సృజనాత్మక శక్తి ఉన్నవాడు అనేది వాస్తవం. బృందంలోని సభ్యులు సఫ్దర్‌లోని ఈ రెండు లక్షణాలనూ ప్రత్యక్షంగా చూశారు. ఆ ప్రభావంతో అతని వెన్నంటి ఉన్నారు. అయితే 'జనమ్' కృషిలో సఫ్దర్ వంతుతో పాటు మొత్తం బృందసభ్యులు అందరి భాగస్వామ్యం ఉన్నది. మేం ఏదన్నా ప్రదర్శన ఇచ్చాక ఇది నా గొప్ప అని నేను ఏనాడూ భావించలేదు. నేను అట్టే భావోద్వేగాలకు లోనయ్యే మనిషిని కాను. ఏదన్నా చెయ్యాలని నిర్ణయించుకుంటే ఆరు నూరయినా అది చేసితీరుతాం. అంతే. వేరే మాట లేదు.

**ప్రశ్న :** ఇవాళ సామాజిక రాజకీయ వాతావరణం ఎప్పట్లానే కంగాళీగా ఉన్నాదా, లేక ఇంకా దుర్భరంగా తయారయ్యిందా?

**జవాబు :** గతంలో కంటే పరిస్థితులు సంక్లిష్టంగా మారాయి. ఇప్పుడు హింసాత్మక వాతావరణం అలుముకుని ఉన్నది. భయోత్పాతం కలిగించేది అని కూడా అనుకోవచ్చు. కానీ, ఇలాంటి పరిస్థితుల్లో కూడా చెడుకి వ్యతిరేకంగా గట్టిగా నిలబడాలి అని భావిస్తున్న జనాన్ని చూస్తే అద్భుతం అనిపిస్తుంది. వివిధ నిరసన ప్రదర్శనలలో, సమావేశాలలో, సమ్మెలలో, పారిశ్రామిక వాడల్లోని ఆందోళనల్లో, కాలేజీలలో అలాంటి వాళ్లను వందలమందిని చూశాను. అందులోనూ యువతరం ఈ ప్రతిఘటనోద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

**ప్రశ్న :** పారిశ్రామికీకరణ అనంతర సమాజంలో ఫ్యాక్టరీలు సర్వవ్యాపిత లక్షణం కోల్పోయాక 'కార్మికవర్గం' నిర్వచనంలో ఏమన్నా మార్పు వచ్చిందంటారా?

**జవాబు :** నేనెప్పుడూ కష్టజీవులు అనే పదం వాడాలని చెబుతుంటాను. హిందీలో 'కామ్‌కాజీ' అనే పదం వాడుతుంటారు అంటే కాయకష్టం చేసవాళ్ళు, కష్టజీవులు అని అర్థం. శ్రమ చేసే సమస్తవృత్తుల వాళ్ళూ ఈ పదం పరిధిలోకి వస్తారు. వీధుల వెంబడి తిరిగి కూరగాయలు అమ్ముకునే వాళ్ళ దగ్గరనుండి ఇళ్ళలో పాచిపనులు చేసేవాళ్ళవరకు, దొడ్లు శుభ్రం చేసేవాళ్ళు సహా అందరూ కష్టజీవులే. ఇందులో కొన్ని పనులు నీచమైనవిగా కొంతమంది ఇప్పటికీ భావిస్తారు. కానీ వీళ్ళంతా కష్టజీవులే. కాయకష్టం చేసేవాళ్ళే. పారిశ్రామిక వాడల్లో పనిచేసే 'కార్మికవర్గం' కిందకు రారు కానీ, వాళ్ళలా శ్రమజీవులే.

మీరు అడిగిన 'కార్మికవర్గం' ఆ పారిశ్రామిక వాడలకు చెందినవారు. పరిశ్రమలు తగ్గి మీరు చెప్పే 'కార్మికవర్గం' సంఖ్యాపరంగా తగ్గారేమో కానీ మొత్తంగా చూస్తే కష్టజీవుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది.

**ప్రశ్న :** కథనం చెప్పే రీతిలో మార్పులు ఏమన్నా వచ్చాయా?

**జవాబు :** మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా మార్పు అనేది సహజం. నేనే ఇంతకుముందే చెప్పాను, మేం కేవలం కార్మికవర్గం వరకే పరిమితం కాలేదు. కష్టజీవులు అందరికీ చేరువ కావడానికే ప్రయత్నిస్తున్నాం. మొదటినుండి మేం విభిన్న రూపాల కోసం కృషి చేస్తూనే వచ్చాం. ఆత్మగౌరవం ఉన్న ఏ నాటక బృందం అయినా చేసే





**1988 డిసెంబర్ 31నాడు హష్మి హత్యకు ముందు, హష్మి హత్యకు మూడు రోజుల తరువాత**
**న్యూ ఢిల్లీ దగ్గరలోని ఝండాపూర్ వద్ద "హల్లాబోల్" నాటకం ప్రదర్శనలో మలయశ్రీ హష్మి**

పని అది. మరీ ముఖ్యంగా ప్రదర్శనలు రాజకీయపరమైనవి అయినప్పుడు విభిన్న రూపాలు ఎంచుకోవడం అనివార్యం.

మనం ప్రదర్శించే కళ ప్రేక్షకులతో మమేకం కావాలి. వాళ్ళ మెదడులో నరాలన్నింటినీ స్పందించేలా చెయ్యగలగాలి. వినోదం అందించాలి. ఆలోచన రేకెత్తించాలి. కథనంలో బిగువు ఉండాలి. అదరగొట్టే అభినయ కౌశలం ఉండాలి. లేకుంటే ఎంత మంచి నాటకం ఆడినా తేలిపోతుంది. కళానైపుణ్యం అనేది చాలా కీలకం. ఒకప్పుడు మేం వీధినాటకాలు ఆడేటప్పుడు అదే గొప్ప కృషి, కళానైపుణ్యం ఎవడికి కావలి లెద్దూ అనుకునేవాళ్ళం. మా పని కేవలం సందేశం ఇవ్వడం కాదు, కళారూపాన్ని వ్యక్తీకరించడం. కళలను ప్రజలకు చేరువ చెయ్యడం. అదేం బూతు కాదే. కళలు ప్రజల స్వంతం.

మీరు వివియన్ సుందరం పేరు వినే ఉంటారు. గొప్ప చిత్రకారుడు. తీవ్ర మత ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో 1991లో అతను 'మతతత్వానికి వ్యతిరేకంగా కళాకారులు' అన్న థీమ్ పేరిట 12.....12 అంగుళాల సైజులో బొమ్మలు వేసి పంపించమని చిత్రకారులు అందరికీ విజ్ఞప్తి చేశాడు. అలా వచ్చిన బొమ్మలను 'పదాలు-చిత్రాలు' పేరిట ఢిల్లీ నగర ప్రధాన వీధుల వెంట ప్రదర్శనకు ఉంచాడు. కన్నాట్ ప్లేస్‌లో ఈ చిత్ర ప్రదర్శన నిర్వహించినపుడు దినసరి కూలీలు ఎంతోమంది వచ్చి ఆ బొమ్మలు చూసి వాటి సందేశం గురించి వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకోవడం నే కళ్ళారా చూశాను. అదీ 'కళ'కు ఉండే శక్తి.

నేను నాటక రిహార్సల్ జరిగే చోటుకి వెళ్ళాల్సినపుడు రిక్షా ఎక్కేదాన్ని. నే ఎక్కిన రిక్షా తొక్కే అతను నిరక్షరాస్యుడు. నువ్వెందుకు చదువుకోలేదు అని ఆరాగా అడిగా. దానికి అతను 'నీకు తెలియంది ఏముంది తల్లీ పల్లెటూళ్ళలో చదువుల సంగతి' అన్నాడు. నేనింకా ఆ విషయాన్ని పొడిగించలేదు. ఆ మనిషికి చదువులేకపోవచ్చు కానీ ఎంతటి పరిసరజ్ఞానం ఉందో చూసారా! ఒక్క వాక్యంతో పల్లెటూళ్ళలో చదువులు ఎవరికి అందవో ఎలా వివరించాడో. చదువుంకుంటేనే విద్యాధికుడు అని మన లెక్క. నా దృష్టిలో చదువులేకపోయినా అతను అక్షరాస్యుడే.

**ప్రశ్న :** ప్రపంచీకరణ విధానాల అమలు తర్వాత వామపక్షం అంటే అభిమానంగా ఉండే చాలామంది అవతలి పక్షానికి చేరిపోయారు కదా. దాని గురించి మీ అభిప్రాయం ఏమిటి?

**జవాబు :** ఆ విషయంలో నేను చేయతగింది ఏముంది? భవిష్యత్తు పట్ల ఆశావహంగా ఉండి మన పని మనం చేసుకుంటూ పోవడమే. ఇంతకుమించి వేరే దారి ఉందా? లేదు కదా. అయితే అలాపోయిన వాళ్లందరూ చెడ్డ మనుషులు అని అనుకోను.

ఇవాళా, రేపూ సమిష్టి భావన అనేది కొరవడుతున్నది. మేం ప్రదర్శనలు ఇచ్చేప్పుడు ప్రేక్షకుల స్పందన వివిధ రకాలుగా ఉంటుంది. ఎప్పుడు ఎవరు మీదపడి దాడి చేసి చంపేస్తారో అని భయపడుతూ ఉండలేం కదా. మేం ఉదాత్తమైన నాటకాలు ప్రదర్శించినపుడు ప్రేక్షకులు చాలా గొప్పగా స్పందిస్తారు. మేం ప్రేక్షకులకు చేరువ కావడం ద్వారా వారి స్పందనలను, మనోభావాలను అర్థం చేసుకోగలుగుతాం.

**ప్రశ్న :** 'పఢ్‌నా-లిఖ్‌నా సీఖో' (చదవను-రాయను నేర్చుకో) అన్న సఫ్దర్ పాట బ్రెఫ్ట్ గేయానికి అనువాదమా?

**జవాబు :** అవును, అది తన స్వంత రచన అని సఫ్దర్ ఏనాడూ ప్రకటించలేదు. అక్షరాస్యతా కార్యక్రమంలో విధిగా ఈ పాట వినిపించేవాళ్ళు.

ఆనాడు 'సాక్షరతా మిషన్' బాధ్యతల్లో ఉన్న మనిషి మంచి చదువరి, ప్రజాస్వామిక దృక్పథం కలవాడు, భోళామనిషి కూడా. కాజల్ ఘోష్ ఆ పాటకు బాణీ కట్టాడు.

1987 ప్రాంతంలో టీవీలో 'ఖిలీ కలియా' (వికసిస్తున్న పూలు) అన్న ధారావాహిక వెలువడేది. పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే వాడుకుని ఈ ధారావాహిక రూపొందించాలనేది ప్రభుత్వ షరతు. 'ఏం చేద్దామంటావ్' అని సఫ్దర్ నన్ను అడిగాడు. 'జనం వాళ్ళే నేర్చుకుంటారు. అయితే వాళ్లకి నేర్పే పద్ధతి ఇదయితే కాదు' అని చెప్పా నేను. అయినా సఫ్దర్ వదిలిపెట్టలేదు. తెలివిగా వివిధ ఛాప్టర్‌ల నుండి కొన్ని పదాలు ఏరుకుని పాటల్లో ఇరికించి ప్రభుత్వం పెట్టిన మెలికని అధిగమించాడు. పుస్తకాల్లోని చప్పిడి పాఠాల నుండి అర్థవంతమైన, ఆసక్తికరమైన ధారావాహిక రూపొందించి ఇచ్చాడు.

**ప్రశ్న :** సఫ్దర్‌కు సినిమాల పట్ల ఆసక్తి ఉన్నదా?

**జవాబు :** చాలా. పశ్చిమబెంగాల్ సమాచార శాఖలో పనిచేసేటపుడు రిత్విక్ ఘటక్ సినిమాలు అన్నీ సేకరించి ప్రదర్శింపచెయ్యడానికి భూమ్యాకాశాలను ఏకం చేసినంతటి పని చేశాడు. అప్పట్లో కొత్తగా వీడియోలు తియ్యడం మొదలయ్యింది. ఒక ఎడిటింగ్ మిషన్ కొనాలని చాలా ఉత్సాహపడ్డాడు. ఇదొక కొత్త మాధ్యమం. దీనిని ఉపయోగపెట్టుకుని ఆసక్తికరమైన, అభ్యుదయ చిత్రాలు రూపొందించాలి అని భావించాడు.

ఆరు డాక్యుమెంటరీలు తీశాడు. స్క్రిప్టులు రాయడమే కాకుండా స్వయంగా కెమెరా కూడా చేతపట్టాడు. దూరదర్శన్‌లో ప్రతి ఆదివారం ఉద్యం వాటిని ప్రసారం చేసేవాళ్ళు.

**ప్రశ్న :** తననీ, తన కుటుంబాన్నీ పోషించుకోవడానికి సఫ్దర్ ఏం చేసేవాడు?

**జవాబు :** వాస్తవానికి తను ఉపాధ్యాయవృత్తిలో ఉండేవాడు. 1975-77 మధ్య కాలంలో ఎమర్జెన్సీ నడిచింది. 'జనమ్' కార్యకలా

పాలు నిలిచిపోయాయి. ఆ సమయంలో తను రెండు విశ్వవిద్యాలయాల్లో పాఠాలు బోధించాడు. తర్వాత నాటక రంగంలో, రాజకీయాల్లో పని చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. నేను పనిచేస్తున్నా కాబట్టి జీవనం గడపడానికి తను పని చెయ్యాల్సిన అవసరం పడలేదు. పైగా మేం ఖర్చులమారోళ్ళం ఏం కాదు. పుస్తకాలు కొనడమే మాకు పెద్ద ఖర్చు.

**ప్రశ్న** : సఫ్దర్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడా?

**జవాబు** : 1972, 73 ప్రాంతాల నుండి అతను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లో సభ్యుడు. ఆ విషయం తాను దాచిపెట్టలేదు. అయినా సఫ్దర్ ఏ రాజకీయ పార్టీకి చెందిన వారితో అయినా ఇట్టే కలుపుగోలుగా మాట్లాడేస్తాడు. అతనిలో ఆ గుణాన్ని నేను ఎంతగానో ఆరాధిస్తాను. ఎందుకంటే నాలో ఆ గుణం లేదు. తనతో ఏకీభవించని వాళ్ళతో, చివరికి తనతో విభేదించేవాళ్ళతో కూడా మనసు విప్పి మాట్లాడే లక్షణం ఉంది చూసారూ అది నాకు అద్భుతంగా తోచేది.

జ్యోతిబాపూలే అంటాడు – 'మనికి అభిప్రాయభేదాలు ఉండొచ్చు కానీ ఘర్షణ ఉండాల్సిన అవసరం లేదని'. ఈ అవగాహనతోనే పూలే బ్రాహ్మణవాద సిద్ధాంత విశ్వాసకులతో కూడా తాత్విక చర్చలు చేసేవాడు. అనేకమంది తత్వవేత్తలు, రచయితలు కూడా పూలే చెప్పిన మాటలనే తమవైన రీతిలో చెప్పుకొచ్చారు.

**ప్రశ్న** : ప్రభుత్వం సఫ్దర్‌ని శత్రువుగా ఎందుకు పరిగణించింది?

**జవాబు** : నేరుగా ప్రభుత్వం చేసిన హత్యకాదు అది. సఫ్దర్ చనిపోవడానికి మూడు వారాల ముందు కూడా మా ప్రదర్శన మీద దాడి జరిగింది. కార్మికవర్గ పోరాటాల్లోనే అద్భుతం అని చెప్పదగ్గ ఢిల్లీ కార్మికుల సమ్మె సందర్భం అది. మా మీద దాడికి తెగబడిన వాళ్ళు కాంగ్రెస్ పార్టీకి చెందినవాళ్ళు. అందులో చాలామంది రౌడీమూకే. ఆ దాడి వెనుక ప్రభుత్వం ఉందని చెప్పడం అతిశయోక్తి అవుతుంది. విషయం ఏంటంటే మేం సమాజం అంచులకు నెట్టివెయ్యబడుతున్న అణగారిన ప్రజా సమూహాల కోసం ప్రదర్శనలు ఇస్తున్నాం. సహజంగానే దీనిని ఆధిపత్య భావజాలం సహించదు. అధికార మదంతో చేసిన దాడులు, హత్యలే ఇవి. అంతకు మించి కాదనుకుంటున్నా.

**ప్రశ్న** : సఫ్దర్ హత్య కావించబడిన చోటనే, మూడు రోజులు తిరగకుండానే అక్కడే తిరిగి హల్లాబోల్ ప్రదర్శించాలని ఎందుకు అనుకున్నారు?

**జవాబు** : మేం కొన్నేళ్ళుగా ప్రదర్శనలు ఇస్తున్నాం. ఎక్కడా ప్రదర్శనను అర్థాంతరంగా ఆపలేదు. ఝుండాపూర్‌లో మాత్రం ఎందుకు ఆపాలి. సగంలో ఆగింది కాబట్టి తిరిగి అక్కడే ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించుకున్నాం. 'హల్లాబోల్' బాగా పేరొచ్చిన ప్రదర్శన. జనం తెగమెచ్చుకున్నారు. అందుకే తిరిగి అక్కడే మా ప్రదర్శన కొనసాగించాం. ఇదేం పెద్ద వీరోచిత కార్యం కాదు.

**ప్రశ్న** : మీ వ్యక్తిగత భావోద్వేగాలను, వృత్తిగత నిర్ణయాలను వేర్వేరుగా ఎలా చూడగలిగారు?

**జవాబు** : నేను లోపల్లోపల ఏం ఇదయ్యానో ఎవరితో చెప్పుకోలేదు. నాలో అణిచిపెట్టుకున్న బాధకి నా నిర్ణయాలకు మాత్రం సబంధం లేదని మాత్రం కరాఖండిగా చెప్పగలను. నా తత్వం అది. కళాకారులు అందరికీ ఉండాల్సిన తత్వం కూడా అదే అని నేను భావిస్తాను. 'జనమ్' తరపున నేను ప్రదర్శన ఇవ్వడానికి ఎక్కడికన్నా వెళ్ళాల్సి వస్తే మా అమ్మకూచి గానో, సఫ్దర్ భార్యగానో వెళ్ళలేదు. నేను నేనుగా ఒక కళాకారిణిగా నా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించడానికి వెళ్ళాను.

**ప్రశ్న** : 'జనమ్' వీధి నాటిక రూపాన్ని ఎందుకు ఎంచుకున్నది?

**జవాబు** : దీనిలో పెద్ద విశేషం ఏం లేదు. మొదట్లో 'జనమ్' కూడా భారీ హంగులతో రంగస్థల నాటకాలు ఆడేది. ఎమర్జెన్సీ రావడంతో పరిస్థితులు మారిపోయాయి. మా రంగస్థల ప్రదర్శనలకు అయ్యే ఖర్చులు కార్మిక సంఘాలు, ఇతర అనేక ప్రజాసంఘాలూ భరించేవి. కానీ ఎమర్జెన్సీ మూలంగా ఆయా సంఘాలే నిధులు సేకరించుకునే పరిస్థితిలో లేకపోవడం మూలంగా మా ప్రదర్శనలకు ఆర్థిక తోడ్పాటు అందించలేకపోయాయి.

సరే, కొన్నాళ్ళు భారీ రంగస్థల నాటక ప్రదర్శనల ఆలోచనలు పక్కనపెట్టి నిడివి తక్కువ, తక్కువ ఖర్చులో, నాటికలు ఎందుకు ఆడకూడదూ అని సఫ్దర్ ప్రతిపాదించాడు. కొన్ని నాటికలు ఎంచుకుని రిహార్సల్స్ చేశాం. కానీ అవి మాకే సంతృప్తిని కలిగించలేదు. సరిగ్గా ఆ సమయంలో ఒక కార్మిక సంఘనాయకుడు సఫ్దర్‌తో ఒక ఫ్యాక్టరీలో జరిగిన సంఘటనను వివరించాడు. అది అగ్గిరవ్వలా మారి 'మెషీన్' అన్న నాటకాన్ని రాయించింది సఫ్దర్‌తో.

ఆ నాటిక ప్రదర్శన గొప్పగా విజయవంతం అయ్యింది. ఈ రోజుకీ దాని విజయ పరంపర కొనసాగుతూనే ఉన్నది. దానిని వీధినాటికగా మలచడంతో ఎక్కువ చోట్ల ఆది ఎక్కువ మంది జనం చూసేలా చెయ్యగలిగాం. దాంతో వీధి నాటికల ఒరవడి కొనసాగింది.

**ప్రశ్న** : 'ఇప్టా' నుండి 'జనమ్'గా మారడానికి రాజకీయ విభేదాలు కారణమా?

**జవాబు** : పాక్షికంగా అవుననే చెప్పాలి. కానీ, ఆ సమయంలో 'ఇప్టా' ఆఫీసును తమ చెప్పుచేతల్లో ఉంచుకున్న వాళ్ళు కార్యకలాపాలన్నీ బంద్ పెట్టేసారు. దాన్ని కార్యాలయంగా వాడుకున్నారు. కళా ప్రదర్శనల కేంద్రంగానో, ఇప్టా ఆఫీసుగానో నిర్వహించలేదు. నాటకం రిహార్సల్ వేసుకోవడానికి కూడా వీలయ్యేది కాదు.

**ప్రశ్న** : ప్రజాదరణ గల నాయకుల్లో రాజకీయ చైతన్యం దిగనాసిల్లిపోతున్న ధోరణి నేడు కనిపిస్తోందా?

**జవాబు** : ఒకవేళ అదే జరిగినా వాళ్ళని విలన్‌లుగా చూడాల్సిన పని లేదని మాత్రం చెప్పగలను. ఈ విషయంలో నాకు స్పష్టత ఉన్నది. సర్దుబాటు ధోరణీ ఉన్నది. యువతలో కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. వాళ్లలో కొంతమంది బాధ్యతాయుతమైన పదవులు చేపట్టారు. అయితే పబ్లిక్‌గా కాదనుకోండి. షబ్నమ్ అజ్మీ మాకు బాసటగా నిలిచింది. షబ్నమ్, జావేద్ అక్తర్‌లు ఇద్దరూ స్వయంగా ఝుండాపూర్ వచ్చి పదివేల మంది ప్రేక్షకుల ఎదుట 'హల్లాబోల్' ప్రదర్శనను ఆవిష్కరించారు. జావేద్ సాబ్ ఆ రోజున అద్భుతమైన ప్రసంగం చేశారు. అక్కడ ఉన్న ప్రజలందరికీ అర్థమయ్యే భాషలో సృజనాత్మకంగా, సూటిగా మాట్లాడారు.

**ప్రశ్న** : వీధి నాటకం భవిష్యత్తు ఏమిటి?

**జవాబు** : ఇది వేరే రూపం తీసుకోవచ్చు. నాటకరంగం చచ్చిపోయింది అని చాలామంది అంటున్నారు. కానీ నాకు అలా అనిపించడం లేదు. ఇవాల్టి రోజున ఎన్నిచోట్ల నాటకాలు ఆడుతున్నారో తెలుసుకుంటే మీరు ఆశ్చర్యపోతారు. ఢిల్లీ మహానగరంలోనే, నాటకరంగం గురించి పెద్దగా పట్టని ఈ దేశ రాజధాని నగరంలోనే ఎంతమంది నాటక ప్రదర్శనల్లో నిమగ్నమై ఉన్నారో. అలా అని నాటక రంగం ప్రభ వెలిగి పోతోంది అని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు.

మనుషులు స్వభావరీత్యానే నాటకాలను ఇష్టపడతారు. ఆ స్వభావం ఉడిగిపోయేది కాదు. రంగస్థలం సరిగ్గా ఆ స్వభావాన్ని అందిపుచ్చుకోగలగాలి. దానికోసం నిజాయితీగా, నిబద్ధతతో సృజనాత్మకంగా కృషి చెయ్యడం వినా మరో మార్గం లేదు.

**(అనువాదం : కె.సత్యరంజన్)**

# కొనసాగుతున్న బుల్డోజర్ రాజ్



అనుజ్ బెహల్

రచయిత స్వతంత్ర జర్నలిస్ట్. నివాసహక్కులు, న్యాయం, లైంగికత అంశాలపై ప్రధానంగా అధ్యయనం చేసే అర్బన్ రీసెర్చర్

**2025** జనవరి 16న, ఉత్తర ప్రదేశ్‌లోని సంభల్ జిల్లాలో ఖగ్గూ సరాయ్ ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల డ్రైవర్ మొహమ్మద్ మతీన్‌ను శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారన్న ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఆయన కుటుంబ సభ్యులు చెబుతున్న దాని ప్రకారం ఈ అరెస్టు వారి ఇల్లు ఖాళీ చేయించడానికి జరుగుతున్న నిరంతర ప్రయత్నాల్లో ఒక భాగం. వారి ఇంటికి పక్కనే శతాబ్దాల నాటిదిగా చెబుతున్న ఆలయాన్ని కనుగొన్న తరువాత ఈ చర్యలు ప్రారంభమయ్యాయని వారు అంటున్నారు.

మతీన్ 2002లో తన స్వంత సంపాదనతో ఆ స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఈ మేరకు అవసరమైన అన్ని యాజమాన్య పత్రాలు కలిగి ఉన్నాడు. ఇల్లు పూచీకత్తుగా పెట్టి బ్యాంకు రుణం కూడా పొందాడు. అయినప్పటికీ ఇప్పుడు ఆ ఆలయం చుట్టూ 'పరిక్రమ' చేయాలని కోరుకునే భక్తులకు ఆయన ఇల్లు అడ్డంకిగా ఉందని పాలనా యంత్రాంగం భావిస్తోంది. మతీన్ అరెస్టు కావడం, ఇల్లు ఖాళీ చేయాలన్న ఒత్తిడి పెరుగుతుండటంతో తమను బయటకు తరిమివేస్తారేమోనన్న ఆందోళన ఆ కుటుంబంలో నెలకొంది. కుటుంబ సభ్యులు తీవ్రంగా భయపడుతున్నారు.

ఆలయం గుర్తించినప్పటి నుండి జిల్లా పరిపాలన యంత్రాంగం తమపై ఒత్తిడి తెస్తోందని 'ది వైర్' ప్రతినిధితో మాట్లాడిన మతీన్ భార్య ఉజామా పరివీన్ చెప్పారు. 'మొదట ఆలయంపై భాగం ఆక్రమించి బాల్కొని నిర్మించామని, దాన్ని కూల్చేయమన్నారు. భయంతో మేము అలా చేశాం. కానీ అక్కడితో విషయం ముగియలేదు' అని ఆమె అన్నారు. ఆ తరువాత కొద్ది రోజుల్లోనే సంభాల్ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ వందనా మిశ్రా తమ ఇంటి గోడను కూల్చివేయాలని ఆదేశించారని ఆమె చెప్పారు. దానికి తాము నిరాకరించడంతో 'అలా అయితే, మొత్తం ఇంటినే కూల్చివేయవచ్చు' అని ఆమె బెదిరించారని పరివీన్ తెలిపారు.ఆ ఒత్తిడి కొనసాగింపులో భాగంగానే తన భర్తను అరెస్ట్ చేశారని ఆమె అన్నారు. హిందూ భక్తులు పూజలు చేయడాన్ని అడ్డుకున్నారని చెబుతూ పోలీసులు తన భర్తను కస్టడీలోకి తీసుకున్నారని, కొద్ది రోజుల క్రితం ఆయనకు బెయిల్ మంజూరైనా ఇంటినుండి బయటకు గెంటివేస్తారన్న భయం మాత్రం వెంటాడుతూనే ఉందన్న ఆందోళనను ఆమె వ్యక్తపరచారు.

**అంకెల్లో ఇలా...**

2024లో కనీసం 7,407 ఇళ్లను కూల్చివేశారు. దీని వల్ల 41,085 మంది నిరాశ్రయులుగా మారారు. ఈ విధ్వంసాలు దేశంలోని 16 రాష్ట్రాలలో చోటుచేసుకున్నాయి. అందులో అత్యధికం ఉత్తర ప్రదేశ్‌లో జరిగాయి. దాని తరువాతి స్థానాల్లో దిల్లీ, అస్సాం, గుజరాత్ ఉన్నాయి. నమోదైన కూల్చివేతల్లో సుమారు 37 శాతం ప్రత్యేకంగా ముస్లింల ఇళ్లు, ప్రాంతాలే! ప్రతి నాలుగు కూల్చివేతల్లో ఒకటి మత ఉద్రిక్తతల కారణంగానో, రాజ్యం ప్రోత్సహించిన ప్రతీకార చర్యలకు సంబంధించినవో కావడం గమనార్హం.

సంభల్ జిల్లాలోనూ అనేక హింసాత్మక సంఘటనలు పునరావృత్తమవుతున్నాయి. నవంబర్ 19న మొఘల్ యుగానికి చెందిన ఒక మసీదును దేవాలయ స్థలంలో నిర్మించారంటూ దాఖలైన పిటిషన్‌పై సర్వే చేయాలని పురావస్తు శాఖను స్థానిక కోర్టు ఆదేశించింది. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలతో పాటు భయానక వాతావరణం నెలకొంది. సంభల్‌లోని స్థానిక జర్నలిస్టు సాద్ ఉస్మానీ 'గత సంవత్సరం నవంబర్ నుండి జిల్లాలో ఉద్రిక్తతలు ఎక్కువయ్యాయి. ఇప్పుడు అనేక 'పురాతన ఆలయాలనుకనుగొంటున్నారు', వాటిని తెరుస్తున్నారు. ఆశ్చర్యకరంగా అవి అన్నీ ముస్లింలు ఉండే ప్రాంతాల్లోనే ఉంటున్నాయి.' అని చెప్పారు. 'తరువాతి దేవాలయాన్ని వారు ఎక్కడ కను గొంటారో, ఎవరు తమ ఇల్లు వదిలి వెళ్లాల్సివస్తుందో ఆ దేవుడికే తెలుసు' అని ఉస్మానీ అన్నారు.

ఒకవైపు సామాజిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. మరోవైపు పాలనాయంత్రాంగపు ఒత్తిడి కూడా పెరుగుతోంది. అయినా మతీన్ కుటుంబం రెండు దశాబ్దాల క్రితం చట్టబద్ధంగా తాము సొంతం చేసుకున్న ఇంటిలోనే ఉంటున్నారు. అయితే, వారి భవిష్యత్ తీవ్ర అనిశ్చితిలో చిక్కుకుంది. మతీన్‌కి తాను ఇల్లు కోల్పోతాననే భయం వెంటాడుతోంది. ఇది కేవలం ఆధారం లేని ఆందోళన కాదు. ఇది ఇప్పటికే గుర్తించబడిన, ఒక విస్తృతమైన ధోరణిలో భాగంగా మారింది. ప్రస్తుత పాలక వ్యవస్థలో, ఈ తరహా కూల్చివేతలు తరచుగా ఒకే విధమైన స్క్రిప్ట్‌ను అనుసరిస్తాయి. మత ఉద్రిక్తతలు పెరగడం, హింస చెలరేగడం, అంతిమంగా మైనార్టీల ఇళ్లు బుల్డోజర్‌తో కూల్చివేయడం... ఇలా ఒకే పద్ధతిలో, ప్రణాళిక బద్ధంగా జరిగే ఈ సంఘటనలు పదే పదే పునరావృత్తమవుతున్నాయి. కూల్చివేతను భయపెట్టే ఆయుధంగా, సమూహ శిక్ష సాధనంగా పాలనాయంత్రాంగం మారుస్తోంది.

2024 సంవత్సరంలో ఫ్రంట్‌లైన్ ఈ తరహా సంఘటనలను నమోదుచేసింది. దీని ప్రకారం 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత

ప్రాంతాల్లో నివాస హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన 48 ఘటనలు నమోదు అయ్యాయి. ఈ ప్రాంతాల్లో కనీసం 7,407 ఇళ్లు కూల్చివేశారు. సుమారు 41,085 మంది నిరాశ్రయులయ్యారు. వీటిలో దాదాపు 30 శాతం సంఘటనలు ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే చోటుచేసుకున్నాయి. దీని తరువాత స్థానాల్లో డిల్లీ, అస్సాం ఉన్నాయి. ప్రభుత్వాధికారులు పదేపదే చట్టపరమైన వ్యవస్థను బలహీనపరుస్తూ వచ్చారు. ఇళ్లు కూల్చివేయడమే కాకుండా, వ్యాపారాలు, ప్రార్ధనా స్థలాలను కూడా లక్ష్యాలుగా చేసుకున్నారు. ఈ తరహా చర్యలు అమలు చేసేందుకు 'ఆక్రమణల తొలగింపు ప్రత్యేక డ్రైవ్' అని పేరు పెట్టినప్పటికీ నిజానికి అవి ద్వేషం, వేధింపులు, హింస వంటి విద్వేషపు అజెండాలో భాగంగా సాగుతున్నాయి.

❝ 2024లో ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో, సంభల్, బరేలీ, బహ్రైచ్, మహారాజ్‌గంజ్, ఫరుఖాబాద్, హర్దోయి, ఆజంఘడ్, అయోధ్య, గోరఖ్‌పూర్ వంటి పలు జిల్లాల్లో ఈ తరహా 14 సంఘటనలు నమోదయ్యాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బహిరంగంగానే 'బుల్డోజర్ జస్టిస్'కు మద్దతు ఇస్తున్నందున ఇది ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. 2024 నవంబర్ 9న, మైన్పురిలో జరిగిన యోగి ఆదిత్యనాథ్ బహిరంగ సభకు ఆయన అనుచరులు పలువురు బుల్డోజర్‌లపై తరలివచ్చారు. ❞

2024లో ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో, సంభల్, బరేలీ, బహ్రైచ్, మహారాజ్‌గంజ్, ఫరుఖాబాద్, హర్దోయి, ఆజంఘడ్, అయోధ్య, గోరఖ్‌పూర్ వంటి పలు జిల్లాల్లో ఈ తరహా 14 సంఘటనలు నమోదయ్యాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బహిరంగంగానే 'బుల్డోజర్ జస్టిస్'కు మద్దతు ఇస్తున్నందున ఇది ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. 2024 నవంబర్ 9న, మైన్పురిలో జరిగిన యోగి ఆదిత్యనాథ్ బహిరంగ సభకు ఆయన అనుచరులు పలువురు బుల్డోజర్‌లపై తరలివచ్చారు.

ఇది ఆయన పాలనకు చిహ్నంగా మారిన ఒక ప్రదర్శన. వారు ఆలాపించే హిందుత్వ పాప్ సంగీతం కూడా ఈ విషయాన్నే బలపరుస్తుంది. 'బుల్డోజర్ బాబా చప్ రహే హై, మాఫియా భాగ్ రహే హై' (బుల్డోజర్ బాబా వారిని నలిపేస్తున్నారు, మాఫియా పారిపోతోంది) వంటి పాటలు ఈ పాప్ సంగీతంలో ఉన్నాయి.

ఈ విధానానికి సంబంధించిన రాజకీయ పరిణామాలపై బిజెపిలోనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. గత జూలైలో జరిగిన పార్లమెంట్ సమావేశంలో, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర మంత్రి, బిజెపి మిత్ర పక్షనేత సంజయ్ నిషాద్ 'బుల్డోజర్‌లను దుర్వినియోగం చేయడమే అనేక చోట్ల బిజెపి ఓటమికి కారణం' అని అన్నారు. అయితే, ఆదిత్యనాథ్ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. 'బుల్డోజర్ పాలసీ'ని సమర్థిస్తూ, ముఖ్యమంత్రిగా తన లక్ష్యం కేవలం పదవిలో ఉండటం కాదని, 'నేరస్తులు శిక్ష అనుభవించేలాచూడటం' అని చెప్పారు. అస్సాం,


యోగి ఆధిత్యనాధ్ బుల్డోజర్ రాజ్‌కు లక్నోలో బలైపోతున్న పేద ముస్లింల ఇళ్లు

మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ వంటి ఇతర బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా ఉత్తరప్రదేశ్ మోడల్‌ను అమలు చేస్తున్నాయి. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం (సిఎస్ఎస్ఎస్) నివేదిక ప్రకారం, 2024లో దేశవ్యాప్తంగా 59 మత ఘర్షణలు నమోదయ్యాయి. వీటిలో ఎక్కువ భాగం బిజెపి, ఆ పార్టీ నేతృత్వంలోని కూటమి పాలిస్తున్న రాష్ట్రాల్లోనే చోటుచేసుకోవడం గమనార్హం. ఈ రాష్ట్రాల్లో విద్వేష ప్రసంగాలు గణనీయంగా పెరిగాయని మరో నివేదిక వెల్లడించింది. బిజెపి పాలనలోని ఉత్తరప్రదేశ్ మత ఘర్షణలు, విద్వేష ప్రసంగాల విషయంలో అగ్రస్థానంలో నిలిచింది. ఫ్రంట్‌లైన్ గణాంకాల ప్రకారం బుల్డోజర్ రాజ్‌లో కూడా ఉత్తరప్రదేశ్‌దే అగ్రస్థానం.

### బిజెపి పాలిత రాష్ట్రాలను మించి...

ఈ విష సంస్కృతి బిజెపి పాలిత రాష్ట్రాలను దాటి ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకూ వ్యాపించడం ఆందోళన కలిగించే అంశం. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో హిందుత్వ సంస్థలు సిమ్లా సంజౌలిలోని ఒక మసీదును కూల్చివేయాలని పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగాయి. ఈ ఆందోళనలు హింసాత్మక సంఘటనలకు దారి తీశాయి. చివరకు 2024 అక్టోబర్‌లో ఆ మసీదు కూల్చివేతతో ముగిశాయి. మరో కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన కర్ణాటక రాజధాని బెంగళూరులో, 2024 జూలైలో పోలీసులు 70 వలస కూలీల కుటుంబాలను 'అక్రమ బంగ్లాదేశీ వలసదారులు'గా ముద్ర వేసి బహిష్కరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆకార్ పటేల్ ఫ్రంట్‌లైన్‌తో మాట్లాడుతూ, మెజారిటీ వాద చట్టాలు ఒకసారి అమలులోకి వస్తే, వాటిని తిరగద్రోలడం కష్టంగా మారుతుందని చెప్పారు. 'ఒక రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గొడ్డుమాంసం కలిగి ఉండటాన్ని నేరంగా పరిగణించడం, మతాంతర వివాహాలను నిషేధించడం వంటి చట్టాలను రూపొందించవచ్చు. కానీ ఆ పార్టీ అధికారంలో లేకపోయినా, ఆ చట్టాలు కొనసాగుతూనే ఉంటాయి. రాజకీయాల్లో లౌకిక విలువలకు బలమైన రక్షణ లేకుండా ఈ ధోరణిని తిప్పికొట్టడం కష్టం' అని ఆయన అన్నారు. మాసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో డాక్టరల్ స్కాలర్‌గా ఉన్న కాలమిస్ట్ ఫహాద్ జుబెరీ రాజకీయ సామాజికీకరణ కోణంలో ఈ పరిణామాన్ని పరిశీలిస్తున్నారు. అంటే, కొన్ని

> **“సుప్రీం కోర్టు తీర్పు న్యాయ వ్యవస్థ వెలుపల శిక్షల రూపంలో అమలు చేస్తున్న బుల్డోజర్ కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, శిక్షార్హత లేని (నాన్ పునిటివ్) కూల్చివేతలను పెద్దగా పట్టించుకోలేదు. ఉదాహరణకు ఆక్రమణల తొలగింపు, అభివృద్ధి ప్రాజెక్టులు, పర్యావరణ కారణాలతో చేపట్టిన మురికివాడల తొలగింపు వంటి వాటివి! ఈ విస్మరణ కారణంగా మురికివాడల్లో నివసించే వేలాదిమంది నిరంతరం నివాస స్థలాలను కోల్పోతున్నారు.”**

రాజకీయ విలువలు ప్రజల రోజువారి జీవనంలో, వారి అభిప్రాయాల్లో ఎలా పాతుకుపోతాయో పరిశీలించడం! ఆయన చెబుతున్నదేమిటంటే రాజకీయ సామాజికీకరణ కొన్ని సార్లు సమానత్వ భావజాలాన్ని పెంపొందిస్తుంది. మరికొన్ని సార్లు దానికి భిన్నమైన అభిప్రాయాలను ప్రేరేపిస్తుంది. ఉదాహరణకు 'బుల్డోజర్ రాజకీయాల్లో' ముస్లింల ఇళ్లను కూల్చివేయడాన్ని ఒక సాధారణ సామూహిక శిక్షగా భావించడం! ఈ తరహా అభిప్రాయాలు పాతుకుపోతే బిజెపి పాలనలో లేని రాష్ట్రాలు కూడా ఆ దిశలోనే ప్రతిస్పందించడం ప్రారంభిస్తాయి.

2024 సెప్టెంబర్ 17న సుప్రీం కోర్టు దేశవ్యాప్తంగా జరుగుతున్న అక్రమ బుల్డోజర్ కూల్చివేతలపై తాత్కాలికంగా స్టే విధించింది. ఆ తరువాత 2024 నవంబర్ 13న న్యాయమూర్తులు బి.ఆర్. గవాయి, కె.వి. విశ్వనాథన్‌ల ఆధ్వర్యంలోని సుప్రీం కోర్టు బెంచ్ ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులో 'ఒక వ్యక్తి నేర కార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడనే ఆరోపణల ఆధారంగా, తగిన న్యాయ ప్రక్రియ లేకుండానే ఆ వ్యక్తి ఆస్తిని కూల్చివేయడం రాజ్యాంగ విరుద్ధం' అని స్పష్టం చేసింది. ఈ తీర్పు వ్యక్తిగత హక్కులను కాపాడడంలో కీలకంగా నిలిచింది. ఎందుకంటే ఇలాంటి కూల్చివేతలు అన్యాయమైన 'సామూహిక శిక్ష'గా మారి మొత్తం సమాజాన్ని ప్రభావితం చేస్తాయని ఇది గుర్తించింది. న్యాయమూర్తి గవాయి, ఇలాంటి కూల్చివేతల వల్ల కలిగే తీవ్ర పరిణామాలను ప్రస్తావిస్తూ, ఒక ఆస్తిని లక్ష్యంగా చేసుకోవడం అనేది ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని మాత్రమే కాకుండా, నిరపరాధ కుటుంబ సభ్యులను కూడా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన నివాస హక్కు (రైట్ టు షెల్టర్) ను ఉల్లంఘించడమేనని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా, న్యాయ సమగ్రతను కాపాడటానికి, న్యాయం జరిగేలా చూడటానికి తగిన న్యాయ ప్రక్రియ అనివార్యం అని ఆయన నొక్కి చెప్పారు.

### శిక్షార్హత లేని కూల్చివేతలు

సుప్రీం కోర్టు తీర్పు న్యాయ వ్యవస్థ వెలుపల శిక్షల రూపంలో అమలు చేస్తున్న బుల్డోజర్ కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, శిక్షార్హత లేని (నాన్ పునిటివ్) కూల్చివేతలను పెద్దగా పట్టించుకోలేదు. ఉదాహరణకు ఆక్రమణల తొలగింపు, అభివృద్ధి ప్రాజెక్టులు, పర్యావరణ కారణాలతో చేపట్టిన మురికివాడల తొలగింపు వంటి వాటివి! ఈ విస్మరణ కారణంగా మురికివాడల్లో నివసించే వేలాదిమంది నిరంతరం నివాసస్థలాలను కోల్పోతున్నారు. న్యాయ పరిరక్షణకు దూరంగా మిగులుతున్నారు. 2024లో నమోదైన కూల్చివేతల్లో, ఈ తరహావే ఎక్కువ! ముంబైలోని దళితులు నివసించే జైభీమ్ నగర్‌ను కూల్చివేయడం వల్ల 700 కుటుంబాలు నిర్వాసితులయ్యాయి. ఢిల్లీ యమునా పుష్తా పరిసరాల్లో 1,000 కుటుంబాలను తొలగించారు. ఢిల్లీ ఓఖ్లా, ఘాజీపూర్ ప్రాంతాల్లో 50 కుటుంబాల ఇళ్లను బలవంతంగా కూల్చివేశారు. ఈ ధోరణి దేశవ్యాప్తంగా విస్తరించి ఉంది. ఈ కూల్చివేతల్లో అనేకం అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట జరిగాయి. ఉదాహరణకు, అస్సాం రాష్ట్రంలోని ధల్పూర్‌లో గోర్ఖటి అగ్రికల్చరల్ ప్రాజెక్ట్ కింద 397 కుటుంబాలను తొలగించారు. లక్నోలో కుక్రైల్ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్ కోసం కనీసం 1,800 కుటుంబాలను నిర్వాసితులను చేశారు. ఈ ధోరణి ఒక కీలకమైన ప్రశ్నను లేవనెత్తుతోంది. రాజ్యం శిక్షార్హత లేని ఈ తరహా సామూహిక కూల్చివేతలను, లేదా తొలగింపులను కొనసాగిస్తే, బాధితులుగా మారుతున్న సామాన్యులకు సుప్రీం కోర్టు తీర్పు ఎంతవరకు ఉపశమనం కలిగిస్తుంది? నివాస హక్కుల కోసం పోరాడుతున్న మానవ హక్కుల న్యాయవాది ఆకాంక్షా బద్కూర్ ఇదే విషయమై మాట్లాడుతూ 'సుప్రీంకోర్టు దృష్టికి ఈ విషయాన్ని తీసుకురావడానికి ప్రయత్నించినప్పటికీ పెద్దగా ఫలితం కనిపించలేదు. ఆ జోక్యాన్ని ధర్మాసనం అనుమతించలేదు. తన ముందున్న పిటిషన్ పరిధి చాలా పరిమితమైందని సుప్రీంకోర్టు చెప్పింది' అని అన్నారు. 'న్యాయ ప్రక్రియకు సంబంధించిన కొన్ని మార్గదర్శకాలను కోర్టు ఇచ్చింది. ఉదాహరణకు నోటీసు పొందే హక్కు, తమ వాదనను వినిపించే హక్కు వంటివి. అదే సమయంలో కూల్చివేతలను కొన్ని వర్గాలుగా విభజించింది, ఒక వర్గంలో క్రిమినల్ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఉన్నారు. వారి ఆస్తులను ప్రభుత్వం శిక్ష పేరిట కూల్చి వేసింది. కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు కేవలం ఈ పరిమిత పరిధికే వర్తించాయి' అని బద్కూర్ పేర్కొన్నారు.

భూమిపై చట్టబద్ధమైన హక్కులు కలిగిన వ్యక్తులపైనే కోర్టు దృష్టి పెట్టింది. అధికారిక భూహక్కులు లేని వారిని ఈ పరిధి నుండి మినహాయించింది. దీని వల్ల తీర్పు అమలులో పెద్ద ఎత్తున పరిమితులు చోటుచేసు కున్నాయి. ఢిల్లీలోని మానవహక్కుల న్యాయ వాది జీషాన్ అహ్మద్ అభిప్రాయం ప్రకారం, ఈ తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద నివాస హక్కులను స్పష్టంగా పునరుద్ఘాటించి ఉంటే మరింత సమగ్ర రక్షణను కల్పించేది. 'అలా చేస్తే, అది యాదృశ్చికంగా జరిగే కూల్చివేతలను నిరోధించాల్సిన చట్టపరమైన బాధ్యతను బలపరచేది. అలాగే, శిక్షారూపంలో కాకుండా పరిపాలనా చర్యల పేరిట జరిగే కూల్చివేతల సందర్భంలోనూ అధికారులు మానవహక్కులను ఆధారంగా చేసుకున్న అనుసరించాల్సిన దృక్కోణాన్ని చూపించి ఉండేది' అని ఆయన అన్నారు

సుప్రీం కోర్టు శిక్షల రూపంలో జరిపే కూల్చివేతల అంశాన్ని ప్రస్తావించినప్పటికీ, అవి ఇప్పటికీ ఒక ప్రధాన సమస్యగానే కొనసాగుతున్నాయి. 2024లో నమోదైన 48 కేసులలో కనీసం 12 శిక్షలుగానే అమలు జరిగాయి. అంటే, ప్రతి నాలుగు కూల్చివేతల్లో ఒకటి శిక్షా విధానంగా అమలైనట్టే! ఇవి చాలాసార్లు వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని అమలు జరుగుతున్నాయి. ఉదాహరణకు ఎటువంటి నియమాలు లేకుండా కూల్చివేతలకు పేరుగాంచిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 2023 జులై 18న మొహర్రం శోభాయాత్ర సమయంలో జరిగిన సామూహిక అల్లర్ల తరువాత అధికారులు 11 ముస్లింల ఇళ్ళను కూల్చివేశారు. ముంబైలోని మీరా రోడ్ హైదరీ చౌక్ ప్రాంతంలో, 2024 జనవరిలో జరిగిన

> ❝ ఈ విధానం రాజస్థాన్ వరకూ విస్తరించింది. అదే ఏడాది అక్టోబర్‌లో ఒక హిందూ ఆలయంలో కత్తిపోటు ఘటనలో నసీబ్ చౌదరి, అతని కుమారుడు పాల్గొన్నారన్న ఆరోపణలొచ్చాయి. అనంతరం అతని ఇల్లు ఆలయభూముల్లో కట్టారని చెబుతూ అధికారులు ఇంటిని కూల్చివేశారు. మరో ఘటనలో, ఉదయపూర్‌లో 15 ఏళ్ల ముస్లిం బాలుడు తనతో కలిసి చదువుకునే మరో హిందూ బాలుడిని పొడిచి చంపేశాడని కేసు నమోదైంది. ఆ వెంటనే అధికార యంత్రాంగం అతని కుటుంబం నివసించే ఇంటిని కూల్చి వేసింది.❞

సామూహిక ఘర్షణల తరువాత ముస్లింలకు చెందిన 15 ఆస్తులను ధ్వంసం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మండ్లా జిల్లాలో, 2024 జూన్ 15న పోలీసులు స్థానికుల ఫ్రిజ్‌లలో గొడ్డుమాంసం దొరికిందని చెప్పిన తరువాత 11 మంది ముస్లింల ఇళ్లను కూల్చివేశారు.

ఈ విధానం రాజస్థాన్ వరకూ విస్తరించింది. అదే ఏడాది అక్టోబర్‌లో ఒక హిందూ ఆలయంలో కత్తిపోటు ఘటనలో ఇంటి యజమాని నసీబ్ చౌదరి, అతని కుమారుడు పాలుపంచుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. అనంతరం అతను నివసించే ఇల్లు ఆలయభూముల్లో కట్టారని చెబుతూ అధికారులు అతని ఇంటిని కూల్చివేశారు. మరో ఘటనలో, ఉదయపూర్‌లో 15 ఏళ్ల ముస్లిం బాలుడు తనతో కలిసి చదువుకునే మరో హిందూ బాలుడిని ఆగస్టు 16 కత్తితో పొడిచి చంపేశాడని కేసు నమోదైంది. ఆ వెంటనే అధికార యంత్రాంగం అతని కుటుంబం నివసించే ఇంటిని కూల్చి వేసింది. గుజరాత్‌లోని సూరత్‌లో కూడా ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. గణేశ్ పండుగ సందర్భంగా సామూహిక ఉద్రిక్తతలు చెలరేగాయి. సెప్టెంబర్ 8న, ముస్లింలు అధికంగా నివసించే సయ్యద్‌పురా ప్రాంతంలోని ఒక గణేశ్ మండపంపై రాళ్ల దాడి జరిగినట్లు రిపోర్టులు వచ్చాయి. ఈ ఘటనలో నేరుగా పాల్గొన్నారని ఆరోపణలపై ఆరుగురిని, అలాగే ఘటనతో సంబంధం ఉందన్న ఆరోపణలతో మరో 27 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు 1,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. లాఠీ ఛార్జీలు, టియర్ గ్యాస్ వినియోగించి ఉద్రిక్తతలను నియంత్రించారు. అల్లర్ల తరువాత తక్షణమే, అదే ప్రాంతంలో అనధికార నిర్మాణాల తొలగింపు పేరిట ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టి అక్కడి దుకాణాలను కూల్చివేశారు.

### సామూహిక శిక్ష విధానం

ఈ ఘటనలు కూల్చివేతలు ఎలా సామూహిక శిక్షకు పరికరంగా మారిపోయాయో స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇవి చట్టపరమైన లేదా పరిపాలనా సమస్యలను పరిష్కరించటానికి కాకుండా, మతపరమైన విభజనలను మరింత బలపరచడానికే ఉపయోగపడుతున్నాయి. కూల్చివేతలు చాలాసార్లు స్పష్టంగా మతపరమైన ద్వేషపూరిత, శిక్షారూప ధోరణిని అనుసరించినప్పటికీ, న్యాయవ్యవస్థ మాత్రం చట్టబద్ధతపైనే దృష్టి సారించింది. ఇళ్ల నిర్మాణంలో చాలావరకు ఏదో ఒక స్థాయిలో అనధికారిక పనులు చోటుచేసుకోవడమన్నది దేశ వ్యాప్తంగా ఉన్న సాధారణ సమస్య. అయితే, చట్టం యొక్క కఠినమైన దృక్కోణం ఈ తరహా సామాజిక వాస్తవాలను పక్కన పెడుతుంది. దీంతో రాజకీయ పార్టీలకు దానిని దుర్వినియోగంచేసుకునే అవకాశం లభిస్తుంది. ఈ విధంగా వివక్ష కొనసాగుతూనే ఉంది. సుప్రీం కోర్టు ఉపశమనం కల్పించినప్పటికీ, శిక్షల పేరుతో కూల్చివేతలు అదుపులేకుండా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్‌లో, గత అక్టోబర్‌లో ఒక వ్యక్తి కాల్పులకు గురైన తరువాత దుర్గా పూజ విగ్రహ నిమజ్జనం సందర్భంగా హింస చెలరేగింది. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతంలో రాళ్లదాడులు, పచ్చజెండాను తొలగించే ప్రయత్నాలు జరిగాయి. ప్రతిగా అధికారులు 22 కుటుంబాలకు కూల్చివేత నోటీసులు ఇచ్చి, చివరికి మూడు ఇళ్ళను బుల్డోజర్లతో కూల్చివేశారు. సుప్రీం కోర్టు అనుమతి లేకుండా ఎలాంటి కూల్చివేతలు జరగకూడదనే ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ అస్సాంలోని సోన్‌పూర్‌కు చెందిన 47 మంది ఒక పిటిషన్ వేశారు. దీనిపై గత సెప్టెంబర్‌లో సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు ధిక్కార నోటీసు జారీ చేసింది. అయితే ఆ ఆదేశాన్ని పక్కన పెట్టి, అధికారులు విస్తృత స్థాయిలో కూల్చివేతలు జరిపి, కనీసం 237 ముస్లిం కుటుంబాలను నిరాశ్రయులనుచేశారు.

మధ్యప్రదేశ్ నవనిర్మాణ మంచ్ నాయకుడు, నివాస హక్కుల కార్యకర్త ఆనంద్ లక్ష్మణ్ అభిప్రాయం ప్రకారం, కోర్టు జారీ చేసే ధిక్కార నోటీసులు చాలా అరుదుగా మాత్రమే పరిగణలోకి వస్తాయి. ఎందుకంటే, న్యాయపరమైన చర్యలు ప్రారంభమయ్యేసరికి ఆ కూల్చివేతల ప్రక్రియ దాదాపుగా పూర్తికావడమో, పునరుద్ధరించడానికి వీలుకాని స్థాయికి చేరుకోవడమో జరిగిపోతుంది. 'అధికారులు ఎలాంటి నియంత్రణ లేకుండా వ్యవహరిస్తారు. ఒక చిన్న ధిక్కార కేసు తమపై పెద్దగా ప్రభావం చూపదని వారికి తెలుసు. ఎందుకంటే వారు లక్ష్యంగా చేసుకున్న కాలనీలు అప్పటికే నేలమట్టమైపోతాయి" అని ఆయన అన్నారు. బుల్డోజర్ కూల్చివేతలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వమే నిర్లక్ష్యం చేయడం, భారతదేశంలో న్యాయవ్యవస్థ స్థితిగతులపై తీవ్రమైన ఆందోళనలను రేకెత్తిస్తోంది. చట్టపరమైన రక్షణలు ఉన్నప్పటికీ, ఉల్లంఘనలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే వాటి స్థాయి, తీవ్రతల్లో కొంత మార్పు కనిపిస్తోంది. ఇది న్యాయస్థాన ఆదేశాలను అవమానించే ఆందోళనకర ధోరణి కొనసాగడాన్ని సూచిస్తోంది. ఇంకా భయంకరమైన విషయం ఏమిటంటే, కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో కార్యనిర్వాహక వ్యవస్థ వైఫల్యం, కేవలం చట్టపరమైన పరిపాలనను బలహీనపరచడమే కాకుండా, కోర్టు ధిక్కారానికి సైతం ప్రమాదకరమైన ఉదాహరణగా మారుతోంది.

దీనిని నిపుణులు 'ఎగ్జిక్యూటివ్ కోర్ట్స్' అనే ఒక ధోరణికి చెందిందని చెబుతున్నారు. అంటే, అవి ప్రాథమిక హక్కులను రక్షించడం కంటే, పరిపాలనా విభాగపు లక్ష్యాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయి.

బద్మార్ చెప్పినట్లుగా శాసనసభ లేదా కార్యనిర్వాహక విభాగం తమ విధానాలలో హక్కులను సమకాలీనంగా గుర్తించనప్పుడు, న్యాయవ్యవస్థ క్రియాశీల పరిధిని విస్తరించడంలో వెనుకంజ వేస్తున్నట్లుగా కనిపిస్తోంది. 'అధికార విభజన సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వంలోని విభిన్న విభాగాలు స్వతంత్రంగానే కాకుండా సమన్వయంతో పనిచేయాలి. అలాగే హక్కులకు ప్రాధాన్యత ఇచ్చే విధానం అవసరం. కానీ, ఇతర ప్రభుత్వ విభాగాల మద్దతు లేనప్పుడు, న్యాయవ్యవస్థ తరచుగా హక్కుల రక్షణ విస్తృతిని పెంచడానికి వెనుకడుగు వేస్తుంది" అని ఆమె వివరించారు.

అహ్మద్ 'ఈ సంక్షోభాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే కేవలం అమలు వైఫల్యాలకే

**❝ 2023 సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగిన తుగ్లక్‌బాద కూల్చివేత నగర చరిత్రలోనే అతిపెద్ద క్లియరెన్స్ డ్రైవ్‌లలో ఒకటి. ఆ సమయంలో, అక్కడి నోటీసులు అందుకున్న వారు తమ ఇళ్లను మాత్రమే ఎందుకు కూల్చి వేస్తున్నారని ప్రశ్నించారు. ముస్లింల ఇళ్లను కూల్చాలని వాదనకు దిగారు. వారు తమపై చేపట్టిన కూల్చి వేతల చట్టబద్ధతను ప్రశ్నించడం, లేదా తమ హక్కుల గురించి పట్టుబట్టడం వంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం, ❞**

పరిమితం కాకుండా లోతుగా చూడాలి' అని అన్నారు. "ఈ పరిస్థితి కేవలం ఒక అప వాదా..లేక భారతదేశ న్యాయ వ్యవస్థ, రాజ కీయ వ్యవస్థ నిర్మాణంలోని లోతైన సమస్యల లక్షణమా అన్నది పరిశీలించాలి.' అని చెప్పారు.

చారిత్రక దృష్టికోణం నుండి చూస్తే, భారత రాజ్యాంగ పరిణామ క్రమంలో రాజకీయ శక్తి ఎల్లప్పుడూ కేంద్ర స్థానంలో నిలిచిందని అర్థమవుతుఉది. అర్వింద్ ఎలంగో వన్ సహా పలువురు నిపుణులు గుర్తించినట్లు రాజ్యాంగ సభలో స్వచ్ఛమైన నైతిక విలువల కంటే రాజకీయ అధికారానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఈ ప్రాధాన్యతే రాజ్యాంగ సంస్థల కార్యకలాపాలను ఇంకా ప్రభావితం చేస్తూనే ఉంది.

బుల్డోజర్ చర్యల్లోనైనా, శబరిమల కేసులోనైనా, లేదా మాబ్ లించింగ్‌పై తీర్పు యైనా వాటి అమలులోని నిర్లక్ష్యాన్ని ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి" అని అహ్మద్ వివరించారు.

'రాజకీయ ఆధిక్యతను కేంద్రంగా తీసుకుని, రూపుదిద్దుకున్న రాజ్యాంగ నిర్మా ణం, కార్యనిర్వాహక విభాగం తన అధికార పరిధిని అధిగమించడాన్ని కొన్ని సందర్భాల్లో తప్పనిసరి అయ్యే పరిస్థితులను సృష్టించింది. ఈ సమస్యను ఆధునిక భారతదేశంలో మెజారిటీ వాదం పెరుగుదలను మరింత తీవ్ర తరం చేసింది. దాంతో, చట్టాలూ, తీర్పులూ వారు ఎంపిక చేసుకున్న విధంగా వెలువడతు న్నాయి' అని ఆయన విశ్లేషించారు. కొనసాగు తున్న బుల్డోజర్ కూల్చివేతలు కేవలం ఒక తీర్పును నిర్లక్ష్యం చేయడమే కాదు. అవి న్యాయవ్యవస్థలోని లోతైన సంక్షోభాన్ని సూచిస్తు న్నాయి. సంస్థాగత బలహీనతలు, రాజకీయ ప్రయోజనాలు, సిద్ధాంతపరమైన మార్పులు కలిసి 'రూల్ ఆఫ్ లా'ను క్రమంగా దెబ్బతీస్తు న్నాయి. ఈ ధోరణి నియంత్రణలో లేకుండా కొనసాగితే, కార్యనిర్వాహక అధికారంపై నియంత్రణగా న్యాయవ్యవస్థ చేసే పాత్ర బలహీనపడే ప్రమాదం ఉంది. దాంతో రాజ్యాంగ వ్యవస్థ నేరుగా ప్రమాదంలో పడే అవకాశముంది.

**ముస్లింల అస్తిత్వం చెరిపివేత**

'అవి హిందూ కుటుంబాల ఇళ్ళు. కానీ అవి ఇంకా అలాగే ఉన్నాయి' అని అసోం రాష్ట్రంలోని మోరిగా జిల్లాలోని సిల్బంగా హిల్ నివాసులు అన్నారు. ఇళ్ల కూల్చివేతకు బెంగాల్ మూలాలున్న ముస్లిం కుటుంబాలనే ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని వారు ఆరోపిం చారు. జూన్ 24న మోరిగా జిల్లా అధికార యంత్రాంగం నాలుగు తరాలుగా అక్కడే నివసిస్తున్న సుమారు 8,000 మందిని నిరాశ్ర యులను చేసింది. జిల్లా అధికారులు ఈ బహిష్కరణలను సమర్థిస్తూ, అక్కడి నివాసులపై "రైల్వే భూమిని అక్రమంగా ఆక్రమించినవారు" అని ముద్ర వేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి కొంత ప్రతికూల ఫలితాలను చవిచూసి నప్పటికీ, బుల్డోజర్ అన్యాయ యంత్రం మాత్రం ఆగలేదు. అది నిరంతరం ముస్లిం సమాజా లనే లక్ష్యంగా చేసుకుంటూనే ఉంది.

'ముస్లింలపై పెరుగుతున్న ద్వేషం తన అత్యంత దారుణమైన రూపాన్ని వారి కాలనీలు కూల్చివేత, చెరిపివేతల ద్వారా ప్రదర్శించింది. లక్ష్యబద్ధమైన కూల్చివేతలు, బలవంతపు బహిష్క రణలు, జనాభా ఇంజనీరింగ్. ఇవన్నీ కేవలం రాజకీయ ఆధిపత్యాన్ని కేంద్రీకరించ డానికి, ఎన్నికల ఫలితాలను మలచడానికి మాత్రమే కాదు, సమాజంలోని సామూహిక మానసికధోరణిలో స్థిరమైన ద్వేషాన్ని నాటేందు కు కూడా ఉపయోగిస్తున్నారు. ఇది ముస్లింలను వ్యవస్థాగతంగా చెరిపివేస్తూ, ఒక సమిష్టి హిందుత్వ ఊహాచిత్రాన్ని నిర్మించడంపై దృష్టి పెట్టింది' అని జుబేరి చెప్పారు. బుల్డోజర్ ఇక ఒక చిహ్నం మాత్రమే కాదు. హిందుత్వ పిలుపునకు కూడా నినాదమైంది. దానిని తీవ్ర హిందుత్వ వాదుల కార్యక్రమాలలో ప్రదర్శిస్తు న్నారు.

ఫ్రంట్‌లైన్ 2024లో సేకరించిన డేటా ప్రకారం, ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన కూల్చి వేతల వల్ల అత్యంత తీవ్రంగా నష్టపోయిన వారు ముస్లింలేనని స్పష్టమవుతోంది. అందు బాటులో ఉన్న సమాచారం ప్రకారం నమోదిత కేసుల్లో, 55 శాతం వెనుకబడిన వర్గాలైన ముస్లింలు, ఆదివాసీలు, దళితులు, క్రైస్తవు లపైనే ఉన్నాయి. దీనిలోనూ ముస్లింలపైనే దాడి ఎక్కువగా జరిగింది. దీనిలో ఉద్దేశ్య పూర్వ కంగా ఒక అస్థిత్వాన్ని చెరిపివేసే ధోరణి కనపడుతోంది. నిజానికి, ముస్లింలపై చేస్తున్న వేధింపులు న్యాయసమ్మతమేనని, కనీసం తప్పుకాదని అనుకునే విధంగా సమాజాన్ని ప్రభావితం చేస్తున్నారు.

2023 సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగిన తుగ్లక్‌బాద కూల్చివేత నగర చరిత్రలోనే అతిపెద్ద క్లియరెన్స్ డ్రైవ్‌లలో ఒకటి. ఆ సమయంలో, అక్కడి నోటీసులు అందుకున్న వారు తమ ఇళ్లను మాత్రమే ఎందుకు కూల్చి వేస్తున్నారని ప్రశ్నించారు. ముస్లింల ఇళ్లను కూల్చాలని వాదనకు దిగారు. వారు తమపై చేపట్టిన కూల్చివేతల చట్టబద్ధతను ప్రశ్నించడం, లేదా తమ హక్కుల గురించి పట్టుబట్టడం వంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం, వాటికి బదులుగా వారు తమతో కలిసి ఉంటున్న మరో సమాజాన్ని ఎందుకు శిక్షించడం లేదని ప్రశ్నిస్తున్నారు. .


62 ఏళ్ల సుష్మ దత్ తనకు ఓటు హక్కు వచ్చినప్పటి నుండి బిజెపికి మాత్రమే ఓటు వేశానని చెబుతోంది. 'మేము రోహింగ్యా లు కాదు, బెంగాలీ ముస్లింలం కాదు. ప్రభుత్వా నికి వారితో సమస్యలు ఉన్నాయి. కానీ మమ్మల్ని ఎందుకు వేధిస్తున్నారు? ముస్లింలను తొలగిం చాలనుకుంటే వారినే తొలగించండి. మేము హిందువులం" అని ఆమె కూల్చివేతల సిబ్బం దితో వాదనకు దిగారు.

సుష్మ నమ్ముతున్న విశ్వాసం ప్రజల మధ్య ఐక్యతను పెంచేది కాదు. దానికి బదు లుగా విభజనకు ప్రాధాన్యం ఇచ్చే రాజకీయ అజెండాను ఆమె భుజాలకెత్తుకున్నారు. కర్ణాటక హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న స్వతంత్ర న్యాయవాది అర్జున్ ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నారు. ప్రభుత్వ కథనమంతా ద్వేషాన్ని పెంపొందించ డంపైనే ఆధారపడి ఉందని ఆయన అన్నారు. 'అది ఒకే శత్రువుపై కలిగించే సామూహిక

*(మిగతా 28వ పేజీలో)*

చరిత్ర

# డిల్లీ సుల్తానుల కాలం (1200-1400)
# ఖిల్జీలు, తుగ్లఖ్‌లు


రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎంవిఎస్ శర్మ

బాల్బన్ 1286లో మరణించాడు. అతడి పెద్ద కొడుకు మంగోలులతో జరిగిన యుద్ధంలో అంతకు ముందే మరణించాడు. రెండవ కొడుకు డిల్లీకి వచ్చి పాలించడానికి ఇష్టపడక, తాను బెంగాల్–బీహార్ ప్రాంతపు రాజ ప్రతినిధిగానే కొనసాగుతానని ప్రకటించాడు. అప్పుడు బాల్బన్ మనుమడిని రాజుగా ప్రతిష్ఠించడానికి పూనుకున్నారు. కానీ అప్పటికే తురుష్కుల పెత్తనం పట్ల విసిగివున్న ఇతర తెగల వారు, ముఖ్యంగా భారతీయ ముస్లింలు, ఖిల్జీలువంటి ఇతర తెగల వారు అందుకు అంగీకరించలేదు. 1290లో జలాలుద్దీన్ ఖిల్జీ నాయకత్వంలో వారంతా తిరుగుబాటు చేసి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. దానితో పరిపాలనలో కేవలం తురుష్కులకే ఆధిపత్యం ఉండే పరిస్థితి అంతమైంది.

జలాలుద్దీన్ ఖిల్జీ బాల్బన్ కాలంలో ప్రవేశపెట్టిన నియంతృత్వ, క్రూర పాలనా విధానాలను మార్చడానికి ప్రయత్నించాడు. పాలకులు ప్రజామోదం పొందగలిగినప్పుడే స్థిరంగా కొనసాగుతారని భావించాడు. దేశంలో మెజారిటీ హిందువులు అయినప్పుడు దానిని ఇస్లామిక్ రాజ్యంగా మార్చకూడదు అని ప్రకటించాడు. క్రూరమైన శిక్షలను రద్దు చేశాడు. ఆరు సంవత్సరాలపాటు మాత్రమే జలాలుద్దీన్ ఖిల్జీ పాలించాడు.

జలాలుద్దీన్ ఖిల్జీ అనుసరించిన విధానాలు దిగువ స్థాయి అధికారులలో అతడు బలహీనమైన ప్రభువు అన్న అభిప్రాయం కలగడానికి దారి తీశాయి. అతడికి అల్లుడైన అల్లావుద్దీన్ ఖిల్జీ (1296–1316) అప్పట్లో అయోధ్యకు రాజప్రతినిధిగా ఉండేవాడు. అప్పటికే దక్కన్ ప్రాంతంలోని దేవగిరిని ఆక్రమించుకుని అక్కడి సంపదనంతటినీ తన స్వంత ఖజానాకు మళ్ళించాడు. తానే స్వయంగా ఆ ఖజానాను స్వాధీనం చేసుకోవాలని వెళ్ళిన జలాలుద్దీన్‌ను కుట్రపూరితంగా అల్లావుద్దీన్ ఖిల్జీ హత్య చేశాడు. అతడివెంట ఉన్న సహచరులలో పలువురిని తన వద్ద ఉన్న బంగారంతో ప్రలోభపెట్టి తనవైపు తిప్పుకున్నాడు. ఆ విధంగా డిల్లీ గద్దెనెక్కిన అల్లావుద్దీన్ ఖిల్జీ ముందు డిల్లీలో స్థిరపడిన మంగోలులను మూకుమ్మడిగా హత్యలు గావించాడు. వారి భార్యాబిడ్డలను సైతం విడిచిపెట్టలేదు.

తన దిగువన ఉన్న అధికారులు తనపై తిరుగుబాటు చేయకుండా ఉండేందుకు వారిమీద నిఘా పెంచాడు. ఎటువంటి విందు వినోదాలూ నిర్వహించకుండా ఆంక్షలు పెట్టాడు. సారా, ఇతర మత్తు పదార్థాల వాడకాన్ని నిషేధించాడు. ఈ కఠినమైన చర్యల ద్వారా అల్లావుద్దీన్ తన జీవితకాలంలో ఎటువంటి తిరుగుబాటూ జరగకుండా నిరోధించగలిగాడు. తమ తమ పరిధులలో అధికారాల కోసం ప్రశ్నించే స్వభావం అధికారులలో పూర్తిగా చచ్చిపోయింది. డిల్లీ గద్దెపై ఎవరు ఎక్కితే వారిని ప్రభువుగా అంగీకరించి తలలూపే కొత్త తరహా అధికారులు వచ్చారు.

ఈ పరిస్థితిని అల్లావుద్దీన్ ఖిల్జీ అనంతరం (1316) ఇతరులు ఉపయోగించుకున్నారు. అల్లావుద్దీన్ జీవించివున్న కాలంలో అతడికి అనుంగు సేవకుడిగా మెలిగిన మాలిక్ కాఫిర్ అల్లావుద్దీన్ కుమారుడిని, అతడికింకా యుక్త వయస్సు రాకపోయినప్పటికీ రాజుగా నిలబెట్టాడు. అల్లావుద్దీన్ సంతానంలో తక్కినవారినందరినీ చంపించాడు, ఐతే, అనతికాలంలోనే మాలిక్ కాఫిర్‌ను కోటకు కాపలాగా ఉండే సైనికులే హత్య చేశారు. అప్పుడు ఖుస్రూ అనేవాడు సింహాసనమెక్కాడు. కాని ఎంతో కాలంపాటు పాలించలేకపోయాడు. 1320లో కొంతమంది అధికారులను కూడగట్టి ఘియాసుద్దీన్ తుగ్లఖ్ బహిరంగంగా తిరుగుబాటు చేశాడు. డిల్లీకి వెలపల భీకర యుద్ధం జరిగింది. అందులో ఖుస్రూ ఓడిపోయాడు. ఆ తర్వాత అతడిని చంపివేశారు. అప్పుడు ఘియాసుద్దీన్ తుగ్లఖ్ రాజ్యాధికారం చేపట్టాడు.

**తుగ్లఖ్‌లు**


తుగ్లక్‌ల వంశం 1320 నుండి 1412 వరకూ డిల్లీని పాలించింది. ఘియాసుద్దీన్, అతడి కుమారుడు మహమ్మద్ బిన్, అతడి మేనల్లుడు ఫిరోజ్ షా అనే ముగ్గురు తుగ్లఖ్ ప్రభువులు డిల్లీని సమర్థవంతంగా పాలించారు. ఘియాసుద్దీన్ అనంతరం, మహమ్మద్ బిన్ తుగ్లఖ్ 1324 నుంచి 1351 వరకూ పాలించగా, ఫిరోజ్ షా తుగ్లఖ్ 1351 నుంచి 1388 వరకూ పాలించాడు. వీరి కాలంలో చాలా సువిశాలమైన సామ్రాజ్యం మీద తమ అధికారాన్ని నెలకొల్పగలిగారు. (చూ. 13వ శతాబ్దంలో డిల్లీ సుల్తానుల రాజ్యం మ్యాప్)

ఫిరోజ్ తుగ్లఖ్ మరణానంతరం కూడా 1412 వరకూ డిల్లీ మీద తుగ్లఖ్‌లదే పాలన కొనసాగినా, అది క్రమంగా బలహీనపడుతూ వచ్చింది. 1398లో తైమూర్ చక్రవర్తి డిల్లీని ఆక్రమించుకోవడంతో తుగ్లఖ్‌ల ఆధిపత్యం అంతమైందనే చెప్పాలి. ఇప్పుడు ఖిల్జీల, తుగ్లఖ్‌ల కాలంలో డిల్లీ సామ్రాజ్యం ఎలా విస్తరించిందో తెలుసుకుందాం.

**డిల్లీ సుల్తానుల ఆధిపత్య విస్తరణ**

బాల్బన్ కాలం నాటికి తూర్పు రాజస్తాన్ ప్రాంతం డిల్లీ సుల్తానుల పెత్తనం కిందకు వచ్చింది. ఐతే కొద్ది కాలానికే, బాల్బన్ జీవించివున్న కాలంలోనే రణతంబోర్

**“ అల్లావుద్దీన్ ఖిల్జీకి నమ్మకస్తులైన ఇద్దరు సేనానుల నాయకత్వంలో గుజరాత్ మీద దండయాత్రకు 1299 లో డిల్లీ సేనలు బయలుదేరాయి. మార్గమధ్యంలో జైసల్మేర్‌ను ముట్టడించాయి. ఎటువంటి ప్రతిఘటనా ఇవ్వకుండానే ఆ రాజు పలాయనం చిత్తగిం చాడు. ఆ తర్వాత గుజరాత్‌లోని ముఖ్య పట్టణాలను డిల్లీ సేనలు కొల్లగొట్టాయి. ”**




సంస్థానం డిల్లీ పెత్తనానికి ఎదురుతిరిగి స్వతంత్రరాజ్యం అయింది. అది రాజస్తాన్ లోకెల్లా అత్యంత శక్తింతమైన రాజ్యంగా ఉండేది. దానితోబాటు దక్షిణ, పశ్చిమ రాజస్తాన్ ప్రాంతం అంతా డిల్లీ సుల్తానుల పెత్తనానికి లోబడకుండా వేరు వేరు రాజ్యాలుగా ఉండేది. డిల్లీలో అల్లావుద్దీన్ ఖిల్జీ గద్దెనెక్కడంతో ఒక కొత్త పరిస్థితి ఏర్పడింది. 25 సంవత్సరాల వ్యవధిలో డిల్లీ సుల్తానుల పాలన గుజరాత్‌ను, మాళ్వ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. అంతేగాక దక్కనులోకి డిల్లీ సేనలు ప్రవేశించి మదురై వరకూ తమ దండయాత్రను కొనసాగించాయి. క్రమంగా ఈ ప్రాంతాన్నంతటినీ తన ప్రత్యక్ష పాలనలోకి తెచ్చుకున్నది. అల్లావుద్దీన్ ఖిల్జీ హయాంలో మొదలైన ఈ విస్తరణ మహమ్మద్‌బిన్ తుగ్లఖ్ పాలనాకాలం దాకా కొనసాగింది.

అంతవరకూ మాళ్వ, గుజరాత్, దేవగిరి రాజ్యాలను రాజపుత్ర వంశాలు పాలించేవి. ఈ రాజ్యాలు 12వ శతాబ్దం చివర్లో , 13వ శతాబ్దం ప్రారంభంలో ఉనికిలోకి వచ్చాయి. అటు గంగా పరీవాహక ప్రాంతంలో తురుష్కుల ఆధిపత్యం నెలకొని బలపడుతున్నా, ఈ రాజపుత్ర వంశాలు తమలో తాము ఘర్షణ పడుతూవుండే ధోరణిని కొనసాగిస్తూనే వచ్చాయి. ఇల్టుట్మిష్ కాలంలో అతడి సేనలు గుజరాత్‌ను చుట్టుముట్టినప్పుడు మరోపక్క నుండి గుజరాత్‌ను మాళ్వ, దేవగిరి సైన్యాలు కూడా దాడికి పూనుకున్నాయి. మరోపక్క మరాఠా ప్రాంతంలో దేవగిరి రాజులు తెలంగాణా ప్రాంతంలోని వరంగల్ రాజులతోను, కర్నాటకలోని హొయసలుల తోను పదే పదే యుద్ధాలకు దిగుతూ వుండేవారు. ఈ హొయసలులు తమకు దక్షిణాన ఉన్న పాండ్యులతో యుద్ధాలలో మునిగితేలుతూవుండేవారు. ఇలా ఈ రాజ్యాలన్నీ పరస్పరం యుద్ధాలలో మునిగిపోవడం డిల్లీ సుల్తానుల రాజ్య విస్తరణకు బాగా ఉపయోగపడింది. వారి దురాక్రమణ మరింతగా దక్షిణాది వైపు కొనసాగడానికి దోహదం చేసింది.

డిల్లీ సుల్తానులు మాళ్వ, గుజరాత్‌ల మీద ప్రధానంగా దృష్టి పెట్టడానికి కారణాలున్నాయి. మొదటిది ఆ ప్రాంతాలు చాలా సారవంతమైన భూములతో ఉన్నాయి. రెండవది అవి పశ్చిమ సముద్ర తీరాన ఉన్నాయి. గంగా మైదాన ప్రాంతాన్ని పశ్చిమ సముద్ర తీరాన ఉన్న ఓడరేవులతో సంధానించడానికి ఈ ప్రాంతాలమీద ఆధిపత్యం అవసరం. అంతేగాక డిల్లీ సుల్తానుల సైన్యానికి కావలసిన మంచి నాణ్యత కల గుర్రాలను అరేబియా ప్రాంతం నుండి తెచ్చుకోడానికి ఈ ఓడరేవులు ఉపయోగ పడతాయి. మధ్య ఆసియా, పశ్చిమ ఆసియా ప్రాంతాల మీద మంగోలులు ఆధిపత్యం సాధించడంతో అరేబియా ప్రాంతంతో వ్యాపారం నడపడానికి సముద్ర మార్గం వినా వేరే దారి డిల్లీకి లేకుండా పోయింది.

అల్లావుద్దీన్ ఖిల్జీకి నమ్మకస్తులైన ఇద్దరు సేనానుల నాయకత్వంలో గుజరాత్ మీద దండయాత్రకు 1299లో డిల్లీ సేనలు బయలుదేరాయి. మార్గమధ్యంలో జైసల్మేర్‌ను ముట్టడించాయి. ఎటువంటి ప్రతిఘటనా ఇవ్వకుండానే ఆ రాజు పలాయనం చిత్తగించాడు. ఆ తర్వాత గుజరాత్‌లోని ముఖ్య పట్టణాలను డిల్లీ సేనలు కొల్లగొట్టాయి. 12వ శతాబ్దంలో పునర్నిర్మించిన సోమనాధ దేవాలయాన్ని కూడా కొల్లగొట్టారు. ఈ సేనలు కాంబేలోని సంపన్నులైన ముస్లిం వ్యాపారులను కూడా విడిచిపెట్టలేదు. వారినీ దోచుకున్నారు. గుజరాత్ తేలికగా డిల్లీ సేనల వశం కావడానికి ఒక కారణం అక్కడి పాలకుల పట్ల ప్రజల్లో ఎటువంటి ఆదరాభిమానాలూ లేకపోవడమే.

గుజరాత్‌ను ఆక్రమించుకున్నాక అల్లావుద్దీన్ రాజస్తాన్ వైపు దృష్టి సారించాడు. గుజరాత్‌ను కొల్లగొట్టి దోచుకున్న సంపదలో వాటాలు పంచుకోవడంలో తలెత్తిన వివాదాల కారణంగా మంగోలు సైనికులు తిరగబడ్డారు. వారినందరినీ మూకుమ్మడిగా అంతం చేశాడు అల్లావుద్దీన్. ఐతే అక్కడినుంచి తప్పించుకున్న ఇద్దరు మంగోలు సేనానాయకులు రణతంభోర్‌కు పారిపోయి అక్కడి రాజు హమిరదేవుడి రక్షణను అభ్యర్ధించారు. ఈ హమిరదేవుడు పృథ్వారాజ్ చౌహాన్ పరంపరలోనివాడు. అంతకు ముందే జలాలుద్దీన్ ఖిల్జీ నేతృత్వంలోని సైన్యాలను ఓడించాడు. ఇప్పుడు అల్లావుద్దీన్ పంపిన సేనలను కూడా తరిమికొట్టాడు. ఆ తర్వాత అల్లావుద్దీన్ మూడు

**"1320లో ఘియాసుద్దిన్ తుగ్లఖ్ ఢిల్లీ ప్రభువు అయిన తర్వాత అతడి కుమారుడు మహమ్మద్ బిన్ తుగ్లఖ్‌ను దేవగిరి ప్రాంతానికి పాలకుడిగా నియమించాడు. అక్కడినుండి దక్షిణం వైపు విస్తరించడమే ఈ నియామకం వెనుక లక్ష్యం. దానికి అనుగుణంగానే మహమ్మద్ బిన్ తుగ్లఖ్ వరంగల్‌ను, కర్నాటక ప్రాంతంలోని మబర్‌ను స్వాధీనం చేసుకున్నాడు. అక్కడినుండి ఒరిస్సా దిశగా మరలాడు. ఆ తర్వాత సంవత్సరంలో అతడు బెంగాల్‌ను లొంగదీసుకోగలిగాడు."**

నెలల పాటు రణతంభోర్ కోటను స్వయంగా ముట్టడించాడు. ఆ పోరాటంలో చివరకు హమిరదేవుడి సేనలు ఓడిపోయాయి. ఐతే చివరి సైనికుడి వరకూ పోరాడి ప్రాణా లర్పించారు. ఇక స్త్రీలందరూ మంటల్లో దూకి ఆత్మాహుతి చేసుకున్నారు. 1301లో రణతంభోర్ ఢిల్లీ వశమైంది.

అక్కడినుంచి అల్లావుద్దిన్ చిత్తోర్ వైపు కదిలాడు. రణతంభోర్ తర్వాత అదే శక్తివంతమైన రాజ్యంగా ఉండేది. చిత్తోర్ రాణి పద్మిని అందానికి ప్రభావితుడై అల్లావుద్దిన్ ఆమెను చెరబట్టగోరాడని, అందుకు నిరాకరించి ఆమె ఆత్మాహుతి చేసుకున్నదని ఒక గాథ ప్రచారంలో ఉంది. ఈ గాథ గురించి ప్రస్తావనలు చిత్తోర్ యుద్ధం జరిగిన తర్వాత వందేళ్ళ అనంతరం మాత్రమే కనిపించడం బట్టి ఇది కల్పిత గాథ మాత్రమేనని ఆధునిక చరిత్రకారులు భావిస్తున్నారు. ఆ గాథలో పద్మిని సింహళ ద్వీపానికి చెందిన రాకుమారి అని, ఆమెను పొందడానికి చిత్తోర్ రాజు రతన్‌సింగ్ సప్త సముద్రాలనూ దాటి వెళ్ళాడని ఆ గాథలో ఉంది. ఇది వాస్తవాలకు భిన్నంగా ఉంది. కొన్ని నెలల ముట్టడి తర్వాత అల్లావుద్దిన్ చిత్తోర్‌ను 1303లో తన వశం చేసుకోగలిగాడు. ఆ తర్వాత రాజస్తాన్‌లోని అన్ని రాజ్యాలూ ఒకదానివెంట ఒకటిగా అల్లావుద్దిన్‌కు లొంగిపోయాయి. ఆ తర్వాత అజ్మీర్, నాగౌర్ వంటి కొన్ని ముఖ్యమైన పట్టణాలలో తన సేనలను మోహరించివుంచడం తప్ప ఆ రాజ్యాల రోజువారీ పరిపాలనను లొంగిపోయిన రాజులకే అల్లావుద్దిన్ విడిచిపెట్టాడు.

**దక్కన్, దక్షిణ భారతం**

రాజస్తాన్ మాదిరిగా కాకుండా మాళ్వ ప్రాంతాన్ని అల్లావుద్దిన్ నేరుగా తన పాలన కిందనే కొనసాగించాడు. 1306-7 లో అల్లావుద్దిన్ మాళ్వ నుండి విస్తరణకు పూనుకున్నాడు. ముఖ్యంగా దేవగిరి మీద దాడికి దిగాడు. అంతకు ముందు దేవగిరి రాజు రాయ్ రామచంద్ర అల్లావుద్దిన్‌కు సామంతుడిగా ఉండేందుకు, అందుకు గాను ఏటా కప్పం చెల్లించడానికి అంగీకరించాడు. ఐతే ఆ కప్పం చెల్లించకపోవడంతో అల్లావుద్దిన్ దేవగిరిమీద దండయాత్రకు దిగాడు. ఈ దాడికి మాలిక్ కాఫుర్ నాయకత్వం వహించాడు. ఇతడు అల్లావుద్దిన్‌కు బానిసగా ఉండేవాడు. ఆ దండయాత్రలో రామచంద్ర మాలిక్ కాఫుర్‌కు రాయ్ లొంగిపోయాడు. ఆ తర్వాత అతడి రాజ బిరుదును పునరుద్ధరించి, గుజరాత్‌లో ఒక జిల్లాకు అధిపతిగా చేసి సఖ్యత కొనసాగించాడు అల్లావుద్దిన్, రాయ్ రామచంద్ర కుమార్తెను అల్లావుద్దిన్ వివాహమాడాడు. ఈ స్నేహం తర్వాత కాలంలో దక్కను మీద దాడుల సందర్భంలో చాలా ఉపయోగపడింది.

1309-1311 మధ్య మాలిక్ కాఫుర్ తెలంగాణా ప్రాంతంలోని వరంగల్ మీద, కర్నాటక ప్రాంతంలోని ద్వారసముద్రం, మబర్‌ల మీద, తమిళనాడులోని మదురై మీద దాడులకు పూనుకున్నాడు. ఆ దాడులలో అపారమైన సంపదను కొల్లగొట్టాడు. వరంగల్, ద్వారసముద్రం పాలకులు ఢిల్లీకి సామంతు లుగా ఉండడానికి, ఏటా కప్పం చెల్లించడానికి అంగీకరించారు. మాలిక్ కాఫుర్ తమిళనాడులోని పలు దేవాలయాలను కొల్లగొట్టగలిగాడే తప్ప తమిళ సేనలమీద విజయం సాధించకుండానే వెనుదిరిగాడు.

అల్లావుద్దిన్ జీవించివున్న కాలంలో ఈ ప్రాంతాలన్నింటిమీదా ప్రత్యక్షంగా పాలన సాగించడానికి సుముఖంగా లేడు. అతడు మరణించిన 15 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన పాలకులు క్రమంగా ఈ ప్రాంతమంతటా ప్రత్యక్ష పాలనను నెలకొల్పడం ప్రారంభించారు. 1320లో ఘియాసుద్దిన్ తుగ్లఖ్ ఢిల్లీ ప్రభువు అయిన తర్వాత అతడి కుమారుడు మహమ్మద్ బిన్ తుగ్లఖ్‌ను దేవగిరి ప్రాంతానికి పాలకుడిగా నియమించాడు. అక్కడినుండి దక్షిణం వైపు విస్తరించడమే ఈ నియామకం వెనుక లక్ష్యం. దానికి అనుగుణంగానే మహమ్మద్ బిన్ తుగ్లఖ్ వరంగల్‌ను, కర్నాటక ప్రాంతంలోని మబర్‌ను స్వాధీనం చేసుకున్నాడు. అక్కడినుండి ఒరిస్సా దిశగా మరలాడు. ఆ తర్వాత సంవత్సరంలో అతడు బెంగాల్‌ను లొంగదీసుకోగలిగాడు.

1324 నాటికి ఢిల్లీ సామ్రాజ్యం సరిహద్దులు దక్షిణాన మదురై వరకూ విస్తరించాయి. ఈ విధంగా స్వల్ప కాల వ్యవధిలోనే ఢిల్లీ సామ్రాజ్యం దక్షిణాన, తూర్పున విస్తరించడంతో ఈ విశాల ప్రాంతాన్ని అదుపులో ఉంచుకుంటూ పరిపాలన సాగించడం మహమ్మద్ బిన్ తుగ్లఖ్‌కు ఒక పెద్ద సవాలుగా మారింది. ఈ సవాలును ఎదుర్కొనే క్రమంలోనే మహమ్మద్ బిన్ తుగ్లఖ్ పలు పాలనాపరమైన కొత్త పద్ధతులను ప్రవేశపెట్టాడు.

*(వాటి గురించి వచ్చే సంచికలో చర్చిద్దాం)*

**'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

అధ్యయనం

# ప్రభుత్వ భూములు ప్రైవేటు కంపెనీలకు దారాదత్తం

ఈ ఆ స శర్మ



రచయిత కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి

**(ప్రస్తుతం విశాఖపట్నంలో నివసిస్తున్న కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్ శర్మ, నేడు రాష్ట్రంలో ప్రభుత్వ భూములను ప్రయివేటు కంపెనీలకు విచ్చలవిడిగా పందేరం చేయడంపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవిన్యూ మంత్రికి ఉత్తరాలు రాశారు. ఎంతో సమాచారంతో కూడిన ఆ ఉత్తరాలను సంగ్రహపరిచి మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం....సంపాదకుడు)**

గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు వాటికి నచ్చిన ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా, అత్యంత చవకగా, ఏక పాక్షికంగా, చట్ట విరుద్ధంగా, ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా, ధారాదత్తం చేయడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధం. అటువంటి భూకేటాయింపు నిర్ణయాల మీద సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఇడి, సిబిడిటి వంటి సంస్థలతో నిష్పాక్షికమైన దర్యాప్తు చేయించడం అవసరం. అటువంటి దర్యాప్తుల్లో, వేలాది కోట్ల భూకుంభకోణాలు బయట పడే అవకాశం ఉంది.

ప్రయివేటు కంపెనీలు పెట్టుబడులు తెస్తాయనీ, ఉద్యోగావకాశాలు కలిగిస్తాయనే ప్రచారంచేస్తూ గత కొన్ని దశాబ్దాలుగా, అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలు ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించవలసిన అతి విలువైన ప్రభుత్వ భూములను తమకు కావాల్సిన ప్రైవేటు కంపెనీలకు, తక్కువ ధరలకు, ధారాదత్తం చేయడం మన రాష్ట్రంలో ఆనవాయితీగా మారింది. ఉదాహరణకు, కొద్ది రోజుల క్రిందట ప్రభుత్వం, విదేశీ కంపెనీ అయిన లులు కంపెనీకి విశాఖపట్నం, విజయవాడ నగరాల నడిబొడ్డులో వందలాది కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను చట్టవిరుద్ధంగా దారాదత్తం చేసింది. దీనిపై సిబిఐ, ఇడిల చేత దర్యాప్తు చేయించాలని, అటువంటి అక్రమమైన భూముల కేటాయింపుకు బాధ్యులైన రాజకీయ నేతల మీద, అధికారుల మీద, కఠినమైన చర్యలు తీసుకోవడం అవసరమని, గత జూలై 28న నేను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశాను. ఆ లేఖ ప్రతిని సిబిఐ, ఇడి వారికిపంపడం జరిగింది.

ఇటువంటి భూకుంభకోణాలు గతంలో ఎన్నో ఏళ్లుగా జరిగాయి. 2019 నుంచి, ఈరోజు వరకు, ప్రభుత్వంలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కొన్ని అక్రమమైన భూకేటాయింపుల వివరాలను సేకరించి మచ్చుకు లేఖలో పొందుపరిచాను.

నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం, కారేడు పంచాయత్‌లో ఇటీవల ప్రభుత్వం 8,346 ఎకరాల సస్యశ్యామలమైె వ్యవసాయ భూమిని, రైతుల కడుపులు కొట్టి, ఇండోసోల్ కంపెనీకి ఇవ్వడమే కాకుండా, అత్యంత దారుణమైన రీతిలో ఆ కంపెనీ చేయబోయే పెట్టుబడి భారంలో 50 %కి పైగా ప్రభుత్వమే భరిస్తుందనే ఆశ్చర్యకరమైన రాయితీ కూడా ఇచ్చింది.

అదే ఇండీసోల్ కంపెనీకి గత వైసిపి ప్రభుత్వం కూడా ఉదారంగా భూము లను ఇచ్చింది. ఆ భూకేటాయింపుల వివరాలు క్రింద సూచిస్తున్నాను:

అంటే వారికి నచ్చిన ప్రైవేట్ కంపెనీలకు ప్రజల భూములను ధారాదత్తం చేయడంలో నేతలు చూపించే న్యాయం ఒకటి, ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వ రంగ సంస్థల పట్ల, ఎన్జీఓల పట్ల చూపించే వైఖరి ఇంకొకటి నన్నమాట!

పైన సూచించిన వివరాల ఆధారంగా, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, క్రింది ప్రశ్నలకు జవాబు ఇవ్వవలసిన అవసరం ఉంది:

1. ప్రభుత్వం భూములను ప్రజాప్రయోజనాలకే ఉపయోగించాలనీ, ప్రజల ఆరోగ్య, వైద్య సౌకర్యాలవంటి అవసరాలకోసం, ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు తప్పనిసరిగా ఇవ్వాల్సి వస్తే కేవలం లీజు రూపంలో, కనీసం భూమి మార్కెట్ ధర ఆధారంగా 10% ఏటా లీజ్ రెంటుకు మాత్రమే ప్రైవేట్ కంపెనీలకు బదలాయించాలనీ, రాష్ట్రప్రభుత్వం అప్పటి మంత్రివర్గం సమావేశంలో 2012లో ఒక సమగ్రమైన విధానాన్ని అమలులోకి తీసుకురావడం జరిగింది. ఏ విధానం చేపట్టినా, ఆ విధానం రాజ్యాంగ విలువలకు అనుగుణంగా, ప్రజా విశ్వాస సిద్ధాంతం (Doctrine of Public Trust) కు అనుగుణంగా ఉండాలి. అటువంటి విధానాన్ని అమలుచేయడం వెనుక ఉద్దేశం, ప్రభుత్వాలు, అందరిపట్ల, ఎటువంటి వివక్షత చూపకుండా, పారదర్శకమైన, న్యాయబద్ధమైన సమాన వైఖరి చూపించాలన్నది. కానీ పైన సూచించిన భూకేటాయింపులు,ఎన్నోవిధాలుగా 2012 భూకేటాయింపు విధానాన్ని ఉల్లంఘించాయి.

2. ప్రజలకు, సమాజానికి ఉపయోగపరమైన పెట్టుబడులు రాష్ట్రానికి రావాలంటే, భూములు చవకగా ఇవ్వడంకాదు, ప్రభు

త్వవిధానాలు న్యాయబద్ధంగా, పారదర్శకంగా, అందరి పట్ల సమానమైన వైఖరిని చూపడం అవసరం.

3. ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వరంగ సంస్థలకు, ప్రభుత్వభూములను హెచ్చు ధరలకు కేటాయిస్తూ, ప్రజలవద్దనుంచి లాభాలు గడించే ప్రైవేట్ కంపెనీలకు, అదే ప్రభుత్వ భూములను అతి చవకగా ధారాదత్తం చేయడం, ప్రైవేట్ కంపెనీల యాజమాన్యాలకు, అక్రమంగా లబ్ది చేకూర్చడమే కదా?

> **❝ప్రభుత్వాలు, ప్రభుత్వభూములకు, ప్రజల తరఫున ట్రస్టీలు మాత్రమే కానీ, ప్రజల విశ్వాసాన్ని ఉల్లంఘించి, ఏకపాక్షికంగా ఆ భూములను ఇష్టానుసారం ప్రైవేట్ కంపెనీలకు తక్కువ ధరలకు పంచిపెట్టడం, సుప్రీమ్ కోర్టు ధ్రువపరిచిన ప్రజా విశ్వాస సిద్ధాంతాన్ని** (Doctrine of Public Trust) **ను ఉల్లంఘించినట్లు అవుతుంది కదా?❞**

4. ప్రభుత్వాలు, ప్రభుత్వభూములకు, ప్రజల తరఫున ట్రస్టీలు మాత్రమే కానీ, ప్రజల విశ్వాసాన్ని ఉల్లంఘించి, ఏకపాక్షికంగా ఆ భూములను ఇష్టానుసారం ప్రైవేట్ కంపెనీలకు తక్కువ ధరలకు పంచిపెట్టడం, సుప్రీమ్ కోర్టువారు ధ్రువపరిచిన ప్రజా విశ్వాస సిద్ధాంతాన్ని (Doctrine of Public Trust) ను ఉల్లంఘించినట్లు అవుతుంది కదా?

5. పైన మచ్చుకు సూచించిన వివరాల ఆధారంగా, ప్రభుత్వం, ఒక్కొక్క కంపెనీ విషయంలో, భూముల ధర నిర్ణయించడంలో, ఒకొక్క వైఖరి చూపడం, వారి మధ్యలో కూడా పక్షపాత వైఖరి చూపించడం అవుతుంది కదా?

6. కంపెనీలు పెట్టుబడుల విషయంలో, ఉద్యోగావకాశాల విషయంలో ఇచ్చిన హామీలు ఎంతవరకు నెరవేర్చాయో, వాటి పట్ల పక్షపాతం చూపిస్తూ భూములను చవకగా ఇచ్చి, రాయితీలు ప్రసాదించిన ప్రభుత్వాలు ఎటువంటి సమీక్ష చేయకపోవడం, ఆ విషయంలో ప్రజలకు జవాబుదారీగా ఉండకపోవడం, ప్రజలు విస్మృతంగా ప్రశ్నిస్తున్నారు. హామీలను నెరవేర్చని కంపెనీలమీద ప్రభుత్వం చర్యలు తీసుకున్న సందర్భాలు అరుదు.

7. అటువంటి పక్షపాతం చూపిస్తున్న రాజకీయ పార్టీలు, వారి నాయకులు, ఆ కంపెనీల వద్ద నుంచి, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఎన్నికలలోనూ, ఇతర సందర్భాలలోనూ ఎలాంటి సహాయం పొందారు? ఆ విషయం మీద నిష్పాక్షికమైన దర్యాప్తు జరిగితే, నిజానిజాలు బయట

## వివిధ ప్రయివేటు కంపెనీలకు ప్రభుత్వం దారాదత్తం చేసిన భూముల వివరాలు

| GOMS No | తేదీ | లబ్ధిదారు | విస్తీర్ణం (ఎకరాలు) | జిల్లా / మండలం | ధర (రూ) |
|---|---|---|---|---|---|
| 129రెవిన్యూ విభాగం ) | 15-3- 2024 | ఇండీసోల్ | 3773.91 | వైఎస్ఆర్ కడప/మైలవరం లీజు | తక్కువధరకు |
| 130 విభాగం) | 15-3- 2024 | ఇండేసోల్ | 941.39 | వౌఎస్ఆర్ కడప | తక్కువ ధరకు |
| 131 రెవిన్యూ విభాగం) | 15-3-2024 | ఎ ఇండేసోల్ | 10225.9 | సంధ్యాల / మిగుండ్ల ఎకరం / సంవత్సరం | రూ. 31,000 |
| 132 రెవిన్యూ విభాగం) | 15-3-2024 | ఇండేసోల్ | 2692.49 | అనంతపురం/తాడిపత్రిజి | రూ. 31,000 ఎకరం/సం |

### ప్రభుత్వాలు, గ్రీసుకో కంపెనీకి, ఆ కంపెనీకి సంబంధించిన ఇతర కంపెనీలకు ఇచ్చిన భూకేటాయింపుల వివరాలు

| రెవిన్యూ విభాగం జిఓ ఎంఎస్ నెం | తేదీ | లబ్ధిదారు | విస్తీర్ణం (ఎకరాలు) | జిల్లా / మండలం | ధర (ఎకరాకు,రూ. |
|---|---|---|---|---|---|
| 550 | 26-7-2022 | గ్రీసుకో | 2467.28 | కర్నూలు/పాణ్యం | 5లక్షలు |
| 131 | 21-3-2023 | ఎఎం గ్రీన్ ఎనెర్జీ | 982.2 | నంధ్యాల/పాణ్యం | 5 లక్షలు |
| 141 | 23-3-2023 | ఎఎం గ్రీన్ ఎనెర్జీ | 624.65 | నంధ్యాల పాణ్యం | 5 లక్షలు |
| 248 | 16-6-2023 | గ్రీసుకో | 30.53 | కర్నూలు /ఓర్వకల్ | 5 లక్షలు |
| 249 | 16-6-2023 | గ్రీసుకో | 244.97 | నంధ్యాల / పాణ్యం | 5 లక్షలు |
| 113 | 15-3-2024 | గ్రీసుకో | 4800 | నంధ్యాల / ఔక్ | ఎ 5 లక్షలు 2000 ఎకరాల వరకు |
| 114 | 15-3-2024 | గ్రీసుకో | 386.04 | కర్నూలు/ఓర్వకల్ | 5 లక్షలు |
| 134 | 15-3-2024 | గ్రీసుకో | 973.55 | కర్నూలు/ గడివేముల | 5 లక్షలు |

> **"పైన సూచించిన కొన్ని భూకేటాయింపులు, తీర ప్రాంతంలో సిఆర్‌జెడ్ నిబంధనలకు వ్యతిరేకంగా ఉండ డం కారణంగా అవి అక్రమమైన నిర్ణయాలు. అటు వంటి నిర్ణయాలు తీసుకున్న నేతలమీద, అధికారులమీద, ఆ నిబంధనలకు అనుగుణంగా, సుప్రీమ్ కోర్టు వారు గతంలో ఇచ్చిన తీర్పులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి."**

పడతాయి.

8. సుప్రీమ్ కోర్టు 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు కుంభకోణం కేసులలో ఇచ్చిన తీర్పుల ప్రకారం ప్రభుత్వ భూముల కేటాయింపుల్లో, నేతలు, అధికారులు, మార్కెట్ ధరలకన్నా తక్కువ ధరలకు ఇవ్వడం, వారి పట్ల పక్షపాతం చూపించడం జరిగితే, వారు ఆ విధంగా తీసుకున్న నిర్ణయాలు అవినీతితో కూడిన నిర్ణయాలుగా పరిగణించాలి. అంటే, 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు కుంభకోణం కేసులలో, సుప్రీమ్ కోర్టు ఆదేశించించినట్లు, అటువంటి నిర్ణయాలను తీసుకున్న నేతలమీద, ఆ నిర్ణయాల్లో భాగస్వాములైన అధికారులమీద. అవినీతి నిరోధక చట్టం (1988) క్రింద, మనీ లాండరింగ్ నిరోధక చట్టం (2002) క్రింద ఆ తీర్పులకు అనుగుణంగా దర్యాప్తు చేయవలసిన అవసరం ఉంది

9. ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించవలసిన ప్రభుత్వ భూములను, ప్రభుత్వం ఎటువంటి పరిస్థితిలోను, ప్రైవేట్ సంస్థలకు, కేటాయించకూడదని సుప్రీం కోర్టు 2011 జనవరి 28న ఇచ్చిన తీర్పులో అన్ని రాష్ట్రాలను ఆదేశించడం జరిగింది. అంటే ఇటువంటి నిర్ణయాలు కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు అయింది.

10. పైన సూచించిన కొన్ని భూకేటాయింపులు, తీరప్రాంతంలో సిఆర్‌జెడ్ నిబంధనలకు వ్యతిరేకంగా ఉండడం కారణంగా అవి అక్రమమైన నిర్ణయాలు. అటువంటి నిర్ణయాలు తీసుకున్న నేతలమీద, అధికారులమీద, ఆ నిబంధనలకు అనుగుణంగా, సుప్రీమ్ కోర్టు వారు గతంలో ఇచ్చిన తీర్పులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి.

11. అలాగే నగరాలలో కొండలమీద, జలాశయాలలో ప్రక్కన ప్రభుత్వ భూములను ప్రైవేట్ కంపెనీలకు కట్టడాల కోసం ఇవ్వడం, చట్టపరంగా తయారు చేసిన నగరం మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధం. ఆ కారణంగా కూడా వారిమీద చర్యలు తీసుకోవాలి.

12. గతంలో ప్రభుత్వాలు చవకగా ప్రభుత్వ భూములను ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చినా కంపెనీలు మాత్రం భూములను బ్యాంకులకు మార్కెట్ ధరలకు తాకట్టుపెట్టి,

## ఇతర ప్రైవేట్ కంపెనీలకు ప్రభుత్వాలు ఎంతో ఉదారంగా కేటాయించిన భూముల వివరాలు:

| జీఓ ఎంఎస్ నెం. | తేదీ | లబ్ధిదారు | విస్తీర్ణం | జిల్లా మండలం | ధర (ఎకరం, రూ) |
|---|---|---|---|---|---|
| 58 రెవిన్యూ విభాగం) | 6-2-2023 | అదానీ గ్రీన్ | 406.46 | సత్యసాయి/ తాడిమర్రి | 5 లక్షలు |
| 157రెవిన్యూ విభాగం) | 27-3-2023 | ఇకోరేన్ ఎనర్జీ | 460.68 | వైఎస్ఆర్ కడప /వి మట్టం | 31,000/ ఎకరం (2) |
| 7 (ఐటి విభాగం) | 21-4-2025 | టాటా కన్సెల్టెన్సీ | 21.16 | విశాఖపట్నం/ అర్బన్ (THill NO3) (థిల్ నెం3) | 99పైసలు |
| 21 (ఐటి విభాగం) | 1-7-2025 | కాగ్నిజన్ట్ (విదేశీ) | 22.19 | విశాఖపట్నం/మధురవాడ | 99 / 22.19 ఎకరాలు |
| 15 (ఐటి విభాగం) | 29-5-2025 | సెన్సో రేం ఫోటానిక్స్ | 25 | కర్నూలు / ఓర్వకల్ | భూమివిలువమీద 90% రాయితీ |
| 78 (ఎంఎ అండ్ యుడి) | 9-5-2025 | క్వాంటమ్ వ్యాలీ (ప్రైవేట్ కంపెనీలు) | 50 | అమరావతి/ ఉద్దండరాయపాలెం, లింగాయపాలెం | ఉచితం |
| 137 (పరిశ్రమల విభాగం) | 27-7-2025 | లులు (విదేశీ) | 13.74 | విశాఖపట్నం /ఆర్బన్ / బీచ్ రోడ్ | లీజు/ మార్కెట్ధరలో 10% కన్నా చాలా తక్కువ |
| | | | 4.15 | విజయవాడ/ ఎపిఎస్ ఆర్టిసి భూమి | |

పెద్దఎత్తున రుణాలు తీసుకుని, ఆ నిధులలో కొంత ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించిన సమాచారం ఉంది. అంటే, అటువంటి సందర్భాలలో, నిధులు వారి విదేశీ ఖాతాలకు అక్రమంగా తరలించబడ్డాయా? ఆ విషయంలో, నేతల, మరియు అధికారుల పాత్ర ఉందా? ఆ విషయం మీద దర్యాప్తు అవసరం.

13. పైన సూచించిన చాలా పరిశ్రమల వలన వచ్చే కాలుష్యం కారణంగా ప్రజల ఆరోగ్యం క్షీణిస్తున్నది. నేతలకు, ప్రైవేట్ కంపెనీ యజమానులకు మధ్య ఉన్న సంబంధాల కారణంగా, ఆ యాజమాన్యాలమీద ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, అందరికీ తెలిసిన విషయం. ప్రజలకు ఆవిధంగా జరిగే నష్టానికి, బాధ్యులైన నేతలమీద, అధికారులమీద చర్యలు తీసుకోవాలి కదా?

> **“స్థానికంగా అటువంటి పరిశ్ర మలవలన ప్రజలకు కలిగే ఉద్యోగావకాశాలు తక్కువ. కేవలం, మీనియల్ ఉద్యోగాలు (వాచ్ మెన్ వంటి ఉద్యోగాలు) మాత్రమే స్థానిక ప్రజలకు లభిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములలో సాగుచేసే చిన్నకారు. రైతులు, అటువంటి భూకేటాయింపుల కారణంగా, నిర్వాసితులవుతున్నారు.”**

14. స్థానికంగా అటువంటి పరిశ్రమలవలన ప్రజలకు కలిగే ఉద్యోగావకాశాలు తక్కువ. కేవలం, మీనియల్ ఉద్యోగాలు (వాచ్ మెన్ వంటి ఉద్యోగాలు) మాత్రమే స్థానిక ప్రజలకు లభిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములలో సాగుచేసే చిన్నకారు. రైతులు, అటువంటి భూకేటాయింపుల కారణంగా, నిర్వాసితులవుతున్నారు. అంటే, పైన సూచించిన విధంగా ప్రభుత్వ భూములను, ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వడం వలన, ప్రజలు

**ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలమీద చూపిస్తున్న ఔదార్యాన్ని ప్రభుత్వరంగ సంస్థల పట్ల చూపించకపోవడం ఇంకా ఆశ్చర్యకరమైన విషయం. మచ్చుకు కొన్ని వివరాలు**

| జీఓ ఎంఎస్ నెం. | తేదీ | లబ్ధిదారు | విస్తీర్ణం (ఎకరాలు) | జిల్లా / మండలం | ధర (రూ) |
|---|---|---|---|---|---|
| 78 (ఎంఎ, యుడి విభాగం) | 2025 మే 9 | ఎల్ఐసి | 0.45 | అమరావతి ఉద్దండరాయపాలెం | 400 లక్షలు/ఎకరం |
| 78 (ఎంఎ, యుడి విభాగం) | | కాగ్ | 2.05 | అమరావతి/రాయపూడి | 100 ల/ఎక |
| 78 (ఎంఎ, యుడి విభాగం) | | ఆర్‌బిఐ | 3 | అమరావతి/నేలపాడు | 400 ల/ఎ |
| 78 (ఎంఎ, యుడి విభాగం) | | నాబార్డ్ | 1 | అమరావతి/ ఉద్దండరాయపాలెం | 400 ల/ఎ |
| 78 (ఎంఎ, యుడి విభాగం) | | ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్ఐసి) | 25 | అమరావతి / నెక్కల్లు | 50 ల/ఎ |
| 78 (ఎంఎ, యుడి విభాగం) | | హడ్కో | 8 | అమరావతి ! ఇనుపోలు | 400 ల/ఎ |
| 37 (రెవిన్యూ విభాగం) | 2022 ఫిబ్రవరి1 | ఎపి రాజీవ్ స్వగృహకార్పొరేషన్ ప్రభుత్వ రంగసంస్థ | 57.73 | విశాఖపట్నం/ గ్రామణ (ఎండాడ/గ్రామం) | 21.78 ల/ఎ |
| 611 (రెవిన్యూ విభాగం) | 2022 సెప్టెంబర్14 | ఎపిపిడిసిఎల్ (ఎపి ప్రభుత్వరంగ సంస్థ | 5 | నెల్లూరు/ ముత్తుకూరు | 9 ల/ఎ |
| 630 (రెవిన్యూ విభాగం | 2022సెప్టెంబర్16 | ప్రభుత్వం (గ్రేహౌండ్స్) | 385 | విశాఖపట్నం/ఆనందపురం జగన్నాధపురం/(గ్రామం) | 100 ల/ఎ |
| 165 (రెవిన్యూ విభాగం) | 2023 ఏప్రిల్ 3 | అనురాగ్ ఎన్‌జీఓ మతిస్థిరం లేని పిల్లల సంరక్షణ) | 5 | తిరుపతి ! ఏర్పేడు. | 86.6 ల/ఎ |
| 119 (రెవిన్యూ విభాగం) | 2024 మార్చి 15 | జాతీయ/వ్యవసా మార్కెటింగ్ ఫెడరేషన్ ప్రభుత్వ రంగ సంస్థ | 5.08 | వైఎస్ఆర్ కడప/ మైదుకూరు | 21.08 ల/ఎ |
| 473 (రెవిన్యూ విభాగం) | 2023 అక్టోబర్ 3 | కేంద్రీయ విద్యాలయం కేంద్ర ప్రభుత్వ సంస్థ | 10 | అనకాపల్లి/ అనకాపల్లి | 17.5 ల/ఎ |

> **" పైన సూచించిన భూకేటాయింపులు కొన్ని ఉదాహరణకు మాత్రమే, గత రెండుమూడు దశాబ్దాలుగా, వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను, అధికారంలో ఉన్న రాజకీయనా యకులు యథేచ్ఛగా, ప్రైవేట్ ప్రైవేటు కంపెనీలకు సమర్పించిన విషయం అందరికీ తెలిసిందే. ఆ భూ కేటాయింపుల్లో ఎన్నో నిర్ణయా లను లోతుగా దర్యాప్తు చేస్తే వేలాది కోట్ల కుంభకోణాలు బయటికి వచ్చే అవకాశం ఉంది. "**

ఎన్నోవిధాలుగా నష్టపడు తున్నారు. వారికి వచ్చే ప్రయోజనాలు తక్కువ. లాభాలు గణించేది, ప్రయోజనాలు పొందేది ప్రైవేట్ కంపెనీలు మాత్రమే

పైన సూచించిన భూకేటాయింపులు కొన్ని ఉదాహరణకు మాత్రమే, గత రెండుమూడు దశాబ్దాలుగా, వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను, అధికారంలో ఉన్న రాజకీయనా యకులు యథేచ్ఛగా, ప్రైవేట్ ప్రైవేటు కంపెనీలకు సమర్పించిన విషయం అందరికీ తెలిసిందే. ఆ భూ కేటాయింపుల్లో ఎన్నో నిర్ణయాలను లోతుగా దర్యాప్తు చేస్తే వేలాది కోట్ల కుంభకోణాలు బయటికి వచ్చే అవకాశం ఉంది.

అలాగే, ప్రభుత్వ భూములను, కంపెనీలు తాకట్టు పెట్టి, బ్యాంకులనుంచి ఎటువంటి రుణాలు పొందారు? ఆనిధులను ఏ విధంగా ఉపయోగించారు అనే వివరాలను ఆర్‌బిఐ దర్యాప్తు చేయాలి.

రాష్ట్రప్రభుత్వ అధికారులకు కూడా పైన సూచించిన ప్రశ్నలకు జవ్వాబు ఇవ్వవలసిన బాధ్యత ఉంది. రాజకీయ నేతలు అటువంటి చట్టవిరుద్ధమైన నిర్ణయాలు తీసుకుంటే వారికి తగిన సలహాలు ఇచ్చే బాధ్యత అధికారులకు ఉంది. ఆ విధంగా సరిఅయిన సలహాలను ఇవ్వకపోతే, వారిమీద కూడా చర్యలు తీసుకోవడం అవసరం.

### లులు కంపెనీకి విలువైన భూములు దారాదత్తం

రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం బీచ్ రోడ్‌లో, హార్బర్ పార్క్ దగ్గరలో 13.74 ఎకరాల భూమిని అక్రమంగా లులు అనే విదేశీ సంస్థకు కేటాయించింది.

లులు కంపెనీ పట్ల, రాష్ట్ర నేతలకు, అధికారులకు ఉన్న ఆప్యాయత, వ్యామోహం, రోజురోజుకూ పెరుగుతున్నదనే విషయానికి నిదర్శన గత జులై 27న రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ జారీ చేసిన జిఓ ఎంఎస్ నెం 137. ఆ జీఓ ద్వారా ప్రభుత్వం, విశాఖ బీచ్ రోడ్డులో 13.74 ఎకరాలే కాకుండా, విజయవాడ నగరం నడిబొడ్డున, ప్రభుత్వ సంస్థ అయిన ఎపిఎస్ ఆర్టీసీ వారి అతి విలువైన 4.15 ఎకరాల భూమినికూడా లులు కంపెనీకి ధారాదత్తం చేసింది.

లులు కంపెనీకి, అంత విలువైన ప్రజల భూమిని ధారాదత్తం చేయడం, క్రింద సూచించిన విధంగా, చట్టవిరుద్ధం, ప్రభుత్వంలో అవినీతికి నిదర్శనం.

1. స్థానిక సంస్థల అధినంలో ప్రజల ప్రయోజనాలకు ఉద్దేశించబడిన ప్రభుత్వ భూములను ప్రైవేటు కంపెనీలకు ఇవ్వకూడదని సుప్రీం కోర్టు 2011 జనవరి 28న జరపాల్ సింగ్ – పంజాబ్ ప్రభుత్వం మధ్య నడిచిన కేసు సందర్భంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించడం జరిగింది. అంటే పైన ప్రస్తావించిన విశాఖ, విజయవాడ భూములను లులు కంపెనీకి బదలాయించడం, కోర్టు ఆదేశాలను ధిక్కరించినట్లు అయింది.

2. విశాఖలో లులు కి కేటాయించిన భూమి సిఆర్‌జెడ్ పరిధిలో ఉంది. అటువంటి ప్రదేశం లో కట్టడాలు, బోర్ బావులు నిషేధించబడ్డాయి. బీచ్ రోడ్డులో లులు ఎటువంటి కట్టడాలు చేపట్టినా, బోర్ బావులను ఉపయోగించినా సిఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించడం అవుతుంది. ఆంధ్ర ప్రదేశ్ హై కోర్టు WP No. 169/ 2012 లో 8-10-2012న ఇచ్చిన ఆదేశాల్లో సిఆర్‌జెడ్ పరిధిలో బోర్ బావులను ఉపయోగించడం సిఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించడం అవుతుందని, ప్రభుత్వ సంస్థలను హెచ్చరించింది.

3. 2012 లో, రాష్ట్రప్రభుత్వం రెవిన్యూ విభాగం జిఓఎంఎస్ నెం. 57114-9-2012. ద్వారా జారీ చేసిన భూకేటాయింపు విధానం ప్రకారం. ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు యథేచ్ఛగా బదలాయించకూడదని, ఒక వేళ, ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయిస్తే, ఆ సంస్థ వద్దనుంచి ప్రభుత్వం భూమి మార్కెట్ ధర మీద కనీసం 10% రెంట్ విధించాలని ఆదేశించింది. విశాఖ, విజయవాడ భూములు, ప్రజల భూములు. ప్రజా ప్రయోజనాల కోసమే ఉపయోగించాలి. ఎట్టిపరిస్థితలోనూ, ప్రైవేట్ కంపెనీలకు బదలాయించకూడదు. విజయవాడలో ఆర్‌టిసి భూములను లులుకి ఇవ్వడం ప్రజా విశ్వాసానికి వ్యతిరేకం. ఆర్‌టిసి మీద, రోజూ వేలాదిమంది సామాన్య ప్రజలు ఆధార పడతారు. ఆర్‌టిసి కార్యక్రమాలు ఏటా పెరుగడం దృష్టిలో పెట్టుకుని, ఆ సంస్థ భూములను ఆర్‌టిసి కోసమే పరిరక్షించ వలసిన బాధ్యత, ప్రభుత్వానికి ఉంది. లులు సంస్థ నిర్మించే మాల్ వంటి నిర్మాణాలు ధనికులకే గాని సామాన్య ప్రజానీకానికి ఉపయోగపడవు. పైగా విశాఖ, విజయవాడలో ప్రభుత్వం లులుకి ఇవ్వతలచిన భూములు వందలాది కోట్ల రూపాయల విలువ ఉన్న భూములు. అంటే అటువంటి భూములకు లులు కంపెనీ, సంవత్సరానికి 30-40 కోట్లరూపాయలకుపైగా రెంట్ ప్రభుత్వానికి జమచేసినా సరిపోదు.

4. విశాఖ, విజయవాడ భూములను, ప్రభుత్వం లులుకి ఇతర రాయితీలతో, అతితక్కువ రెంటుకు లీజ్ మీద ఇస్తే, సుప్రీమ్ కోర్టు 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు కుంభకోణం కేసులలో ఇచ్చిన తీర్పుల ప్రకారం, అటువంటి నిర్ణయం అవినీతితో కూడిన నిర్ణయంగా పరిగణించాలి. అంటే, 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు కుంభకోణం కేసులలో సుప్రీమ్ కోర్టు ఆదేశించించినట్లు అటువంటి నిర్ణయాలను తీసుకున్న నేతలమీద, ఆ నిర్ణయాల్లో భాగస్వాములైన అధికారులమీద అవినీతి నిరోధక చట్టం 1988 క్రింద, ఆతీర్పులకు అనుగుణంగా, దర్యాప్తు చేయవలసిన అవసరం ఉంది

5. లులు కంపెనీ విదేశీ సంస్థ. విశాఖ తీరప్రాంతంలో దేశభద్రతకు సంబంధించిన కార్యక్రామాలు నిరంతరం జరుగుతాయి. అటువంటి నేపథ్యంలో, ఒక విదేశీ కంపెనీకి ఆప్రాంతంలో అటువంటి భూమిని కేటాయించడం సబబుగా లేదు. అటువంటి భూమి కేటాయింపు, దేశభద్రతకు వ్యతేరేకంగా కనిపిస్తున్నది.

6. ఇటువంటి నిర్ణయాలను ప్రభుత్వం ఏకపాక్షికంగా తీసుకోవడం ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకం. ఐదేళ్లకోమాటు ఎన్నికలలో రాజకీయపార్టీలు గెలిచినా, ప్రజలకు చెందిన భూముల విషయంలో ప్రభుత్వం కేవలం ప్రజల తరపున ట్రస్టీగా మాత్రమే వ్యవహరించాలిగానీ, జమిందారీ వ్యవస్థలోలాగ, ప్రజలభూములను యథేచ్ఛగా, కావాల్సిన ప్రైవేట్ కంపెనీలకు తక్కువధరకు ఇవ్వడం, ప్రజల నమ్మకాన్ని కించ పరచడమవుతుందని ప్రభుత్వం గుర్తించాలి. ఇటువంటి అక్రమమైన, చట్టవిరుద్ధమైన భూమి కేటాయింపు విషయంలో కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ దర్యాప్తు చేయడం అవసరం. అటువంటి దర్యాప్తు జరిగితే, నిజానిజాలు బయట పడతాయి.

**పవర్ ప్రాజెక్టు పేరుతో భూముల పందేరం**

గతంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ జిఓ ఎంఎస్ నెం 466 (తేదీ 22.5.2010) ద్వారా ప్రస్తుతం పార్వతీపురం జిల్లా కొమరాడ మండలంలోని కొమరాడ, పెదకర్జాల, రేగులపాడు, శివరాంపురం, కొటిపాం గ్రామాల్లో, 640.75 ఎకరాల భూమిని (అందులో 273.46 ఎకరాల ప్రభుత్వ భూమి, 249. 26 ఎకరాల డీ పట్టా భూములు, 79 ఎకరాల జలవనరులు), పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆల్ఫా ఇన్ఫ్రా ప్రాప్ అనే కంపెనీకి కేటాయించింది.

ఆ గ్రామాలలో, పెదకర్జాల, రేగులపాడు గ్రామాలు షెడ్యూల్డ్ గ్రామాలు. కంపెనీకి బదలాయించిన కొటిపాం. పెదకర్జాల, రేగులపాడు గ్రామాల్లో, ట్రైబల్ సబ్ ప్లాన్ కింద, 686 లక్షల రూపాయల ఖర్చుతో రాష్ట్ర జలవనరుల శాఖ చేపట్టిన "వనకబాడి" సాగునీటి ప్రాజెక్టు భూములు ఉన్నాయి. ఒక విధంగా చూస్తే, అటువంటి భూములను, ప్రైవేట్ కంపెనీకి ఇవ్వడం గిరిజనులకు అన్యాయం చేయడం అవుతుంది. ప్రభుత్వం కంపెనీకి బదలాయించిన భూములే కాకుండా, ఆల్ఫా ఇన్ఫ్రా ప్రాప్ కంపెనీ అదనంగా, కొమరాడ, పెదకర్జాల, రేగులపాడు, శివరాంపురం, కొటిపాం, చిన కర్జాల గ్రామాల్లో, ఇంకొక 465.31 ఎకరాల భూమిని ప్రభుత్వం అనుమతి లేకుండా కొన్నది. అందులో కొంత వరకు డీ పట్టా భూములు ఉన్నాయని తెలుస్తోంది. ఎపి అసైన్డ్ లాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్ఫర్స్) చట్టం 1977 క్రింద, అటువంటి భూములను, ప్రైవేట్ కంపెనీ కొనడం నిషేధించబడింది. అదేకాకుండా, కంపెనీ కొన్న భూములు వ్యవసాయ భూములు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాల కోసం ఉపయోగించడం Ap Agricultural Land (Conversion Non Agricultural Purposes) Act, 2006 క్రింద నిషేధించబడింది. అందుకు కావాల్సిన అనుమతులను, కంపెనీ ఈరోజు వరకు తీసుకోలేదని తెలుస్తున్నది.

> **❝ కంపెనీకి కేటాయించిన భూములూ, కంపెనీ అక్రమంగా కొన్న భూములూ కొన్ని షెడ్యూల్డ్ గ్రామాల్లో ఉండటం వల్ల,** AP Scheduled Area Land Transfer Regulations 1 of **59 క్రింద, ఆ భూములను ప్రైవేట్ కంపెనీకి బదలాయించడం కానీ, కంపెనీ కొనడం గానీ నిషేధించబడిం ది. అదే విషయాన్ని సుప్రీమ్ కోర్టు సమత కేసులో, 1997 జూలై 11 న ధ్రువపరిచింది. షెడ్యూల్డ్ ప్రాంతంలో, అటువంటి ప్రాజెక్టు నిర్మించడం, పీసా చట్టం క్రింద కూడా నిషేధించబడింది. ❞**

కంపెనీకి కేటాయించిన భూములూ, కంపెనీ అక్రమంగా కొన్న భూములూ కొన్ని షెడ్యూల్డ్ గ్రామాల్లో ఉండటం వల్ల, AP Scheduled Area Land Transfer Regulations 1 of 59 క్రింద, ఆ భూములను ప్రైవేట్ కంపెనీకి బదలాయించడం కానీ, కంపెనీ కొనడం గానీ నిషేధించబడింది. అదే విషయాన్ని సుప్రీమ్ కోర్టు సమత కేసులో, 1997 జూలై 11 న ధ్రువపరిచింది. షెడ్యూల్డ్ ప్రాంతంలో, అటువంటి ప్రాజెక్టు నిర్మించడం, పీసా చట్టం క్రింద కూడా నిషేధించబడింది.

ఆల్ఫా ఇన్ఫ్రా ప్రాప్ వారి పవర్ ప్రాజెక్టు కోసం, కంపెనీ, పర్యావరణ పరిరక్షణ చట్టం క్రింద అనుమతి తీసుకునే ప్రక్రియలో లోపాలు ఉండటం వల్ల జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ వారు 2013లో అప్పీల్ నెం 9/2011లో పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇచ్చిన అనుమతిని సస్పెండ్ చేయడం జరిగింది. ఈరోజు వరకు, ప్రాజెక్టుకు అటువంటి అనుమతి లభించలేదు.

గత పదిహేను ఏళ్ల తరబడి ప్రభుత్వం కేటాయించిన 640.75 ఎకరాల భూమి, కంపెనీ చట్టవిరుద్ధంగా కొన్న 485.31 ఎకరాల భూమి, అంటే మొత్తం 1126.06 ఎకరాల భూమి ప్రభుత్వం పట్టించుకోనందువల్ల నిరుపయోగకరంగా కంపెనీ స్వాధీనంలో పడి ఉంది. ఆ భూములలో, షెడ్యూల్డ్ గ్రామాల భూములు ఉండడం, అందులో ట్రైబల్ సబ్ ప్లాన్ క్రింద 686 లక్షల రూపాయల ఖర్చుతో కూడిన, గిరిజనుల కోసం కట్టబడిన వనకబాడి సాగునీటి ప్రాజెక్టు భూములు ఉండడం, కార్పొరేట్ సంస్థల వ్యామోహానికి గురి అయి, ఆదివాసీ ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి నిదర్శనం.

ఆల్ఫా ఇన్ఫ్రా ప్రాప్ ప్రాజెక్టు, వనకబాడి ప్రాజెక్టు, ఇతర జలవనరులకు కలిగించే నష్టమే కాకుండా, ఆ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం దగ్గరలో జంఝావతి/ నాగావళి నదుల నుంచి, 1.5 టిఎంసి కి పైగా నీటిని కేటాయించడం వల్ల, క్రింద ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలకు, గ్రామాల్లో నగరాల్లో తాగునీటి సౌకర్యాలకు నష్టం కలుగుతుంది. ఆ కారణంగా, అటువంటి నీటి కేటాయింపు, ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకమని కూడా ప్రభుత్వం గుర్తించాలి.

అన్ని విధాలుగా చట్టవిరుద్ధమైన ప్రాజెక్ట్ ముసుగులో, ఆల్ఫా ఇన్ఫ్రా ప్రాప్ కంపెనీ స్వాధీనంలో 1126.06 ఎకరాల ప్రజల భూమి ఏళ్ల తరబడి కొనసాగడం సబబు కాదు. ఆ భూములను తక్షణం ప్రభుత్వం కంపెనీ వద్ద నుంచి వెనక్కి తీసుకుని పైన సూచించిన చట్టాలకు అనుగుణంగా, గిరిజనులకు, భూమి లేని ఇతర వెనుకబడిన కుటుంబాలకు బదలాయిస్తే వారు ఆ భూములు సాగు చేసి, ఉపాధి పొందుతారు. కంపెనీ ఆధీనంలో అటువంటి విలువైన భూమి చట్టవిరుద్ధంగా కొనసాగడం దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వం కంపెనీ మీద చర్యలు తీసుకోవడమే కాకుండా, కంపెనీ మీద కఠినమైన జరిమానా వేయాలి.

❊

# భారత దేశ అభివృద్ధిపై ప్రచారము, వాస్తవాలు

*(9వ పేజీ తరువాయి)*

చెందవచ్చు. ప్రపంచ వాణిజ్యానికి, నిబంధనలకు హాని కలిగిస్తున్నప్పటికీ, ట్రంప్ విధించిన సుంకాలను గురించి పొగడవచ్చు. పెట్టుబడిదారులు భారతదేశ గొప్పతనాన్ని గురించి పొగుడుతున్నప్పటికీ, దేశ శక్తి సామర్థ్యాలను గురించి భిన్నమైన రీతిలో వ్యవహరిస్తున్నారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న, పరిష్కారం కాని సమస్యలు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయి. ట్రంప్ చర్యలతో ప్రపంచ వాణిజ్యంలో వస్తున్న మార్పులు భారతదేశంపై తీవ్ర ప్రభావం కలిగిస్తాయి.

ఉపనిషత్‌లలోని ఒక కథలో "లేవండి, చైతన్యవంతులు కండి, లక్ష్యం చేరేవరకు విశ్రమించవద్దు" అన్న మాటలను స్వామి వివేకానంద తరచుగా ఉదహరించేవాడు. ఈ మాటలను పరిగణనలోకి తీసుకుంటే దేశ విధాన నిర్ణేతలతో పాటు మీడియా కూడా సక్రమంగా పని చేస్తుంది. భారతదేశం సూపర్ పవర్‌గా అవతరిస్తున్నదని ప్రచారం చేయటం తప్పుదారి పట్టిస్తుంది. ఆర్థికవ్యవస్థ తీవ్రమైన చిక్కులలో ఉన్నదని వాస్తవ సమాచారం వెల్లడిస్తున్నది. పెట్టుబడిదారులు వస్తారనో, విధానపరంగా మాసికలు వేయటం ద్వారా అనుకున్నది సాధిస్తామనో కాక, మౌలిక విధానాలకు కట్టుబడి ఉండటానికి తిరస్కరిస్తున్న భారతదేశం గుణపాఠం నేర్చుకోవాలి. దీర్ఘకాలం నుండి వ్యవస్థాగతంగా కొనసాగుతున్న లోపాలు-మానవ పెట్టుబడులు బలహీనంగా ఉండటం, ఉద్యోగాల కల్పన అత్యంత తక్కువగా ఉండటం-సమ్మిళిత, స్థిరమైన అభి వృద్ధి సాధించకుండా భారతదేశాన్ని నిరోధిస్తున్నాయి.

నిజమైన అభివృద్ధిని సాధించాలంటే సార్వత్రికంగా నాణ్యమైన విద్యను అందించటానికి, మహిళా శ్రామికులకు సాధికారతను కల్పించటానికి, మార్కెట్‌లో సక్రమంగా పోటీ పడటానికి కార్మికులకు, పెట్టుబడిదారులకు అవకాశం కల్పించాలి. దీర్ఘకాలం నుండి పట్టి పీడిస్తున్న దేశ సమస్యలను అర్థం చేసుకొని, వాటిని పరిష్కారం చేయటానికి విధాన నిర్ణేతలు పూనుకోనంత వరకు జ్ఞానులు, ఉత్తమ గ్రంథాలు అందించిన విజ్ఞానం వృథా అవుతుంది. మనం పైపై మాటలు చెబుతున్నంత కాలం పెట్టుబడిదారులు ఇతర ఆర్థికవ్యవస్థలలో అవకాశాలను వెదుక్కొంటూ ఉంటారు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**


**చదవండి! చదివించండి!!**

# Marxist

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక త్రైమాస ఆంగ్ల పత్రిక

సంచిక 61, 1-2, జనవరి-జూన్ 2025

**ఎం.ఎ. బేబీ**

రాజకీయ తీర్మానం : బిజెపి-ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా బహుముఖ పోరాటానికి పిలుపు

**ప్రకాశ్ కరత్**

రాజకీయ సమీక్షా నివేదిక: పార్టీ స్వతంత్ర బలం పెంపుపై కేంద్రీకరణ

**బి.వి. రాఘవులు**

సిపిఐ(ఎం) 24వ మహాసభలు: పార్టీ నిర్మాణ పునరుత్తేజానికై పిలుపు

**సుదీప్ దత్తా**

ముట్టడిలో నయా-ఉదారవాద భారత దేశం

**పత్రం**

ప్రసంగం: కామ్రేడ్ తో లామ్, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి

వెల: ఒక ప్రతి రూ. 50

ప్రతులకొరకు

*Order copies from:*

**The Manager,**

The Manager, Marxist, A. K. Gopalan Bhawan
27-29 Bhai Vir Singh Marg, New Delhi 110001
Phone: (91-11) 23348725; Email: pdpbln@gmail.com
Marxist is also available online at: https://cpim.org/the-marxist


# కొనసాగుతున్న బుల్డోజర్ రాజ్

*(18వ పేజీ తరువాయి)*

ద్వేషంపై ఆధారపడి ఉంది. కానీ వ్యక్తిగత హక్కుల రక్షణ మీద మాత్రం ఆధారపడలేదు,'అని ఆయన వ్యాఖ్యానించారు. 'ఈ సందర్భంలో ఇస్లామోఫోబియా ప్రజలకు ఒక మత్తు పదార్థంలా మారిపోయింది. కొన్ని వర్గాలపై జరిగే అన్యాయాలను చూస్తూ ఊరకుండటం, అంగీకరించడమే కాదు. వారిపై అటువంటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసే స్థాయికి ఇది చేరింది. 'అని అర్జున్ అన్నారు.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ పదేపదే "హిందువులు విడిపోతే... నశించిపోతారు' అన్న నినాదాన్ని వినియోగించారు. 2024 ఎన్నికల తరువాత తమ ఓటుబ్యాంకును అలాగే ఉంచుకునేందుకు ఈ నినాదాన్ని ఆయన వాడారు. భారత వైవిధ్యం ఒక మతంలోని ద్వంద్వత్వానికి మాత్రమే కుదించబడుతోందని జుబేరి గమనించారు. హిందువులందరు ఒకటై తమకు అధికారాన్ని పదేపదే కట్టబెట్టేందుకు బిజెపి బూచిగా చూపుతున్న ఆ 'ఇతరులు' ఎవ్వరు? అని ఆయన ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే , ముస్లింలను ఒక శాశ్వత ప్రమాదంగా చిత్రిస్తున్నారు. ముస్లింను నియంత్రించాలి. క్రమబద్ధం చేయాలి. చివరికి పూర్తిగా కనుమరుగు చేయాలి. అన్నదే ఆ భావన! దీని కోసమే బుల్డోజర్ అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధంగా మారింది.

**(అనువాదం :పొగడదొరువు)**

**రాజకీయ పరిణామాలు**

# సమాఖ్య విధానానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వ వాదనలు

**ఎ.కోటిరెడ్డి**



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

గవర్నర్ల పాత్ర గురించి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎదుట కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వాదనలు సమాఖ్య విధానానికి సమాధి కట్టేలా ఉన్నాయి. ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలకు దమ్మిడి విలువ లేకుండా చేసి, తాము నామినేట్ చేసిన గవర్నర్లు సర్వాధికారులుగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందుకు అనుగుణంగానే సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం, ఆ రాష్ట్ర గవర్నర్ మధ్య వచ్చిన వివాదంలో సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై రాష్ట్రపతి ద్వారా ప్రశ్నలను సంధించి, సుప్రీంకోర్టు నుండి తమకు అనుకూలమైన తీర్పును రప్పించుకోవటం కోసం మోడి ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతున్నది.

రాష్ట్ర శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలుపకుండా, వాటికి ఎటువంటి అభ్యంతరాలను తెలియజేయకుండా, లేదా రాష్ట్రపతికి పంపకుండా తొక్కిపట్టి, రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్ తీరుపై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ గవర్నర్ తీరును ఆక్షేపించింది. బిల్లులకు ఆమోదం తెలుపకపోవటం చట్టానికి, రాజ్యాంగానికి వ్యతిరేకమని న్యాయమూర్తులు జస్టిస్ జె బి పార్దివాలా, ఆర్ మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది.

2020, నవంబరు, 2023, ఏప్రిల్ మధ్య తమిళనాడు శాసనసభ 13 బిల్లులను ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపింది. వాటిలో 10 బిల్లులకు ఆమోదం తెలుపకుండా గవర్నర్ తొక్కిపెట్టారు. శాసనసభ ఎటువంటి మార్పులు లేకుండా ఆ బిల్లులను తిరిగి ఆమోదించి పంపిన తర్వాత, గవర్నర్ వాటిని ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపారు. రెండవసారి సభ ఆమోదించి పంపిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలుపకుండా రాష్ట్రపతికి పంపటం రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు బెంచ్ చెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం శాసనసభ ఒక బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపిన తర్వాత గవర్నర్‌కు నాలుగు మార్గాలు ఉన్నాయి. ఒకటి బిల్లుకు ఆమోదం తెలుపటం, రెండు, బిల్లును నిలిపివుంచటం, మూడు, బిల్లుపై తిరిగి పునరాలోచన చేయాలని కోరుతూ శాసనసభకు తిప్పి పంపటం, నాలుగు, బిల్లును రాష్ట్రపతికి పంపటం చేయాలి. శాసనసభ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఎంతకాలం తన వద్ద ఉంచు కోవచ్చున్న అంశంపై ఆర్టికల్ 200లో నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదు. ఈ అంశాన్ని విశదీకరిస్తూ బిల్లులను నిరవధికంగా నిలిపి ఉంచటానికి, విచక్షణాధికారాలను దుర్వినియోగం చేయటానికి ఈ అస్పష్టతను వినియోగించుకోరాదని సుప్రీం బెంచ్ పేర్కొంది.

ఎటువంటి మార్పులు లేకుండా శాసనసభ రెండవ సారి ఆమోదించి, పంపిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపరాదని, వాటికి తప్పనిసరిగా ఆమోదం తెలపాలని, గవర్నర్ రవి వ్యవహరించిన తీరు పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా ఉన్నదని కోర్టు పేర్కొంది. ఈ అంశంపై కోర్టు ఇచ్చిన నిర్దేశాలు తన పరిధిని అతిక్రమించటం కాదని, ఆ ఆర్టికల్‌కు అవసరమైన వివరణ ఇవ్వటమేనని కూడా బెంచ్ చెప్పింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రాతిపదికగా శాసనసభ ఆమోదించిన తర్వాత గవర్నర్ల అనుమతి కోసం వచ్చిన బిల్లుల ఆమోదానికి సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ నిర్దిష్టమైన కాలపరిమితిని నిర్దేశించింది. శాసనసభ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలుపటం లేదా రాష్ట్రపతి ఆమోదం కోసం పంపటం నెల రోజులలోపు జరగాలి. బిల్లుపై గవర్నర్లకు అభ్యంతరం ఉంటే తన అసమ్మతిని తెలియజేస్తూ, మూడు మాసాలలోగా బిల్లును ప్రభుత్వానికి తిప్పి పంపాలి. ఒకవేళ రాష్ట్రపతికి నివేదించాలనుకుంటే అది కూడా మూడు నెలలలోపు జరగాలి. గవర్నర్ తిప్పి పంపిన బిల్లును శాసనసభ తిరిగి ఆమోదించి, రెండవసారి గవర్నర్ ఆమోదం కోసం పంపితే గవర్నర్ నెల రోజుల లోపల ఆ బిల్లును తప్పనిసరిగా ఆమోదించాలి.

సుప్రీంకోర్టు బెంచ్ ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి వ్యవహరించాల్సిన తీరును గురించి కూడా వ్యాఖ్యలు చేసింది. గవర్నర్లు రాష్ట్రపతికి నివేదించిన బిల్లులకు ఆమోదాన్ని రాష్ట్రపతి నిరవధికంగా వాయిదా వేయరాదని, ఆ విధంగా ఆలస్యం చేస్తే, అందుకు దారితీసిన పరిస్థితులను న్యాయవ్యవస్థ పరిశీలించవచ్చునని పేర్కొంది. ఆర్టికల్ 143 ప్రకారం ఒక బిల్లు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నదని రాష్ట్రపతి ఆమోదాన్ని నిలిపివేస్తే, దానిపై రాష్ట్రపతి సుప్రీంకోర్టు అభిప్రాయం తీసుకోవచ్చునని-అభిప్రాయం తీసుకోంటం తప్పనిసరి కాదు-చెప్పింది.

శాసనసభ ఆమోదించి, గవర్నర్ ఆమోదం కోసం పంపిన బిల్లులను ఆమోదించటానికి గవర్నర్లకు సుప్రీంకోర్టు బెంచ్ నిర్దేశించిన కాల పరిమితి పట్ల దేశంలోని అభ్యుదయవాదులు, మేధావులు హర్షం వ్యక్తం చేశారు. సమాఖ్య వ్యవస్థ బలపడటానికి, కేంద్ర ప్రభుత్వానికి, పాలకపార్టీకి ఏజంట్లుగా వ్యవహరిస్తూ, ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా పని చేయకుండా నిరోధిస్తున్న గవర్నర్లను అదుపులో పెట్టటానికి ఈ తీర్పు దోహదం చేస్తుందని భావించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న రాజ్యాం

> **“ రాజ్యాంగం నిర్దేశించిన విధంగా పని చేయకపోతే ఆ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన వారికి, నియమించబడిన వారికి ఆ పదవిలో కొనసాగే నైతిక హక్కు ఉండదు. తమ బాధ్యతలను సక్రమంగా ఎందుకు నిర్వర్తించటంలేదో వారు ప్రజలకు సంజాయిషీ చెప్పాలి. రాజ్యాంగాన్ని వ్యతిరేకించేవారు, రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలను అమలు జరపనివారు దేశ వ్యతిరేకులని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ”**

గపరమైన హక్కులను కాలరాస్తూ, అధికారం మొత్తాన్ని తన చేతిలో కేంద్రీకరించుకోవటానికి ప్రయత్నం చేస్తున్న మోడి ప్రభుత్వం మాత్రం ఈ తీర్పును అంగీకరించలేదు. రాజ్యాంగరీత్యా గవర్నర్ల పనిని చక్కదిద్దటం కోసం ఇచ్చిన ఈ తీర్పును వమ్ము చేయటం కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టుకు కొన్ని ప్రశ్నలు పంపింది.

ఈ అంశంపై ఆగస్టు 18వ తేదీన వాద, ప్రతివాదనలు వినటం ప్రారంభిస్తామని, 18, 19 తేదీలలో కేంద్ర ప్రభుత్వ వాదనలు, 20, 21, 26 తేదీలలో కేంద్ర ప్రభుత్వాన్ని బలపరిచే రాష్ట్రాల వాదనలు, ఆగస్టు 28, సెప్టెంబరు 2,3,9 తేదీలలో కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించే రాష్ట్రాల వాదనలు వింటామని సుప్రీంకోర్టు ప్రకటించింది.

రాష్ట్రపతి లేవనెత్తిన అంశాలపై ఆగస్టు 18వ తేదీ నుండి సుప్రీంకోర్టులో వాద, ప్రతివాదనలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపిస్తూ గవర్నర్లు, రాష్ట్రపతికి కాల పరిమితి విధించటాన్ని వ్యతిరేకించింది. బిల్లుల ఆమోదానికి గవర్నర్లు, రాష్ట్రపతికి కాల పరిమితి విధించటం రాజ్యాంగపరమైన సమతూకాన్ని వమ్ము చేస్తుందని, న్యాయవ్యవస్థ తనకు లేని అధికారాలను అమలు చేయటానికి దారితీస్తుందని వాదించింది. ఆర్టికల్ 200, 201 బిల్లుల ఆమోదానికి ఎటువంటి కాల పరిమితిని నిర్దేశించలేదని, ఇపుడు కాల పరిమితిని నిర్దేశించటం అంటే కేవలం వివరణల ద్వారా రాజ్యాంగానికి సవరణలు చేయటానికి దారి తీస్తుందని కూడా పేర్కొంది. గవర్నర్లు, రాష్ట్రపతి బిల్లులకు ఆమోదం తెలుపటం న్యాయవ్యవస్థ పరిధికి వెలుపలి అంశం అని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది.

ఆగస్టు 28 తేదీన తన వాదనలు వినిపించటం ప్రారంభించిన తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్లు సూపర్ ముఖ్యమంత్రులుగా వ్యవహరించరాదని, రెండు కత్తులు ఒకే ఒరలో ఇమడవని, సమస్యను సానుకూలంగా పరిష్కరించేలా గవర్నర్ పాత్ర ఉండాలని చెప్పింది. ప్రజాస్వామ్యాన్ని అమలు చేయటం, పార్లమెంటరీ పద్ధతులలో పరిపాలన సాగించటం ఎన్నికైన ముఖ్యమంత్రి, రాష్ట్ర కేబినెట్ బాధ్యత అని పేర్కొంది. చట్టాలను రూపొందించే క్రమంలో గవర్నర్‌కు కూడా భాగం ఉంటుందని, కాని ఆయన ఎన్నికైన సభ్యుడు కాదని, మంత్రివర్గ సలహాలకు అనుగుణంగా ఆయన వ్యవహరించాలని పేర్కొంది. రాజ్యాంగ ధర్మాసనం ఎదుట తమిళనాడు ప్రభుత్వ వాదనలు ముగిసినప్పటికీ మిగతా ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాదనలు వినిపించాల్సి ఉంది.

ఇప్పటికి కేంద్ర ప్రభుత్వం, దానిని బలపరిచే రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన వాదనలు స్వాతంత్ర్యానంతరం దేశంలో అమలు జరుగుతున్న సమాఖ్య విధానాన్ని విచ్ఛిన్నం చేయటానికి, ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలను నామమాత్రంగా దిగజార్చేలా ఉన్నాయి. రాజ్యాంగంలో కేంద్రం బాధ్యతలు, కేంద్రం-రాష్ట్రాలు ఉమ్మడిగా పని చేయాల్సిన రంగాలు, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న హక్కులను పొందుపరిచారు. రాజ్యాంగం ప్రకారం తన పరిధిలో ఉన్న అంశాలపై ప్రజల చేత ఎన్నికైన శాసనసభలు ప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి అవసరమని తాము భావించిన అంశాలపై బిల్లులను ఆమోదించి, గవర్నర్ ఆమోదంతో వాటిని చట్టాలుగా మార్చి, అమలు చేయవచ్చు. ఆ విధంగా తమ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలన కొనసాగించాలి. ఇది రాజ్యాంగం రాష్ట్రాలకు నిర్దేశించిన విధి.

మరోవైపున గవర్నర్ రాజ్యాంగ రీత్యా రాష్ట్ర ప్రభుత్వ అధినేతగా ఉన్నారు. రాష్ట్రపతి కూడా రాజ్యాంగ నిర్దేశం ప్రకారమే ఆ పదవిలో ఉన్నారు. రాజ్యాంగానికి అతీతంగా కాక, రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేసిన పదవులు కాబట్టే గవర్నర్లు, రాష్ట్రపతి రాజ్యాంగం నిర్దేశించిన విధంగా ఎన్నికై, ఆ పదవులలో ఉన్నారు. రాజ్యాంగబద్ధంగా తాము ఉన్న పదవులకు ఎన్నికై, తాము ఆ పదవులలో కూర్చున్న తర్వాత రాజ్యాంగం తమకు నిర్దేశించిన చెప్పిన అంశాలను అమలు చేయబోమని, తాము రాజ్యాంగానికి అతీతులమని భావిస్తున్నారు. అంటే “ఓడ ఎక్కిందాక ఓడ మల్లయ్య” లాగా, రాష్ట్రపతిగా ఎన్నికవటానికి, గవర్నర్లుగా నియమించబడటానికి రాజ్యాంగం కావలసి వచ్చింది. ఆ బాధ్యతలలోకి వచ్చిన తర్వాత “ఓడ దిగింతర్వాత బోడి మల్లయ్య” చందంగా ఆ పదవిలో ఉన్నవారు వ్యవహరిస్తున్నారు. ఎన్నికైన తర్వాత రాష్ట్రపతి రాజ్యాంగపరంగా నిర్వర్తించాల్సిన బాధ్యతలను అమలు చేయకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తారా? రాజ్యాంగాధినేతగా ఉన్న రాష్ట్రపతి చేత సుప్రీంకోర్టులో రాజ్యాంగ వ్యతిరేక వాదనలు చేయిస్తారా? ఇది రాష్ట్రపతి పదవికి ఉన్న ప్రతిష్ఠను దిగజార్చటం కాదా?

రాజ్యాంగం నిర్దేశించిన విధంగా పని చేయకపోతే ఆ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన వారికి, నియమించబడిన వారికి ఆ పదవిలో కొనసాగే నైతిక హక్కు ఉండదు. తమ బాధ్యతలను సక్రమంగా ఎందుకు నిర్వర్తించటం లేదో వారు ప్రజలకు సంజాయిషీ చెప్పాలి. రాజ్యాంగాన్ని దిగజార్చేవారు అధికారంలో ఉండటం, రాజకీయ విలువలను పాటించక పోవటం వలన వారు ఆ పదవులలో కొనసాగుతున్నారు. కాని రాజ్యాంగాన్ని వ్యతిరేకించేవారు, రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలను అమలు జరపనివారు దేశ వ్యతిరేకులని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.

రాజ్యాంగం నిర్దేశించిన విధంగా ఎన్నికైన ప్రభుత్వాలు తమ విధులను నిర్వర్తించకపోతే పరిపాలన స్థంభిస్తుంది. ఎన్నికైన కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు తమ పరిధిలో ఉన్న ప్రజలకు అవసరమైన సేవలు అందించాలి. దిగువస్థాయిలో ఉన్న ప్రభుత్వాలు, ప్రజల చేత ఎన్నుకోబడిన సంస్థలు తమ విధులను నిర్వర్తించటానికి, ప్రజలకు అవసరమైన సేవలు అందించటానికి పైస్థాయిలో ఉన్న ప్రభుత్వాలు ఎటువంటి ఆటంకాలు కలిగించకూడదు. అవి వాటి విధులను సక్రమంగా నిర్వర్తించేలా

సహకరించాలి.

ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవటం లక్ష్యంగా ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలకు గవర్నర్‌లను నియమిస్తున్నారు. ఆ విధంగా పని చేయటం కోసం కరుడు కట్టిన ఆర్‌ఎస్‌ఎస్ నేతలను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇచ్చి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమిస్తున్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వాలను పని చేయకుండా నిరోధించటమే లక్ష్యంగా ఈ గవర్నర్లు పని చేస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడు, కేరళ గవర్నర్లు ఈ వరుసలో ముందు పీఠీన ఉన్నారు. గవర్నర్లుగా రాజ్యాంగం తమకు నిర్దేశించిన విధులను నిర్వహించకుండా, ప్రతిపక్షాలను దెబ్బ తీయటం, రాష్ట్ర ప్రభుత్వాలను పని చేయకుండా ఆటంకాలు కల్పించటంలో వీరు తలమునకలై ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు పోటీ అధికార కేంద్రాలుగా వ్యవహరిస్తున్నారు. ఇటువంటి గవర్నర్లను తప్పనిసరిగా ప్రజలెన్నుకున్న ప్రభుత్వానికి జవాబుదారిగా ఉండేలా చేయాలి. లేకపోతే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది నిరంకుశ శక్తులు బలపడతాయి.

> “ రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవటం లక్ష్యంగా ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలకు గవర్నర్‌లను నియమిస్తున్నారు. ఆ విధంగా పని చేయటం కోసం కరుడు కట్టిన ఆర్‌ఎస్‌ఎస్ నేతలను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇచ్చి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమిస్తున్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వాలను పని చేయకుండా నిరోధించటమే లక్ష్యంగా ఈ గవర్నర్లు పని చేస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడు, కేరళ గవర్నర్లు ఈ వరుసలో ముందు పీఠీన ఉన్నారు. ”

**టిడిపి అవకాశవాదం**

ఈ విషయంలో టిడిపి పూర్తి అవకాశవాదంతో వ్యవహరిస్తున్నది. ప్రజలు ఎన్నుకున్న టిడిపి ప్రభుత్వాన్ని ఆనాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రధానమంత్రి ఇందిరాగాంధి 356 అధికరణాన్ని ఉపయోగించి కూల్చివేసింది. ఆనాడు రాష్ట్రంలోని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు టిడిపితో కలిసి జరిపిన ప్రజాస్వామిక ఉద్యమంలో ప్రజలు ఉవ్వెత్తుగా కదిలారు. ఎన్నికైన ప్రభుత్వ కూల్చివేతకు వ్యతిరేకంగా లక్షలాదిగా ఉద్యమించిన ఆంధ్రప్రజలు ఢిల్లీ పీఠాన్ని కదిలించారు. ప్రజా ఉద్యమానికి తల వంచిన ఇందిరాగాంధి ప్రభుత్వం ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని తిరిగి పునరుద్ధరించక తప్పలేదు. భారతదేశ చరిత్రలో ఒకసారి రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని పునరుద్ధరణ చేయించటం ద్వారా తెలుగు ప్రజలు చరిత్ర సృష్టించారు.

అటువంటి తెలుగదేశం పార్టీ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అత్యంత దయనీయమైన స్థితికి పోయింది. ఢిల్లీ పాలకుల అడుగులకు మడుగులొత్తటంలో కనీస మర్యాదలను కూడా పక్కన పెట్టి, “తానా అనకముందే మోడికి తందాన” అంటున్నది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొనసాగటానికి టిడిపి ఆక్సిజన్ అందిస్తున్నది. గవర్నర్ల దుశ్చర్యలతో అధికారం కోల్పోయిన టిడిపి గవర్నర్లకు అపరిమితమైన అధికారాలు ఉండాలని బిజెపి ప్రభుత్వం సుప్రీంకోర్టులో చేస్తున్న వాదనలపై నోరు మెదపటం లేదు. బిజెపి భస్మాసుర హస్తం వ్యతిరేకులనే కాదు. ఎన్‌డిఎలోని భాగస్వాములను కూడా మింగివేస్తుంది. తన అవకాశవాద విధానాల ద్వారా చంద్రబాబునాయుడుతో పాటు తెలుగుదేశం పార్టి నాయకులు ఎవరూ బిజెపి నాయకుల ముందు నోరెత్తే పరిస్థితి లేకుండా చేసుకున్నారు. ఈ లొంగుబాటు విధానాలను ఇలాగే కొనసాగిస్తే తెలుగుదేశం ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుంది. 2019లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీ రాజ్యసభ సభ్యులను గంపగుత్తగా బిజెపి మింగివేయటాన్ని అది గుర్తు చేసుకోవాలి. ఇదే విధంగా వంగి వంగి దండాలు పెడుతుంటే ఇపుడు అధికారంలో ఉండగానే మొత్తం పార్టీని మింగినా ఆశ్చర్యం లేదు. అందువలన ఆత్మహత్యా సదృశ్యమైన విధానాలను విడనాడి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించటం, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడడం రాష్ట్రానికి ఆ పార్టీకి కూడా మంచిది. ❋

---

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

**హిందూత్వ వాదం సైన్సుకు ప్రమాదం - 2**

# ప్రాచీన భారత దేశంలో సైన్సు సంప్రదాయం


రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

**ఎస్ వెంకట్రావు**

ప్రాచీన భారత దేశంలో సైన్సు సంప్రదాయం ఉంది. క్రీస్తుపూర్వం 2500 సంవత్సరాల నాడే విలసిల్లిన సింధులోయ నాగరికతలో తూనికలు, కొలతల వ్యవస్థ ఉండేది. క్షేత్ర గణితం అభివృద్ధి చెందకుండా ఉంటే వారు ఆనాడు అంతటి క్రమబద్ధ మైన నగరాలు నిర్మించగలిగేవారు కాదు. చక్రం సింధునాగరికత నాటికే భారత దేశంలో కనుగొనబడింది. తరువాతి కాలంలో మన దేశంలో వైద్య, ఖగోళ, గణిత శాస్త్రాల్లో అనేక విజయాలు సాధించబడినాయి.

వాస్తవమేమంటే ఆనాడే భారత దేశంలో 'నిరూపణ ఆధార' (ఎవిడెన్స్ బేస్డ్) సైన్సు అభివృద్ధి చెందిందనీ, క్రతువుల ప్రాతిపదికగా సాగే ఆయుర్వేద వైద్యంతో ఈ వైద్యం విడగొట్టుకోడానికి ప్రయత్నించిందన్న విషయాన్ని నేడు 'అన్నీ వేదాలోనే ఉన్నాయష' అని వాదించే మతతత్వవాదులు తెలుసుకోవడం లేదు. ఉదాహరణకు, క్రీస్తు శకం తొలి శతాబ్దాలకు చెందిన చరక సంహిత, శుశ్రుత సంహితల్లో నిరూపణ ఆధార వైద్య విధానాన్ని రూపొందించారు. చరకుడు వైద్యంలో ప్రత్యక్ష జ్ఞానాన్ని ఉపయోగించడం ప్రవేశపెట్టారు. శుశ్రుతుడు శస్త్ర చికిత్సలు అభివృద్ధి చేశాడు. అంటే రక్తం, చీము ఇతర 'అశుద్ధ' మానవ భాగాలను చేతులతో పట్టుకోవడం జరిగింది. ఒక వేదంగా పరిగణించబడిన ఆయుర్వేదాన్ని బ్రాహ్మణులు ఆచరించేవారు. దాన్ని వారు ప్రత్యక్ష జ్ఞానంతో సంబంధం లేని ఒక అతీంద్రియ స్థాయికి తీసుకుపోయారు. అయితే ఈనాడు ఆయుర్వేదం పేరుతో సాగుతున్న మూలికా వైద్యానికి నాటి ఆయుర్ 'వేదానికి' సంబంధం లేదు. మొక్కలు, మూలికలతో వ్యాధులు నయం చేయడం అనేది సామాన్య ప్రజలు తమ నిత్యజీవిత అనుభవం నుండి నేర్చుకున్నారు.

శుశ్రుతుడు నిజమైన కాస్మెటిక్ సర్జరీని అభివృద్ధి చేశాడు. ఆయన ముక్కు, చెవులకు కాస్మెటిక్ సర్జరీ (చర్మాన్ని అతికించడం) చేసినట్లు గ్రంధాలు చెబుతున్నాయి. (అయితే మోడీ చెబుతున్నట్లు ఏనుగు తలను, మనిషి మొండానికి తగిలించే కాస్మెటిక్ సర్జరీలు కావవి). ప్రాచీన కాలం నాటి కాస్మెటిక్ సర్జరీలు బ్రిటిష్ కాలం వరకు ఉండేవన్న విషయం ఒక బ్రిటిష్ వారి నివేదికలు చెబుతున్నాయి. మహారాష్ట్రలో కుమ్మరి కులానికి చెందిన వైద్యుడు కాస్మెటిక్ సర్జరీలు చేసేవాడని వారు రాశారు. నిజానికి నాటి బ్రిటన్‌లో కూడా వైద్య విద్యార్ధులు ప్రాచీన గ్రంధాలు, తర్కశాస్త్రం చదువుతుంటే, క్షురకులు సర్జరీలు చేసేవారు.

వైద్యంతోపాటు గణితంలో కూడా ప్రాచీన భారత దేశంలో అనేక విజయాలు సాధించబడ్డాయి. పైథాగరస్ థియరమ్ కన్నా ముందే భారతీయులకు ఆ థీయరమ్ తెలుసునని సంఘ్ పరివార్ వాదిస్తోంది. బ్రాహ్మణ, యజ్ఞయాగల్లో భాగంగా ఉన్న వేదాంగ జోతిష్యంలో సులభ సూత్రాలు హోమగుండం కొలతలను గురించీ అందులో భాగంగా లంబ కోణ త్రిభుజ కొలతల మధ్య, పొడవు వెడల్పుల మధ్య సంబంధాల గురించి తెలుసుకున్నారు. అయితే అదే కాలంలో ఈ విషయాలు ఈజిప్టు, (పిరమిడ్లు) బాబిలోన్ (మట్టి ఫలకలు) చైనా (గో-గు, వెడల్పు-పొడవు) దేశాల్లో కూడా తెలుసు. దీనివల్ల ఆనాడు ఆయా దేశాల మధ్య రాకపోకలు, వ్యాపార వాణిజ్యాలతోపాటు విజ్ఞాన మార్పిడి కూడా జరిగిందని అర్ధమవుతుంది.

ప్రాచీన భారత దేశంలో గణితంలో సాధించిన విజయాలు యావత్ ప్రపంచానికే మార్గదర్శనం చేశాయని చెప్పవచ్చు. ముఖ్యంగా భారత్‌లో జరిగిన మూడు ఆవిష్కరణలు నేటికీ గణితానికి ఆధారంగా ఉన్నాయి. అవి 1. స్థాన-విలువ భావన, 1 దశమ (10) ప్రాతిపదిక, 3. సున్నాను ఒక సంఖ్యగా వాడడం. అర్యభట్టు ప్రాచీన భారత గణితానికి పితామహుడు. ఆయన క్రీస్తుశకం 476లో రాసిన ఆర్యభట్టీయంలో స్థాన-విలువ భావనను ప్రవేశపెట్టారు. "స్థానం, స్థానం దశ గుణం" (ఒక స్థానం నుండి మరోస్థానానికి పెరిగే కొద్దీ పదితో హెచ్చవేయాలి) అని ఆయన ప్రతిపాదించాడు. దీంతోపాటు భారతీయ సంఖ్యా పద్ధతి ప్రస్తుతం ఉపయోగిస్తున్న సంఖ్యా సింబల్స్‌ను కూడా రూపొందించింది. బ్రాహ్మీ లిపి నుండి ఈ సంఖ్యలను గ్రహించడం జరిగింది. ఆనాడు సామాన్యులు మాట్లాడే ప్రాకృతిక భాషను బ్రాహ్మీలిపిలో రాసేవారు. జైనులు తమ గణిత ప్రతుల్లో ఈ భాషను వాడారు. జైనుల గణిత సిద్ధాంతాలు పైథాగరస్ అనుయాయుల గణిత సిద్ధాంతాలను పోలి ఉండేవి. పైథాగరియన్లకూ జైనులకూ అదాన ప్రదానాలు ఉండేవి. జైనుల గణిత గ్రంథాలు బ్రాహ్మణుల వేద, వేదాంగ జ్యోతిష్య గ్రంథాల్లా క్రతువులతో నిండి ఉండేవి కావు. గ్రీసులో పైథాగరస్ అనుయాయుల మాదిరిగానే జైనులు గణితం మానవుని చైతన్యాన్ని ఉన్నత స్థితికి తీసుకుపోతుందని నమ్మేవారు.

ఉదాహరణకు క్రీస్తు శకం 476లో జన్మించిన ఆర్యభట్టు దశమ స్థానాన్ని కనుగొనడనమే కాదు గణితంలో అతి ముఖ్యమైన "పై" విలువను దాదాపు కచ్చితంగా కనుగొన్నాడు. ఆయనతోపాటు బ్రహ్మగుప్తుడు, భాస్కర-1 (క్రీ॥శ॥ 5 నుండి 7వ శతాబ్దం మధ్య) ఆ తరువాత వచ్చిన భాస్కర -2 (క్రీ॥శ 12వ శతాబ్దం) ట్రిగనో మెట్రిక్ (త్రికోణ మితి) గణితంలో ఎంతో గొప్ప విజయాలు సాధించారు. దీనికి నేడు కేరళ శాస్త్రవేత్తల

బృందంగా చెబుతున్న మాధవ, నీలకంఠ (క్రీ।।శ।। 14 నుండి 18 శతాబ్దం మధ్య) గణితానికి ఎంతగానో తోడ్పడ్డారు.

ప్రాచీన కాలంలో దేశంలో ఇంతగా అభివృద్ధి చెందిన సైన్సు తరువాతి కాలంలో ఎందుకు ముందుకు సాగలేదు? సంఘ్ పరివార్ చెబుతున్నట్లు ముస్లింల దండయాత్రలో, ఇంకొకటో కారణం కాదు. సంఘపరివార్ ఆరాధించే మధ్యయుగాల నాటి కుల వ్యవస్థ దీనికి కారణం. గ్రీకు సైన్సు మీద గొప్ప పరిశోధన చేసిన విద్యావేత్త బెంజమిన్ ఫారింగ్టన్ మాటల్లో చెప్పాలంటే మెదడుకూ, చేతికీ సంబంధం తెగిపోవడం వల్లనే ప్రాచీన సైన్సు మధ్య యుగాల్లో పురోగమనం కోల్పోయి స్తబ్ధతలో పడింది. గ్రీక్, రోమన్ బానిస వ్యవస్థల్లో సైన్సు ఏ విధంగా అడుగంటిందో వివరిస్తూ ఆయన ఈ విషయం చెప్పాడు. కానీ అది భారత దేశ కుల వ్యవస్థకు మరింత ఎక్కువ వర్తిస్తుంది.

ఆలోచనకూ, పనికీ మధ్య లంకె తెగిపోతే.. ఇంకా అధమం ఏమంటే పని అనేది ఆలోచన కింద బానిసగా మారిపోతే అప్పుడు పనీ, ఆలోచనా రెండూ తమ సృజనాత్మకతను కోల్పోతాయి. భారత దేశం కుల వ్యవస్థ కూడా పనినీ, ఆలోచనకూ మధ్య లంకె తెగ్గొట్టింది. చివరికి చేత్తో రాయడం కన్నా మెదడుతో బట్టీ కొట్టడం గొప్ప విసయంగా పరిగణించబడింది. అందువల్లనే మన వేదాలు అనేక శతాబ్దాల పాటు రాతకు నోచుకోలేదు. పనిముట్లు ఉపయోగించి పనిచేయడం "క్రింది కులాల" పని. "ఆలోచించడం" అగ్రకులాల పని. అందువల్ల "గొప్ప జ్ఞానానికి" పనిముట్లు లేకుండా పోయాయి. ఆచరణతో అస్సలు సంబంధం లేనిది 'స్వచ్ఛమైన జ్ఞానం" అయింది. పనిపట్ల చిన్న చూపు, అది కింది కులాల వారికి చెందినది అనుకున్నప్పుడు కేవలం ఆలోచనతో చేసే కృషికి ఆధిపత్య వర్గాలు ప్రాధాన్యతనిచ్చాయి. అందువల్లనే భారత దేశంలో ఆలోచనకే ప్రాధాన్యం గల గణితం బాగా అభివృద్ధి చెందింది. గణితాన్ని కూడా గురుశిష్యుల మధ్య ఒకరు చెప్పడం, మరొకరు వినడం అవసరమైనప్పుడు "ధూళి కర్మ" అంటే నేలమీద దుమ్ములో రాయడం ద్వారానే అభివృద్ధి చెందింది గానీ దాన్ని రాతపూర్వకంగా నిల్వ చేయలేదు. కేవలం వారు బట్టీ పట్టడానికి ఉపయోగపడేందుక రాసిన మేరకే మనకు నాటి గణిత శాస్త్ర విజయాలు అందుబాటులోకి వచ్చాయి.

> **"చారిత్రకంగా విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు మతం పేరుతో నిలదొక్కుకున్న మూఢనమ్మకాలను సవాలు చేశాయి. కానీ ఇప్పుడు భారత దేశంలో దీనికి వ్యతిరేక దిశలో జరుగుతోంది. బిజెపి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత మతమూఢభావాలు సైన్సును సవాలు చేస్తు న్నాయి. పాఠ్యాంశాలలో సైన్సును తొలగించి మూఢనమ్మ కాలను ప్రవేశపెడు తున్నారు."**

ఇతర దేశాల్లో ప్రభువర్గం శారీరక శ్రమ పట్ల చిన్నచూపు చూస్తే భారత దేశంలో ఘనీభవించిన కుల వ్యవస్థ చేతిపనిని 'అపరిశుభ్రంగా' భావించింది. కుల వ్యవస్థ మన దేశంలో ఆలోచనకూ, చేతికీ మధ్య తీవ్రమైన అగాధాన్ని సృష్టించింది.

**తమ వాదాలకు అడ్డువచ్చే ఆధునిక విజ్ఞాన శాస్త్రాన్ని తిరస్కరించడం**

2018లో నాటి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ డార్విన్ పరిణామవాదం "శాస్త్రీయంగా తప్పు. ఎందుకంటే "నరవానరం మనిషిగా మారడాన్ని ఎవరూ చూడలేదు'' అని సెలవిచ్చారు. పాఠశాల, కళాశాల పాఠ్యాంశాల నుండి డార్విన్ పరిణామవాదాన్ని గురించి చెప్పే చాప్టర్ తొలగించాలని సూచించారు. ఈ ప్రకటనతో దిగ్భ్రాంతికి గురైన శాస్త్రవేత్తలు మంత్రి ప్రకటనను విమర్శిస్తూ మానవ వనరుల అభివృద్ధి (హెచ్ఆర్డి) మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాశారు. పరిణామవాదం తప్పు కాదు, మంత్రి చెప్పిందే పూర్తిగా తప్పు అని వారు లేఖలో పేర్కొంటూ నిజానికి "డార్విన్ తరువాత జరిగిన ప్రతి పరిశోధనా డార్విన్ సిద్ధాంతాన్ని బలపరిచాయి" అని వారు పేర్కొన్నారు. అయితే జాతీయ విద్యా పరిశోధనా మండలి (ఎన్సిఆర్టి) శాస్త్రవేత్తలు చెప్పిన దాన్ని చెవిని పెట్టకుండా ఇటీవల 9, 10 తరగతుల పుస్తకాల నుండి డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించింది. 11, 12 తరగతుల్లో కూడా పరిణామవాదం – అనువంశికత (ఇవల్యూషన్ అండ్ హెరిడిటీ) అనే పాఠ్యాంశం నుండి పరిణామవాదం భాగాన్ని తొలగించి అనువంసికతను మాత్రమే ఉంచింది. సిలబస్ తగ్గింపు పేరుతో ఈ పని చేసినప్పటికీ అసలు ఉద్దేశం మాత్రం బిజెపి దాని సైద్ధాంతిక గురువు అయిన ఆర్ఎస్ఎస్ తిరోగమన ఎజెండాలో భాగంగానే ఈ పనిచేసిందనేది స్పష్టం.

ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రభుత్వం ఎందుకిలా చేస్తోంది? ఎందుకంటే ఆర్ఎస్ఎస్ మతతత్వ సిద్ధాంతానికి హేతుబద్ధ పరిశోధనతో కూడిన పరిణామవాదం వ్యతిరేకమైనది. పరిణామవాదాన్ని పిల్లలు చిన్నతనం నుండి అధ్యయనం చేస్తే ఆర్ఎస్ఎస్ మతతత్వ సిద్ధాంతాన్ని వ్యాపింప జేయడం కష్టమవుతుందనే దాన్ని తొలగించడానికి పూనుకున్నారు.

నిజానికి ప్రపంచంలో ఏ దేశంలోనైనా సరే సైన్సును వ్యతిరేకించే మితవాదుల మొదటి వేటు డార్విన్ పరిణామ వాదం మీదనే పడుతుంది. అమెరికాలో నాటి అధ్యక్షుడు జార్జిబుష్ దగ్గరినుండి నిన్న మొన్నటి డొనాల్డ్ ట్రంప్ వరకు కన్సర్వేటివ్లు అధికారంలో ఉన్న కాలంలో అనేక రాష్ట్రాల్లో డార్విన్ పరిణామ వాదాన్ని పాఠశాల సిలబస్ నుండి తొలగించా లనే ప్రయత్నాలు జరిగాయి. కొన్ని చోట్ల దాన్ని తొలగిస్తే, మరికొన్ని చోట్ల పరిణామవాదాన్నీ, సృష్టి వాదాన్ని (జెనిసిస్) రెంటినీ సిలబస్లో పెట్టి విద్యార్థులను గందరగోళంలో పడేశారు.

చారిత్రకంగా విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు మతం పేరుతో నిలదొక్కుకున్న మూఢనమ్మకాలను సవాలు చేశాయి. కానీ ఇప్పుడు భారత దేశంలో దీనికి వ్యతిరేక దిశలో జరుగుతోంది. బిజెపి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత మతమూఢభావాలు సైన్సును సవాలు చేస్తున్నాయి. పాఠ్యాంశాలలో సైన్సును తొలగించి మూఢనమ్మకాలను ప్రవేశపెడుతున్నారు.

ఆర్ఎస్ఎస్ అనుయాయులు వాట్సాప్ యూనివర్శిటీ అనేదాన్ని ప్రారంభించారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా ఆధారం లేని, రుజువుకాని, అశాస్త్రీయ మూఢభావాలను ప్రచారం చేయడమే ఈ 'యూనివర్శిటీ' పని.

❊

# కందుకూరి వీరేశలింగం

*(2వ పేజీ తరువాయి)*

ఒక గొప్ప సాహసం. ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలు చెప్పడంతో పాటు సంఘసంస్కరణ భావాల్ని బోధించాడు. సమాజంలోని దురాచారాలపై తన భావాలను వ్యాప్తి చేయటానికి 1874 అక్టోబర్లో "వివేకవర్ధిని" అనే పత్రికను స్థాపించాడు. సంఘంలోని అవకతవకలను ఎత్తిచూపటం, మూఢాచారాలు దురాచారాల నిర్మూలన, ప్రభుత్వ వ్యవస్థలో ప్రబలంగా ఉన్న అవినీతిని ఎత్తిచూపి, అవినీతిపరులను సంఘం ముందు నిలబెట్టడం వివేకవర్ధిని లక్ష్యాలు అని ఆయన మొదటి సంచికలోనే తెలియజేశారు. చెప్పటమే కాదు అలాగే నడిపారు కూడా. మాట తప్పకుండా చెప్పింది చేయటం మూలంగా వివేకవర్ధని అవినీతి పరులు పాలిటి సింహస్వప్నమైంది.

ఒకసారి ఒక యోగిని..బొందితో స్వర్గానికి వెళ్లే రహస్యాలు నా దగ్గర ఉన్నాయని పత్రికలో ప్రచారం చేసుకుంటూ ఉంటే, ఆ యోగిని చెప్పేవి తప్పు అని వీరేశలింగం తన పత్రికలో రాశారు. ఆ యోగిని భక్తుడు ఒకరు వీరేశలింగం మీదకు పోట్లాటకు వచ్చాడు. బెదిరించాడు. నీవు ఏం చేసినా నేను నా అభిప్రాయానికి కట్టుబడి ఉంటాను, ఆమె దొంగ యోగిని అని వీరేశలింగం అడ్డం తిరిగేసరి ఆ భక్తుడు తోకముడిచాడు. ఆ విధంగా ఆ పత్రికను ధైర్యంగా నడిపారు వీరేశలింగం. రాజమండ్రిలో ఒక జిల్లా జడ్జి లంచాలు పుచ్చుకుంటూ లాయర్లకు అర్హత పత్రాలు ఇస్తుంటే దాన్ని తన పత్రికలో రాశారు వీరేశలింగం. దానితో ఆ జిల్లా జడ్జి హైకోర్టులో కేసు వేశారు. వీరేశలింగం హైకోర్టుకు వెళ్లి పోరాడి ఆయన నిజంగా లంచాలు తీసుకొని సర్టిఫికెట్లు ఇస్తున్నాడని నిరూపించాడు. దానితో ఆ జిల్లా జడ్జిని ప్రభుత్వం తొలగించింది. ఆ విధంగా అవినీతి మీద నిరంతర రంయంగా పోరాడాడు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, కుల నిర్మూలన కోసం అకుంఠిత దీక్షతో పని చేశారు వీరేశలింగం. వేశ్యవ్యవస్థ పాతుకుపోయిన ఆ రోజుల్లో దానికి వ్యతిరేకంగా వివేకవర్ధనిలో అనేక వ్యాసాలు రాశారు. 1887వ సంవత్సరంలో "సంఘసంస్కరణ సమాజం" అనే సంస్థను స్థాపించి హైందవ సమాజంలో మతం ముసుగులో సాగుతున్న దురాచారాలపై తిరుగుబాటు ప్రకటించాడు. ప్రజల్లో పాతుకుపోయిన మూఢవిశ్వాసాలపైనా, సనాతన ఆచారాలపైనా పోరాటం జరిపాడు. విగ్రహారాధన, పూజలు మొదలైన వాటిని వ్యతిరేకించాడు. దయ్యాలు భూతాలు లేవని చెప్పాడు. ప్రజలకు ఆ విషయాన్ని నిరూపించడానికి అర్ధరాత్రి స్మశాన వాటికకు వెళ్లి నిద్రపోయాడు.

వీరేశలింగం చేసిన సంస్కరణ కార్యక్రమాలన్నీ ఒక ఎత్తు వితంతు పునర్వివాహాలు మరొక ఎత్తు. చిన్న వయసులో పిల్లలకు వివాహం జరిపించడం ఒక అనాచారమైతే, పెద్ద వయసు ముసలి వాళ్లకు పసివయసు పిల్లలను ఇచ్చి పెళ్లి చేయటం మరో దుష్టాచారం. ముక్కు పచ్చలారని పిల్లలకు పెద్ద వయసు ఉన్న వ్యక్తికి ఇచ్చి వివాహం చేసేవారు. కాపురానికి పోకముందే భర్తలు చనిపోతే భార్యగా ఉన్న ఆమె వితంతువు అయ్యేది. ఆ బాలికకు ఇక అచ్చట ముచ్చట ఉండవు. అలంకరణ ఉండదు. శుభ కార్యకలాపాలలో పాల్గొనటం ఉండదు. జీవితాంతం పుట్టింట వంటింటిలోనో, అరుగు మీదనో ఉంటూ చాకిరి చేస్తూ ఒంటరి బతుకు ఈడ్చాల్సిందే. ఇటువంటి వితంతువుల విషాద గాథలు కందుకూరిని కలవరపెట్టాయి. బాలవితంతువుల జీవితాలు అలా మోడు బారి పోకూడదని వితంతు వివాహాలు సమర్థనీయమే అని చాలా చోట్ల ఆయన సమావేశాలు ఏర్పాటు చేశారు. ఉపన్యాసాలు చేశారు. అయితే స్త్రీ పునర్వివాహం శాస్త్ర సమ్మతం కాదని కొక్కొండ వెంకటరత్నం లాంటివారు కొన్ని పుస్తకాలు కూడా రాశారు. దాంతో పండితులను ఒప్పించేందుకు వీరేశలింగం తన మిత్రుడు చల్లపల్లి బాపయ్య పంతులతో కలిసి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమాజంలో ఉన్న పెద్ద వాళ్ళందరిని పిలిచి వితంతు వివాహం సమర్థనీయమే నంటూ యజ్ఞ వల్క్య స్మృతి, మనుస్మృతి, పరాశర స్మృతి లాంటి శాస్త్రాల నుండి ఉదాహరణలతో సహా వివరించారు. ఆ సమావేశానికి వచ్చిన సాంప్రదాయవాదులు, చాందసవాదులు అందరూ కూడా వీరేశలింగాన్ని దూషించారు. వితంతువులకు వివాహం చేయటం ఏమిటి? విడ్డూరం అని అనడమే కాకుండా ఈయన మీద దౌర్జన్యానికి కూడా వచ్చారు. అయినా ఆయన వెనకడుగు వేయలేదు దీన్నొక ఉద్యమంలలా ముందుకు తీసుకువెళ్లాలని కొంతమంది సభ్యులతో "స్త్రీ పునర్వివాహ సమాజం" అనే దాన్ని స్థాపించారు. ఆ సమాజం ఏడు సంవత్సరాలు పాటు ఎన్నో సమావేశాలు ఉద్యమాలు నిర్వహించాక స్త్రీ పునర్వివాహం అన్నది కార్యరూపం దాల్చింది. చాలామంది యువకులు ఈ ఉద్యమంతో ప్రభావితమై వితంతు వివాహం చేసుకోవడానికి ముందుకు వచ్చారు. ఈ ఉద్యమానికి కాకినాడకు చెందిన పైడా రామకృష్ణయ్య ఆర్థిక సహాయం అందించారు. దానితో వీరేశలింగానికి గారికి కొంత భరోసా ఏర్పడింది. న్యాపతి సుబ్బారావు పంతులు, బసవరాజు గవరరాజు, ఆత్మూరి లక్ష్మీ నరసింహ, కొమ్మూరి రామలింగ శాస్త్రులు లాంటి వారితో ఒక కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నిర్వహించిన మొదటి వితంతు వివాహం ఒక పెద్ద పోరాటంలాగా సాగింది. తిరువూరు తాలూకాలో ఒపూడి గ్రామంలో చిన్నప్పుడే భర్త చనిపోయిన బాల వితంతువు గౌరమ్మ కు పునర్వివాహం చేయటానికి ఆమె తల్లిదండ్రులు అంగీకరించడంతో ఆమెను రాజమండ్రికి రప్పించారు. వీరేశలింగం ఇంట్లో ఉండి చదువుకున్న 22 ఏళ్ల గోగులపాటి శ్రీరాములును వితంతు వివాహానికి ఒప్పించారు. అతనికి అప్పటికే మొదటి భార్య చనిపోయి నాలుగైదు నెలల పిల్లవాడు ఉన్నాడు. 1881 డిసెంబర్ 1న ముహూర్తం పెట్టారు. అందరికీ చెప్పారు. ముహూర్తం ప్రకటించగానే అప్పటివరకు ఆయనకు సంపూర్ణ సహకారం ఇచ్చిన వాళ్ళు సంఘ బహిష్కరణ జరుగుతుందేమోనన్న భయంతో వెనకడుగు వేశారు. ఇంట్లో వంట చేసే వంట మనిషి, నీళ్లు పోసేవారు కూడా రాకుండా పోయారు. పురోహితుడు పెళ్ళిచేయడానికి రాను పొమ్మన్నాడు. ఈయనకు మొదటి నుంచి అండదండలు అందిస్తున్న బాపయ్య పంతులు, న్యాపతి సుబ్బారావు పంతులును వారి కుటుంబ సభ్యులు పెళ్లికి రాకుండా ఇంట్లో పెట్టి తాళం వేశారు. వీరేశలింగం దాదాపు ఒంటరిగా మిగిలిపోయారు. కానీ ఎలాగైనా సరే ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిందే వెనకడుగు వేయరాదనే నిశ్చయించుకున్నాడు. అనుకున్న ముహూర్తం ప్రకారం వివాహానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఏం జరుగుతుందో చూద్దామని కొంతమంది మాత్రం వచ్చారు. వంట వాళ్ళు ఎవరూ లేనందున వీరేశలింగం గారి భార్య అయిన రాజ్యలక్ష్మి స్వయంగా గోదారి నది వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చి వంట చేసి వివాహానికి హాజరైన వారికి భోజనం తయారు చేసి వడ్డించారు. కార్యక్రమం అయితే సవ్యంగా, సజావుగా జరిగిపోయింది. ఆ వివాహానికి వచ్చిన కొద్దిమంది ఇంటికి వెళ్ళగానే వాళ్ళ వాళ్ళ కుటుంబ సభ్యులు ప్రాయశ్చిత్తం చేసుకోమని, స్నానం చేసి గాని ఇంట్లోకి రావద్దని, కొన్నాళ్లపాటు బయటే ఉండమని రకరకాల నిర్బంధాలు విధించారు.



రాజమండ్రిలో హితకారిణి సామాజం కార్యాలయం

మొత్తంమీద ఈ మొట్టమొదటి వితంతు వివాహ ప్రభావం సమాజం మీద బాగానే పడింది. తొలి వివాహం జరిగిన నాలుగో రోజునే రెండో వితంతు వివాహం కూడా చేశారు. ఈ వివాహానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. అంతేకాకుండా ఆంగ్లేయులైన రాజమండ్రి జిల్లా జడ్జి మెజిస్ట్రేట్, కాలేజీ ప్రిన్సిపాల్ ఆ వివాహానికి వచ్చి 60 మంది పోలీసులను ఆ ఇంటి చుట్టూత బలగంగా మోహరించారు. వధూవరులిద్దరినీ పల్లకిలో ఊరేగించి మామూలు వివాహం ఎలా జరుగుతుందో అంత వైభవంగా ఆ వితంతు వివాహాన్ని పూర్తి చేశారు. ఈ విధంగా రెండు కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి కావడంతో వీరేశలింగానికి ధైర్యం రావటమే కాకుండా ఆయన్ని సమర్థించే వారందరికీ కూడా ధైర్యం వచ్చి ఆ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారు. ఆ తర్వాత ఆయన దాదాపు అలాంటి వితంతు వివాహాలు 40 కి పైగా చేశారు. వివాహం చేయడమే కాదు ఆ బంధం చిరకాలం ఉండాలన్నా, సమాజం నుండి వచ్చే బెదిరింపులు ఎదుర్కోవాలన్నా వారికి ఆర్థిక సహాయం కూడా అవసరం. పైడా రామకృష్ణయ్య గారు ఇచ్చిన ఆర్థిక సహాయంతో ఒక ట్రస్టు ఏర్పరిచి వారికి ఆర్థికంగా తోడ్ప డ్డారు. అలాగే వాళ్లకి ఏవైనా ఉద్యోగాలు, ఉపాధి చూపించడం లాంటి పనులు కూడా చేశారు.

వీరేశలింగం తన సంఘసంస్కరణోద్య మాన్ని ప్రచారం చేసేందుకు గాను అరడజను పత్రికలను స్థాపించాడు. "వివేకవర్ధిని"తోపాటు, "సతీ హిత బోధిని", "సత్యవాదిని", "చింతా మణి","సత్య సంవర్ధిని","తెలుగు జనానా" లాంటి పత్రికలు ఆయన ఉద్యమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్ళటానికి ఈ పత్రికలు ఎంతగానో దోహదపడ్డాయి.

సాహిత్యంలో కూడా వీరేశలింగం ఎనలేని కృషి చేశారు. చదువుకునే రోజుల్లోనే మొదలైన ఆయన సాహిత్య ప్రస్థానం ఎన్నో గొప్ప రచనలకు ఆలవాలమైంది. వ్యవహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. ఆయన 130కి పైగా గ్రంధాలు రచించారు. ఆయన రాసిన 'రసిక జన మనోరంజనం' పుస్తకాన్ని ఎఫ్ఎలో పరీక్షలకు పాఠ్యగ్రంధంగా పెట్టారు. ఆ రోజుల్లో బందర్ నుండి 'పురుషార్ధ ప్రదాయని' అనే పత్రిక వచ్చేది. దాంట్లో 'శుద్ధాంధ్రఉత్తర రామాయణం' ను సరళ తెలుగులో రాశారు. ఇంగ్లీషులోని వికారాఫ్ వీక్ ఫీల్డ్ అనే గ్రంధాన్ని స్వేచ్ఛాను సరణగా రాజశేఖర్ చరిత్ర అనే పేరుతో నవలలు రాశారు. ఆ నవలే తొలి తెలుగు సాంఘిక నవల. ఇందులో సాంఘిక దురాచా రాలను, మూఢనమ్మకాలను విమర్శించారు. చక్కని తెలుగు సామెతలను లోకోక్తులను ప్రయోగించారు. ఈయన రాసిన రాజశేఖర చరిత్రను 1887లో కొంతమంది ఇంగ్లీషులో తర్జుమా చేసి "ఫార్ఛ్యూన్ ఫీల్డ్" అనే పేరుతో లండన్‌లో ప్రచురించారు. ఆయన "గలివర్ ట్రావెల్స్" స్ఫూర్తితో తెలుగులో మరొక పుస్తకం రాశారు. పూర్వ దేశ యాత్రలు ఆయన రచనల్లో ప్రముఖమైనవి. అనేక ఇంగ్లీషు సంస్కృత గ్రంథాలను తెలుగులో అనువదించారు. బడి పిల్లల కొరకు వాచకాలు రాశారు. షేక్స్పియర్ నాటకాలను తెలుగులోకి అనువదించి పాఠశాల పిల్లలతో ప్రదర్శింప చేశారు. ఆయన స్వీయ చరిత్రతోపాటు ఆంధ్ర కవుల చరిత్రను రాసి ప్రచురించారు. సంగ్రహ వ్యాకరణం, మార్కండేయ శతకం, శ్రీ రాజమహేంద్ర పురవర గోపాల శతకం, రసిక జనరంజకం అనే ప్రబంధం, అభాగ్యో పాఖ్యానం అనే వ్యంగకావ్యం, సరస్వతీ నారద విలాపం, వ్యవహార ధర్మ బోధిని అనే నాటకం, సత్య రాజాపూర్వ దేశ యాత్రలు అనే నవల, కుల వ్యవస్థను నిరసిస్తూ 'జమా బంది', 'యోగాభ్యాసం', 1883లో స్త్రీ విద్యాభి వృద్ధి ప్రాముఖ్యతను బోధిస్తూ 'సత్యవతి చరిత్రము', 1884లో మత విషయాలను ధర్మాలను స్త్రీ అభ్యుదయాన్ని ప్రోత్సహించే 'చంద్రమతి చరిత్రము'నవల...మొదలైనవి రాశారు. ప్రహసనాలు హాస్య సంజీవిని పేరుతో మూడు భాగాలుగా ప్రచురతమయ్యాయి. అవి : 'మిత్ర వివాహ ప్రహసనం', 'మహా బధిర ప్రహసనం','పునర్ మరణ ప్రహసనం'. 'మహా మహోపాధ్యాయ పరశురాం' వంటి చిన్నచిన్న హ్యూమర్ స్కిట్స్ రాసి వాటిని ప్రదర్శింప చేశారు. అనేక శాస్త్రాలు కూడా రాశారు ''పదార్ధ వివేక శాస్త్రం'', ''శరీర శాస్త్రం","జ్యోతిషశాస్త్రం", జంతు శాస్త్రం. మొదలైవి."నీతి కథా మంజరి" అని 150 చిన్న కథల సంకలనాన్ని కూడా వెలువరించారు. ఒక మనిషి తన జీవితకాలంలో ఇంత కృషి చేయడం అది అనన్య సాధ్యమైన పని. రాజమండ్రిలో తన సొంత డబ్బులతో ఒక టౌన్ హాలు కూడా నిర్మించారు.

ఇంకా ఆయన చేసిన మరొక అద్భుతమైన కార్యక్రమం "హితకారిణి" సమాజం స్థాపించి రకరకాల కార్యక్రమాలను నిర్వహించడం. ఆనాటికి ఆయన దగ్గర ఉన్న రూ. 41,500 విలువైన ఆస్తిని హితకారిణి సమాజానికి చెందేట్లుగా వీలునామా రాశారు. తనకంటూ ఆయనేమీ మిగిల్చుకోలేదు.

తన దేహము, తన గేహము, తన కాలము
తన ధనంబు, తన విద్య, జగజ్జనులకే
వినియోగించిన నరుడీ వీరేశలింగ కవి
జనులారా!

అని వీరేశలింగం గురించి చిలకమర్తి లక్ష్మీనరసింహ రాశారు.

వీరేశలింగానికి అనేకమైన విశిష్టమైన గౌరవాలు లభించాయి. ఉద్యోగంలోనే పనిచేసే టప్పుడు "ఫెలో ఆఫ్ మద్రాస్ యూనివర్సిటీ" ఇచ్చారు. ఆధునిక తెలుగు నాటక రంగంలో తొలి నాటక కర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శన కారుడైన కందుకూరి వీరేశలింగం జన్మదినా న్నీ తెలుగు నాటక రంగ దినోత్సవంగా నిర్ణయించటం జరిగింది.

తెలుగు సమాజంపై చెరగని ముద్ర వేసిన కందుకూరి వీరేశలింగం 1919 మే 27న అనారోగ్యంతో శాశ్వతంగా కన్ను మూశారు.

❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 4 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36



# ప్రపంచ స్మార్ట్ సిటీ ర్యాంకుల్లో 100 లోపు కనిపించని భారత్

మన దేశంలో కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర నాయకుల వరకు ప్రతినిత్యం స్మార్ట్ సిటీల గురించి మాట్లాడుతుంటారు. వాటికోసం వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటనలు చేస్తుంటారు. అయితే ఇటీవల వెలువడిన ప్రపంచ స్మార్ట్ సిటీ ర్యాంకింగ్‌లో భారత దేశంలోని ఏ నగరమూ పైస్థాయి 20 ర్యాంకుల మాట అటుంచితే 100 లోపు రాంకులో కూడా లేదు. ప్రతి సంవత్సరం లాగానే అంతర్జాతీయ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ సంస్థ (ఐఎండి) 2025 సంవత్సరపు స్మార్ట్ సిటీ సూచీని ఇటీవల ప్రకటించింది. పౌరులకు అందించే పట్టణ సదుపాయాలను పెంపొందిస్తూ అదేసమయంలో పట్టణీకరణ వల్ల వచ్చే నష్టాలను నివారించడం కోసం టెక్నాలజీని ఉపయోగించే నగరాలను స్మార్ట్ సిటీలు అని నిర్వచిస్తారు. దీనికోసం భారత ప్రభుత్వం ప్రత్యేకంగా కొన్ని నగరాలు ఎంపికచేసి ప్రత్యేక కేటాయింపులు చేస్తోంది.

ఈ ఏడాది కూడా ప్రపంచ స్మార్ట్ సిటీ ర్యాంకింగ్‌లో స్విట్జర్లాండుకు చెందిన జూరిచ్ నగరం ప్రథమ స్థానంలో నిలిచింది. తరువాతి స్థానాల్లో నార్వేకు చెందిన ఓస్లో (2వ ర్యాంకు), స్విట్జర్లండుకు చెందిన జెనీవా (3), యుఎఇకి చెందిన దుబాయ్, అబుదాబి (4,5 ర్యాంకులు), బ్రిటన్ రాజధాని లండన్ (6), డెన్మార్క్‌కు చెందిన కోపెన్‌హేగన్ (7), ఆస్ట్రేలియా నగరం కాన్‌బెర్రా (8), సింగపూర్ (9), స్విట్జర్లాండుకు చెందిన లాసన్నె (10) స్థానాల్లో నిలిచాయి.

భారతీయ నగరాల్లో ఢిల్లీ 104వ స్థానంతో దేశంలో అగ్రభాగాన నిలిచింది. ముంబయి 106, హైదరాబాద్ 109, బెంగళూరు 110 స్థానాల్లో ఉన్నాయి. పట్టణ ప్రాథమిక సదుపాయాల్లో వెనుకబాటు, పరిపాలనా పరమైన లోపాలు, రవాణా సదుపాయాలు సరిగ్గా లేకపోవడం వంటి వాటివల్ల భారత దేశ నగరాలు ప్రపంచ స్మార్ట్ సిటీ సూచీలో వెనుకబడిపోయాయి.

ప్రపంచ స్మార్ట్ సిటీల జాబితాలోని తొలి పది స్థానాల్లో మూడు స్థానాలను స్విట్జర్లాండ్ పొందడం విశేషం. తరువాతి స్థానంలో యుఎఇలోని రెండు నగరాలు మొదటి పదిలో ఉన్నాయి. ప్రపంచ అగ్రరాజ్యమైన అమెరికాకు ఇందులో స్థానం దక్కక పోవడం గమనించదగ్గ విషయం.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. 180 పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా** **పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ......................................................
వీధి .......................................................................
గ్రామం ..................................................................
మండలం లేదా పట్టణం ........................................
జిల్లా .....................................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.